ంధ్రసచిత్రవార

పత్రిక



25 నయాపైసలు

27-7-62


తప్పక చూడండి!
అలంకార్ చిత్ర సమర్పించు....
ఏకైక వీరుడు
దర్శకత్వం: M. నటేశన్...
నిర్వహణ:
P. సాంబశివరావు
మాటలు: మహారథి
పాటలు: వీటూరి
సంగీతం: కోదండపాణి
ERANKI
TARAKA

ఉత్తరాలు

చిత్రవ్యక్తులు

"చిత్రవ్యక్తులు" అన్న కొత్తశీర్షికతో రచయిత సుకుమార్‌గారు నూతన అందాలనటి శారదను గురించి చాలా చక్కగా రాశారు. నిజంగా నటి శారద తెలుగువెండితెరకు వెలుగు.

బి. కృష్ణబాబు (జంగుళూరు)

సందేహం

శారదని పరిచయంచేయడం నిజంగా సంతోషించతగ్గ విషయము. పరిచయంచేస్తూ, "నాగేశ్వరరావుగారు త్రాగి పడినప్పుడు లేవదీయడం" అన్నారు. ఇది "ఇద్దరు మిత్రులు"లో ఎక్కడి సన్నివేశమో తెల్పకోర్తాను.

"సుజాతాదేవి" (కాకినాడ)

చదువుత్రావు

అసలు చదువుత్రావుకు మర్యాద తెలియదు. కాకపోతే మరేమిటండీ! లెక్చరర్ ప్రశ్నవేస్తే కూర్చుని సమాధానము చెప్తాడేమిటే?

భాలకి జయశ్రీ (విజయవాడ)

*   *   *

శ్రీ బి. వి. సత్యమూర్తిగారు (1) ఏం చేస్తున్నారు? (2) అతని వయసెంత? (3) అతని నెలసరి ఆదాయం ఎంత?

ఆర్. భగీరథి (కర్నూలు)

(1) చదువుతున్నారు. (2) పాతికలోపే ఉంటాయి. (3) మాకు తెలీదు.

మనరాష్ట్రం

13—7—62 సంచికలో "పన్నులపెంపకం—ప్రతిపక్షాల విమర్శ" అను శీర్షిక శ్రీ కౌండిన్యగారు వ్రాసినది ముఖ్యాంశము.

ందులో రాష్ట్రం రైతులలో ఎక్కువమంది మధ్యతరగతి, సన్నకారు రైతాంగమే అని, ప్రభుత్వానికి వచ్చే 12 కోట్ల ఆదాయములో ఎక్కువ ఈ బాపతు రైతులనుండేనని, అటువంటివారిని మినహాయించితే ప్రయోజనం ఏమీ ఉండదని, ప్రతంచెడ్డా ఫలం దక్కనట్లవుతుందని వ్రాస్తూ ముగింపులో సామాన్యరైతులకు మరీ భారం లేకుండా కొంత పన్ను తగ్గించడం సమంజసం అని సెలక్టు కమిటీని కోరుటలో భావమేమో?

ఈశన తుకారామ్ (కలకత్తా)

కథ

గుండు మామయ్యోయ్! "ఆయనేవుంటే మువ్వ పొవులా అడుగుదువా" అనేజోకు పెద్ద మీ బామ్మగారు వేసినట్టు వ్రాశారు. అసలాజోకు మొట్టమొదట వేసింది మా బామ్మగారి బామ్మగారు(ట) మా నాన్నగారు చెప్పగా విన్నాను.

ఆర్. డి. మహంతి (కాకినాడ) ★

10-8-'62 ఆంధ్ర సచిత్ర వారపత్రిక నుంచి

కొత్త సీరియల్ ప్రారంభం!

వివరాలు పై సంచికలో

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక
సర్క్యులేషన్ అత్యధికమైనది!

ఆంధ్రసచిత్రవార పత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం. 27—7—62
సంపుటము : 54 సంచిక : 47
శుభ॥ సం॥ ఆషాఢ మాసం॥ బహుళ ఏకాదశి

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకులు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకులు :
శివలెంక రాధాకృష్ణ

*

విడిప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1



నూతన తార జయంతి.

మనలోమాట

'హాయవాతా అద్భుగాథ' ఈ వారంతో అయిపోయింది. కాని లాంగ్ ఫెలో పద్యగాథ అంతా ఈ అనుసరణలో ఇవ్వలేదు! అయినా ఉన్నత పాఠశాలలో చదువుకునే పిల్లలందరూ ఇంగ్లీషుమూలం చదివి ఆనందించే అవకాశం శ్రీ గణపతి శాస్త్రిగారి అనుసరణవల్ల కలిగిందని ఆశిస్తున్నాము.

* * *

ఈ వారం 'ప్రపంచ ప్రముఖులు' చిత్రం మా కార్యాలయానికి చాలా ఆలస్యంగా చేరింది. అసలు ఈ శీర్షిక తప్పిపోతుందేమోనని భయపడ్డాము! కష్టం మీద ఎలాగయితేనేమి ప్రచురించగలిగాము. ఈ మధ్య అడినోవర్, డిగాల్ కలిసిచేసిన ప్రదర్శనలు, ప్రకటనలు ఈ వారం సరియైన ప్రముఖుడినే ఎన్నుకున్నామని పించేట్లు చేశాయి.

* * *

'కాబోయే కథకులకు పనికి వచ్చే చిట్కాలు' పుస్తకాలు అందినట్లు పాఠకులు ఇంకా వ్రాస్తూనే ఉన్నారు. కాని మాకువచ్చే కథలు సంఖ్య మాత్రం పెరగలేదు!

* * *

లోకంపోకడ



"అయ్యా! మద్యనిషేధం అమలు కావాలని నేనూ ప్రచారం చేస్తున్నాను. కాని ఆరోగ్యం బావుండకపోతే త్రాగక చస్తామా చెప్పండి!"


విషయానుక్రమణిక

కథలు

సీరియల్ కథలు

బాలసాహితి

శీర్షికలు



ఉపమంత్రి పదవులు
ఎగరండోయ్ మిఠాయి పొట్లం దొరుకుతుంది!
దక్షిణాది విడిపోతే ఉత్తర భారతం
ఒరిస్సా ముఖ్యమంత్రి పట్నాయక్ అభిప్రాయం
లడక్‌లో భారతీయ గస్తీ స్థావరాల
సైనికులు చుట్టుముట్టారు
చైనా సైనికుల ఉపసంహరణ
లడక్‌లో చైనీయులు మరికొన్ని గస్తీ స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు
లడక్‌లో భారతీయ సైనికులు చైనీయుల గస్తీ స్థావరాలను చుట్టుముట్టారు
లడక్‌లో చైనీయుల దురాక్రమణలు
భారత సైనికులు లడక్‌లో చైనీయులను తరిమివేశారు
ప్రజలు
అంతా అయోమయంగా ఉంది!
కాశ్మీర్‌లో నెహ్రూ
అవినీతి
దోపిడి





లేడీస్ క్లబ్బు

రంగధామ్

నేను జీవితంలో చేసిన పొరపాటు ఏమిటంటే—కమలని పెళ్ళాడడం! నే నిలాగ అనగానే మీరు ఆశ్చర్య పోవచ్చు. 'ఏమిటీ వైపరీత్యం, ఇతని తాలూకా ఉత్తమాంగం రిపేరుకి పంపించాలా ఏమిటి?' అని మీరు ప్రశ్నించుకోవచ్చు. ఒక్క మీరేకాదు, నన్ను ఎరుగున్నవాళ్లంతా, నా జీవితంలో నే చేసిన మంచిపనల్లా కమలని పెళ్ళాడడమేనూ అంటారు. మొదట్లో నేనూ అలాగే అనుకున్నాను.

నిజమే! నేను కమలకోసం ఎంత తాపత్రయ పడ్డానో, ఎన్ని ప్రేమలేఖలు రాశానో, ఎన్నెన్ని అద్భుత కార్యాలు చెయ్యడంకోసం ప్రయత్నించానో ఆమె దృష్టి నాకర్షించడంకోసం బట్టలు ఎంత నీటుగా వేశేవాణ్ణో, జోళ్లకు మామూలు పాలిష్ చాలదని ప్యాన్‌పాలిష్‌చేసి, మెరుస్తూన్న జోళ్లతో ఎలా తిరిగేవాణ్ణో, టెన్నిస్ ఆడుతున్నప్పుడు ప్రేక్షకులలో ఆమెగనకవుంటే ఎంత స్టైలిష్‌గా ఆడేవాణ్ణో తెలిసినవాళ్లెవరూ నాతో ఏకీభవించరు ఆమెకు నేను రాసిన ప్రేమలేఖల్లో—అందమైన కొటేషన్సు చేర్చడంకోసం లైబ్రరీఅంతా గాలించి, మంచి కొటేషన్లు సంపాదించి, తాజాగా అందించి పెట్టేండే నా మిత్రబృందమంతా ఆ ప్రేమలేఖలు రాసినందుకు నే నిప్పుడు విచారిస్తున్నానని తెలిస్తే అమాంతం మూర్ఛపోతారు. లేదా మూర్ఛపోబోతున్నట్లు నటించి, కాఫీ కావాలని సైగచేస్తూ, హీనస్వరంతో అడుగుతారు. అయినాసరే నే ననదల్చుకున్నదేదో అని తీరతాను కమల చాలా అందమైనదే. ఆమె కన్నులలో వెల్లివిరిసే వెన్నెలలు నా మనస్సును చల్లని స్పర్శతో వశపరచుకున్నాయి. ఆమె చిరునవ్వులకాంతి నా కొక నూత్న ప్రపంచాన్ని చూపిస్తుంది. ఆమె నునుపైన బుగ్గల లేతదనం జీవితానికి ఒక నూత్నమార్గం తోపింపచేస్తుంది. ఆమె సాన్నిహిత్యం నాలో విద్యుచ్ఛక్తిని ప్రవహింపచేస్తుంది. ఆమె పుట్టింటికి వెళ్లిందంటే, నేను సహారా ఎడారిలో నివసిస్తున్నట్లూ, హిమాలయాలు నన్ను పిలుస్తున్నట్లూ బాధపడతాను. అప్పుడు నాకు ప్రియమిత్రుడు పోస్టుమాన్ మాత్రమే. ఆమెకు కోపంవస్తే, రష్యా అమెరికాలమధ్య రాకెట్ల యుద్ధం ప్రారంభమై 'అయిపోయింది. ఇంక లాభం లేదు. కొద్ది నిముషాల్లో ప్రళయం ఈ భూమిని భస్మంచేసేస్తుంది' అనిపిస్తుంది ఆమెకు సంతోషం వస్తే—ఓసారి స్పేస్ షిప్పు ఎక్కి—అలా—అలా చంద్రుడి దగ్గరికి వెళ్ళి 'ఫరవాలేదులే సిగ్గుపడూ కూచోకు. కమల నీకన్నా అందమైనదైతేనేం ? నువ్వూ అందంగానే ఉన్నావులే!' అని ఓదార్చి రాబుద్ధి వేస్తుంది.

కమలను నేను ప్రేమించానని ఒప్పుకుంటాను. అయినా నేను తొందరపడి పెళ్ళిచేసుకోవడం మట్టుకు పొరపాటనక తప్పదు. ఎందుకంటే, అందమయిన వస్తువు లన్నిటికీ భగవంతుడు ఏదో చిన్న లోపం పెడ్తాడుట—చిన్నప్పుడు నేను చదివిన 'గులాబీ ముళ్లు' అన్న కథలో ఒక రచయిత స్పష్టంగా చెప్పాడు. అలాగే కమలకి, నన్నొక ప్రయోజకత్వం గల వ్యక్తిగా చెయ్యాలనే కాంక్ష, ఆశయం పట్టుకుంది. ఆమెదృష్టిలో నేను మట్టి మరుగుపడ్డ మాణిక్యాన్ని. సానపట్టని వజ్రాన్ని! తగిన శిక్షణా, ప్రోత్సాహమూ ఇస్తే ఒక గొప్ప రాజకీయ నాయకుణ్ణో, సంఘ సంస్కర్తనో, పెద్ద రచయితనో అవవచ్చు. అందుకని ఆ శిక్షణనిచ్చే బాధ్యత, ఆమె తనపైన వేసుకుంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే నా అనుభవాన్ని లోకానికి వెల్లడిచేస్తే మీరైనా జీవితంలో తప్పటడుగు వెయ్యకుండా ఉంటారని నా ఆశ! రేప్పొద్దున్న మీ శ్రీమతి వయ్యారంగా ప్లేటులో ఇడ్లీతోబాటు చిరునవ్వును అందిస్తూ—మిమ్మల్ని 'ఏమండీ, మీరు మా లేడీస్ క్లబ్బు వార్షికోత్సవానికి అధ్యక్షత వహించకూడదూ'

—56 పేజీ చూడండి

సరాగమాల

వి ఎ కె రంగారావు

కావ్యశ్రీ పిక్చర్స్‌వారు "రాజరాజన్" తమిళ చిత్రానికి ములుకుట్ల పర్యవేక్షణలో తెలుగు డస్తులు జయంతిలో తిరునారాయణ అధ్వర్యాన తయారుచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ముడి ఫిలిం ముడివిడిన రెండు నెలలలో తెర కెక్కుతుందని ములుకుట్ల అన్నారు. పాటలు వ్రాస్తున్నది రాజశ్రీ, ములుకుట్ల. ఇంతవరకు ఎనిమిది పాటలు రికార్డు చేశారు. మరొకటి త్వరలోనే చేయబోతున్నారు. వీటికి సంగీతం సమకూర్చింది టి. ఎ. కల్యాణం.

అన్ని పాటలలోకి రాజశ్రీ సాహిత్యమైన రెండు పాటలు "చిలిపి వెన్నెలా కథలు తెలిపే కన్నులా", "వినువీధి జాబిల్లి వికసించెనే" అన్నవి రసవంతంగా డబ్బింగ్ కటకటాలు కనపడకుండా ఉన్నాయి. ఇవి రెండూ జానకీ శ్రీనివాసులు పాడిన యుగళగీతాలు. తక్కినవి పాడినది, పాడబోయేది పిఠాపురం, మాధవపెద్ది, వైదేహి, కోమల, ఎల్లారీశ్వరి, కొత్త గాయకుడు కృష్ణ.

* * *

ఎల్లారీశ్వరి అంటే జ్ఞాపకం వచ్చింది. యద్దనపూడినుంచి వై. వి. ఎస్. ఆర్ ప్రసాద్‌గారి సందేహం. "నిత్య వినోదం" పాడినది ఎల్లారీశ్వరి అని నేను వ్రాశాను. పుస్తకంలో డి. ఎల్. రాజేశ్వరి అని ఉందట. ఇందులో యెవరి తప్పూ లేదు. ఆ రెండు పేర్లు ఒక వ్యక్తివే. ఎం. ఎస్. రాజేశ్వరి అనే మరొక నేపథ్యగాయని ఉండటంవలన డి. ఎల్. రాజేశ్వరి తమపేరును ఎల్. ఆర్. ఈశ్వరి అని మార్చుకున్నారు. ఇదీ విషయం.

కె. అప్పారావు "దశావతారములు" చిత్రంలో పాడిన "వైదేహి ఏమాయెనో" త్వరలోనే హెచ్. ఎం. వి. రికార్డుగా రావచ్చునని కొన్ని వారాల క్రిందట వ్రాశాను. ఇప్పటికి వచ్చింది. నంబరు ఎన్.69734. కన్నడమాతృకలో ఈపాట ఆరు నిమిషాలకు పైగా ఉంటుంది. దానిని మూడు నిమిషాలకు, అంటే రికార్డులో ఒక ప్రక్కకు కత్తిరించి కుదించి వేశారు. గమనించి వింటే ఈ కత్తిరింపులు తెలుస్తూనే ఉన్నాయి. పిట్టల కూతలు, తుమ్మెదల రొదలు మొదలగు "సౌండ్ ఎఫెక్ట్స్" చాల మటుకు తీసివేశారు. సీనియర్ సముద్రాలవారి సాహిత్యం కన్నడసాహిత్యాన్ని చాల సన్నిహితంగా అనుసరించింది. అప్పారావుకంఠంలో వైదేహి కేమిచే విరహోత్కంఠితుడైన రాముని వ్యధ చాల చక్కగా పలికింది. పామర్తి వాద్యానుసరణలో మాతృకనున్న పుష్టి లేకపోవడం వారి తప్పు కాదనుకుంటాను. రెండవ ప్రక్క నున్నది ఘంటసాల పాడిన జయహే మాధవ". హిందూస్థానీసరళినున్న దశావతార సంస్తుతి. వింటానికి వాద్యానుసరణ పాతకాలపు నాటకాలలో ఆదిన తెరవెనుక వినిపించే "తళాంగు తకధిమి" ప్రార్థన గేయాలను గుర్తుకు తెస్తున్నది. అడపా దడపా వినవచ్చిన సితార్ మాత్రం హాయిగా ఉంది. ఘంటసాల గాత్రంలోని పెళపెళలాడే మార్దవాన్ని గురించి చెప్పనక్కర లేదుగా !

* * *

పాఠకులకు జవాబులు. బొబ్బిలినుంచి వ్రాసిన భోగరాజు బలరామమూర్తిగారికి ఈ. తాండ్రపాడు నుంచి వ్రాసిన కె. జి. జయరామిరెడ్డిగారికి ఒకటే జవాబు. సినిమాలో పాటనువున్న ఒకటి రెండు చరణాలు రికార్డులో లేకపోవటానికి సాధారణంగా ఒకే కారణం ఉంటుంది. రికార్డులో మూడు నిమిషాల పాటకంటె ఎక్కువ పట్టదు. సినిమాలో పాట మూడునిమిషాలను మించితే, ఆ పాటను రెండు భాగాలుగా రికార్డు ఇవ్వటానికి ఏమైనా అభ్యంతరవుంటే పాటలో సాకీనిగాని, ఒకటో రెండో చరణాలనుగాని సమయానుకూలంగా ఎగరేస్తారు. ఇదీ కిటుకు.

కొత్తపేట చార్వాణిగారికి నా ధన్యవాదాలు.

నర్సరావుపేట డీలర్ డి. రామంగారికి, మీరు చెప్పిన "చాకిరేవు మహాత్మ్యం", "వీధికూతల భాగవతం" విన్నానుకాని, దీనిగురించి వ్రాయలేదు. కొనేవారికి అందించలేకపోయారన్నమాట ఆ రికార్డుల చెల్లుబడిని సూచిస్తుందికాని,అంతస్తును కాదు. నేను అన్నమాటా అదే. కొంటున్నారన్న మిషతో అడ్డమైన చెత్త రికార్డు చేయకూడదనే. "ఇటువంటి రికార్డులు తీసివేసేకంటే అనుకూలిత సమయాల్లో వాటిని ఉపయోగిస్తే మంచిదని నా ఉద్దేశం" అని వ్రాశారు. బూతుపాటలు వేసుకోడానికి ఒకసమయమంటూ ఉంటుందా మహాశయా? నాకు తెలియదు. మరొకప్రశ్న. నాకు అసూయని వ్రాశారు. ఎవరి, లేక దేనిమీద? ఎందుకు? జవాబిస్తారా! అహ, తెలుసుకోవాలని ఉంది.

* * *

మొన్న బొబ్బిలినుంచే మరొక ఉత్తరం ఆర్. బి. గారిది వచ్చింది. పాత తెలుగురికార్డుల గురించి వ్రాస్తున్నట్లు పాత హిందీ సంగీతచిత్రాలు, ముఖ్యంగా "బాజీ" గురించి వ్రాయకూడదా అని. వ్రాయటానికేం వ్రాయవచ్చు. కాని అంత పాత హిందీ చిత్రాలలో పాటలగురించి వ్రాస్తే ఎంత మంది గుర్తు తెచ్చుకొని ఆనందంతో నెప గు వేసుకుంటారు?

హిందీ సంగీతదర్శక మేధావులలో సచ్చిన్‌దేవ్ వర్మన్ ఒకరు. "బాజీ" చిత్రంముందు దరిదాపు పాతిక చిత్రాలకుపైగా సంగీతం ఇచ్చినా, ఈ చిత్రంతోటే వాద్యరచనలో ఒక కొత్తదనం ప్రవేశపెట్టారు. దీనివలన ఆచిత్రంలోని పాటలు ఎంత ప్రజాదరణ పొందాయో ఇప్పుడు ఆలోచిస్తే ఆశ్చర్యం వేస్తుంది. సచ్చిన్‌దేవ్‌వర్మన్ యెన్నో చిత్రాలకు మధురమైన సంగీతాన్ని సమకూర్చిపెట్టారు. కాని "బాజీ" మరొకటి "జాల్" చిత్రాలకు ఇచ్చినటువంటి ఉత్తమమైన సంగీతం మరేచిత్రంలోను వారు వినిపించలేదంటే వారూ అవునంటారు. వారి అభిమానులూ ఒప్పుకుంటారు.

ఆ రెండు చిత్రాలలో ప్రతి పాట ఈ నాటికీ అత్యంత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇదేకాక ఆ రెండు చిత్రాలకు మరికొన్ని పోలికలు ఉన్నవి. రెండిటిలో దేవానంద్, గీతాబాలి నాయికా, నాయకులు. ఛాయాగ్రాహకులు వి. కె. మూర్తి. దర్శకులు గురుదత్. పాటలు వ్రాసింది సాహిర్ లూధియానవి. ప్రతీ పాటా అంత రాణింపుకు వచ్చాయంటే కేవలం సంగీతకారుని, గేయకారుని ప్రతిభే కాక పైనలుగురి ప్రజ్ఞకూడా ఉంది. అందుకోసమే సంగీత ప్రాధాన్యమైన ఈ శీర్షికలో నటుల, ఛాయాగ్రాహకుల, దర్శకుల ప్రసక్తి.

"బాజీ"లో "తద్‌బీర్‌సే బిగడీహుయీ తక్‌దీర్ బనాతే" భారతదేశమంతటా విజయభేరీ మ్రోగించింది. పాటయందు అచ్చటచ్చట వినబడే గిటార్ మీటులు, సాహిర్ అనుపమాన సాహిత్యం వర్మన్ వరస ఇవన్నీ ఒక ఎత్తు, "హాహ్హాహా" అని గీతాదత్ (అప్పట్లో రాయ్) అనటం ఒక ఎత్తు. అప్పట్లో ఆమాటకొస్తే ఇప్పట్లో కూడా ఆ ముక్క వింటుంటే స్వప్నం నిజమైనట్లు, స్వర్గం మనదైనట్లు మనస్సు పరవశంతో పొంగిపోతుంది ఎందుకో.

ప్రియుని నాయిక ఒక కొబ్బరితోటకు తీసుకొని వెళ్ళి, అక్కడ పాడుతుంది "ఆజ్ కీ రాత్‌పియా" అని. చంద్రుడూ, తారలు తోడువున్న ఈ ప్రశాంత నిశితో నన్ను కాదనకు అని ఆపాట సారాంశం. ఆ పాట అంతమవుతుండగా కెమెరా వెనక్కు వెనక్కు కొబ్బరి మట్టలమధ్యనుండి జరిగిపోతుంటుంది. ఫేడౌట్ అయేసరికి నాయికా, నాయకులు ఆ కొబ్బరి ఆకుల మధ్యన లీలగా మాయమైపోతారు. ఈ నాటికి కూడా ఆ పాటను గురించి ఆలోచిస్తే "ఎంత హాయి ఆరేయి, ఎంత మధుర మా హాయి" గుర్తుకు వస్తుంది.

గీతా పాడిన "సునో గజర్ క్యా గాయే," షంషాద్ బీగం పాడిన మరొక డాన్సుపాట "శర్ మాహె కాహే" అన్నది శ్రోతలను నిబిడీకృతోత్సాహంతో ఉర్రూతలూగిస్తాయి.

"జాల్"లో "సున్ జా దిల్ కీ దాస్తా" అన్న పాట హేమంత్‌కుమార్‌ని బొంబాయి చిత్రసీమలో ఒక నేపథ్యగాయకునిగా నిలబెట్టింది. చిత్రంలో ఆ సన్నివేశం ఎంత మనోహరమో చూడనివారికి ఊహాతీతం. ప్రియుని వలపుపిలుపు విని, అతనిని చేరాలనే వాంఛ చంపుకోడానికి ప్రయత్నిస్తున్న నాయికని మోహావేశ పాశాలతో పెనవేసి బలవంతాన ఈ పాట ఈడ్చుకు పోతున్నట్లు హృద్యమంగా చిత్రించబడినది.

ఈ కథకు రంగస్థలం గోవా పరిసరప్రాంతం. గోవావారి ప్రత్యేక జానపద నృత్యవిధానమైన

"మూండో"ని కొంచెం మార్చి "హరి హరి మేరీ గలీ ఆనా హై బురా" అన్న పాటగా మలిచారు వర్మన్. లతా ఈ పాటను "కైసీ హై దిల్‌కీ లగన్" అన్న పాటనూ ఎంత సామర్థ్యంతో, ఎంత భావోద్వేగంతో పాడిందో నేటికీ మనస్సులో ప్రతిధ్వనిస్తుంది.

"జోర్ లగాకే హైయ్యా" అనే బృందగానాన్ని వలలాగుతూ జాలరివాళ్ళు పాడతారు. ఈపాట బృందగానాలకు ఒక గీటురాయి. పల్లెవాతావరణపు కమ్మదనాన్నంతా ఈ వరుసలో పొదిపిపెట్టారు. "దేఖో చుకే హం దిల్ నజరానా" అన్న యుగళగీతంలో గీతా "దిల్‌కా" అని మక్కువలచిక్కులువేస్తూ, వెక్కిరిస్తూ, వయ్యారాల వర్షాలు కురిపిస్తూ, మురిపిస్తూ ఉంటుంది. వినేవాళ్ళ ఒళ్ళు జల్లుమంటుంది ఆషాఢ మేఘానికి నెమలిపింఛంలాగ.

ఆ చిత్రంలోనే లతా పాడిన "పిఘలాహై సోనా" గీతా పాడిన "సోచ్ సమఝకర్ దిల్‌కో లగావా, దేఖో బురాహై జమానా" మణిపూసలు. అంత చక్కగా నాటికీ, నేటికీ ప్రకృతిపరంగా, తత్త్వవిధానంగా ఎవరు సినిమా కవిత్వం చెప్పలేదంటే అతిస్వల్పమైన అతిశయోక్తే అవుతుంది.

పైపాటలవంటివి మరి వినమని పెద్దలంటే ముసలివాళ్ల ముచ్చటనిపిస్తుందికాని నిజమే నేమో!


* * *

"తాశీల్దారు"లో "చినవదిన", "రత్నమాల"లో "వగలాడి నినుజేరి" పాడిన నేటి ప్రసిద్ధ పార్శ్వ గాయకి జమునారాణి. ఈ సంగతి ఒక్కరికీ తెలిసినట్లు లేదే!

ప్రజాశక్తి జి. ఇ. 35290.

జి. కె. వెంకటేష్ తమిళులకు, కన్నడిగులకు చిరపరిచితుడు. సంగీత దర్శకునిగా, గాయకునిగా ఆంధ్రులు ఆయనపాట వినే ("సంతోషం" లోని "తీయని ఈనాటిరేయి" తరువాత) అదృష్టానికి తిరిగి ఈనాటికి నోచుకున్నారు. "ప్రజాశక్తి"లో "పడుచుపిల్లా వలచెనయ్యా పలుకవేమయ్యా, కనుసన్నలతో పిలచెనయ్యా బంగరు మామయ్యా" అన్నది అసమానమూ, అసామాన్యమూ అయిన నేర్పుతో పాడారు. వెనుక పుష్టినివ్వటానికి విశ్వనాథన్—రామ్మూర్తి వాద్యగోష్ఠి ఉండనేవుంది. సినిమాలో ఈ సన్నివేశం ఎంత కడుపుబ్బ నవ్విస్తుందో ఆనంద్ దీనికి చేసిన సమ్మోహననాట్యం ఎంత కవ్విస్తుందో కొద్దిరోజుల్లో మీరే చూస్తారుగా! పాట మధ్యమధ్య వినిపించే "లాలలా" అనేది మనదేశపు పాటలలో కొత్త ప్రయోగం. పాశ్చాత్య గీతాలలో ఇటువంటి ప్రయోగమే "చిప్‌మంక్స్" చేశారు. సరదాపాటలు మెచ్చేవారందరికి నచ్చేపాట ఇది. అనిసెట్టి సాహిత్యం, హాస్యానైన వెక్కిరింతకు మారుపేరు.

రెండవప్రక్క "ఆశలు తీరు" అన్నపాట. ఇందులో వినవలసినదంతా విశ్వనాథన్—రామ్మూర్తి బాంగో డ్రమ్స్ విరివిగా ఉపయోగించి చేసిన వాద్యరచన "సన్నజాజితీగవోలె తరుణ నాట్యం" చేయటం. అనిసెట్టిది వ్రాసినది ఖుషీ సాహిత్యం. ఎల్లారీశ్వరి పాడటంలో వెలితి కొట్టొచ్చినట్లు తెలుస్తున్నా, సంగీత సాహిత్యాల సౌరభం ఈ లోటును వాలిమట్టుకు తెలియనివ్వటంలేదు. ★



మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్ నాడార్ జన్మదినోత్సవం ఈ నెల 15 న జరిగింది.

ప్రజాప్రతినిధి కామరాజ్

రాష్ట్రమంతటా మద్రాసు ముఖ్యమంత్రి పుట్టినరోజు వైభవంగా జరుపుకున్నారు. వీరిపట్ల ప్రజలకు ఉన్న అవ్యాజానురాగానికి ఈ ఉత్సవాలే నిదర్శనలు. కొన్ని ఇతర రాష్ట్రాలలో వలెగాక మద్రాసు రాష్ట్రంలో రాజకీయాలు సాఫీగా నడుస్తున్నాయంటే శ్రీ కామరాజ్ నాయకత్వం ఎంత సుస్థిరమయినదో పటిష్టవంతమైనదో తెలుస్తుంది. కాని శ్రీ కామరాజ్ కేవలం రాజకీయ నాయకులు మాత్రమే కాదు. మద్రాసు రాష్ట్రం త్వరలో పారిశ్రామికంగా దేశంలో ద్వితీయ స్థానం ఆక్రమించగలదంటే అది శ్రీ కామరాజ్ దూరదృష్టినీ సేవా తత్పరతనీ నిరూపిస్తుంది.

మరి కొందరు నాయకులవలె కాక వీరి నిరాడంబర ప్రవర్తన తెచ్చి పెట్టుకున్నది కాదు. శ్రీ కామరాజ్ సిసలైన ప్రజాప్రతినిధి.

ఇటువంటి జన్మదినోత్సవాలు ఇంకా ఎన్నో జరగాలని దేశ ప్రజలంతా హృదయపూర్వకంగా కోరుతున్నారనటంలో అతిశయోక్తి లేదు.



అంజలీ పిక్చర్సు వారి "స్వర్ణ మంజరి" లో జయంతి

సొగసుల ఇంతి 'జయంతి'

జీవితం ఎట్నుంచి ఎటు వెళ్తుందో ఎవరూ చెప్పలేరు. అనుకున్నరీతిగా దాన్ని నడపటంకూడా సాధ్యంకాదు. తనొకటి తలుస్తే—విధిగా దైవం ఇంకొకటి తలుస్తాడు. ఎవరేనా తాను పెద్ద ఉద్యోగిని కావాలని ఆశించినంతమాత్రాన కాలేకపోవచ్చును. కలెక్టరు అవుదామనుకున్నవాడు కారుడ్రైవరు కావచ్చును. గుమస్తాగా జీవితం వెళ్ళబుచ్చుకుందామనుకున్న వ్యక్తి మంత్రి కావచ్చును. టైపిస్టుగా పొట్టపోసుకుందామనుకొనే అమ్మాయి—లేడీడాక్టరు కావచ్చును. విధి చేతిలోనూ, అదృష్టంచేతిలోనూ కీలుబొమ్మ అయిన మానవుడు ఏ నిర్ణయమూ చెయ్యలేడు! అందుకనే, నృత్యం నేర్చుకొని నాట్యకత్తెగా పేరుతెచ్చుకుందామనుకొన్న జయంతి సినిమాతార అయిందంటే—అందులో ఆశ్చపడాల్సిందేమీ లేదు.

నలభైఐదు, జనవరి ఆరవతేదీన కాళహస్తిలో పుట్టిన కమలకుమారి,తనజీవితాన్ని ఈవిధంగా నడుపుకుందామని అనా డాశించకపోయినా, కాలక్రమాన జ్ఞానం వచ్చినతర్వాత ఆశించింది. ఆ అమ్మాయి వాళ్ళ పెద్దనాన్నగారింట పెరిగింది. ఆయనపేరు శోభనా చలపతిగారు, ఆమె తండ్రిగారిపేరు రామానాయుడుగారు. శోభనా చలపతిగారు భాష,సంస్కృతి, చదువు, సందర్భం తెలిసిన వ్యక్తి. ఆయనకు లలితకళలంటే విపరీతమైన అభిమానం. చిన్నతనంలో కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కమలకుమారి గెంతుతూ ఆడుతూఉంటే, ఆ అమ్మాయికి చక్కని నాట్యం చెప్పించాలని ఆయన ఆశించారు. ఐతే ఆ ఊళ్లో అది సాధ్యంకాదు—ఏమద్రాసులోనో మకాంచెయ్యాలి. అక్కడ మకాంచేస్తే ఉన్న ఊళ్లోని పనులన్నీ తికమక కావచ్చును. ఐనా, ఆయన ఆలోచనను వదలలేదు. ముందుగా ఆమె చదువుకోవాలని చదువు చెప్పించారు.

కాళహస్తిలో కమలకుమారి పదోతరగతివరకూ చదివింది. హిందీ చదివింది. ఇంగ్లీషు నేర్చుకుంది. స్కూల్లో చదువుకుంటున్నరోజుల్లో చిన్న చిన్న నాటకాల్లో పాల్గొనటం, నాట్యంచెయ్యటంవంటివి కూడా ఆమెకు అలవడ్డాయి.

అమ్మాయికి పదమూడోఏడు వచ్చింది. కమలకుమారిని తీసుకుని తలిదండ్రులు మద్రాసు వచ్చి—మకాం పెట్టారు. తేనాంపేటలోఉన్న ఒక డాన్సు స్కూల్లో కమలకుమారిని ప్రవేశపెట్టారు. జెమినీ చంద్రకళ, ఈ స్కూలును నడిపేది. ఆసక్తివున్న ఆడపిల్లలంతా ఇక్కడ నృత్యం నేర్చుకుంటూ ఉండేవారు.

ఒకరోజు బడినుంచి తన సహాధ్యాయులతో కలిసి కమలకుమారి ఇంటికి వచ్చేస్తున్నది. దార్లో ఒకాయన ఆ అమ్మాయిని చూశాడు. కమలకుమారి నృత్యం నేర్చుకుంటున్నట్టు తెలుసుకున్నాడు!

ఆసాయంత్రం కమలకుమారి ఇంటికి రాగా—ఉదయం తన్ను చూసినవ్యక్తి తండ్రితో మాట్లాడుతున్నాడు. ఆమె కేం అర్థంకాలేదు. ఉదయం తనకేసి అతను తదేకదీక్షతో ఎందుకని అట్లా చూశాడో కూడా ఆమెకు తెలియదు. ఇంతలో వాళ్ళనాన్న కేకేసి అడిగారు.

"అమ్మా—వీళ్ళ సినిమాలో సరదాగా ఓ వేషం ఉందిట వేస్తావా?" ఈ మాట వినగానే ఆఅమ్మాయి ఎగిరి గంతెయ్యనూలేదు. బిడాకుపడి వద్దనీ అనలేదు.

"అట్లాగే" అన్నది. అదేంవేషమో, ఏం సినిమావో, ఎప్పుడో, ఏమిటో ఆమె కేమీ తెలియదు.

ఆ మర్నాడే ఆమె షూటింగుకు వెళ్ళింది. అది బి. ఏ. సుబ్బారావుగారు తీస్తున్న 'చెంచులక్ష్మి' చిత్రం. నాయిక అంజలీదేవిప్రక్కన కొన్ని అందమైన ముఖాలు కావలసివచ్చాయి. ముక్కూ, కన్నూ, ముఖమూ తీరుగావున్న ఈ అమ్మాయిని చూడగానే సుబ్బారావుగారి ప్రొడక్షన్ఆయనకు, అడగాలని అనిపించింది. ధైర్యంగా అడిగాడు—ఆమె ఒప్పు

కున్నది. ఎప్పుడో నాటకాల్లో పాల్గొన్నప్పుడు ముఖానికి రంగు వేసుకున్నదిగాని—మద్రాసువచ్చి ఎప్పుడూ రంగు వేసుకోలేదు. ఆమెముఖానికి చక్కని మేకప్ వేశారు.—లైట్లమధ్య నిలబెట్టారు. ఏవేవో చెప్పి నటించమన్నారు. కమలకుమారి అన్నింటినీ చేసేసింది. కెమెరాముందు నటించటం అదే ప్రథమం ఐనా ఆ 'తలంపు' పెట్టుకోకుండా—బొమ్మల్లో ఏం చెయ్యమంటే అది చేసింది!

ఈ చిత్రం అయినతర్వాత ఆ అమ్మాయి మళ్ళీ సినిమా ఛాన్సుకోసం ఎదురుచూడలేదు. తన నాట్యాభ్యాసమేదో తనది!

ఇట్లా ఉండగా—'లవకుశ' చిత్రంలోకూడా కొన్ని అందమైన ముఖాలు కావలసివచ్చాయి. పైగా అది రంగులచిత్రం! ఎవరో కమలకుమారి గురించి అనుకున్నారు. అప్పుడు పేకేటి శివరామ్ అక్కడ ప్రొడక్షన్ కంట్రోలరు. ఆ అమ్మాయికోసం బయల్దేరి, అడ్రసు కనుక్కొని, పెద్దవాళ్ళను కలుసుకుని—'లవకుశ' చిత్రంలో బుక్‌చేయించాడు. ఆవిధంగా పేకేటితో ఆమెకూ—ఆమెతో పేకేటికీ పరిచయాలు ఏర్పడ్డాయి.

రాజ్యంపిక్చర్సువారి 'శ్రీకృష్ణలీలలు'లో మాయాపూతన వేషం వేసింది. ఆ తర్వాత! ఈ చిత్రాలవల్ల కమలకుమారి ఎంత నటీమణో, ఎంత శక్తిసామర్థ్యాలు గలదో ఎవరూ నిర్ణయించలేరు. కాని, ఆమెమీద అభిమానంగల పేకేటిమాత్రం నిర్ణయించుకున్నాడు. ఎప్పటికయినా, మంచి నటి కాగలిగే అవకాశాలు ఈ అమ్మాయిలో కనిపిస్తున్నాయని అతను నమ్మాడు.

ఆకారణంగానే పేకేటి, కమలకుమారిని సినిమాలలో బాగా ప్రయత్నించమని సలహాలిచ్చాడు. తానూ ప్రయత్నించసాగాడు.

తనలోవున్న కళాతృష్ణ తనకు కనిపిస్తున్నా—సినిమాలలో నటిగా రాణించాలనిగాని, రాణిద్దామని గాని ఆమెకు లేదు. ఐతే, అవకాశం వస్తేమాత్రం జారవిడుచుకోదలచుకోలేదు. నృత్యం నేర్చుకుని ఎక్కడో నృత్యకళాశాల పెట్టుకుని నలుగుర పిల్లలకు నాట్యం నేర్పుదామనుకున్న కమలకుమారి ఈవిధంగా సినిమానటి ఐంది! తాను సినిమాకు పనికొస్తానని, పదిమందీ చెప్పగా విన్నది—నమ్మింది.

సహస్ర శిరశ్ఛేద అపూర్వ చింతామణి'లో రాజకుమారివేషం వేస్తూవుండగా—సేటంలోనే ఎమ్.ఏ.వి. వారు, వారు తీస్తున్న 'ఆలుమగలు' చిత్రంలో ఓ చిన్న పాత్రకు బుక్ చేశారు. ఆమె ఆచిత్రంలో వచ్చే ఒక 'అంతర్నాటకం'లో పాల్గొన్నది. ఈ పాత్ర ద్వారా కమలకుమారి చాలామందిదృష్టిలో పడింది! ఆమె శక్తిసామర్థ్యాలను నిరూపించుకునేందుకు, కొంత వరకూ ఆ పాత్ర సహాయపడింది!

'ఆలుమగలు' చిత్రం చూసిన కె. వి. రెడ్డిగారు కమలకుమారిని చూసి, తాను తియ్యబోతున్న 'జగదేకవీరుని కథ' చిత్రంలో 'వరుణకుమారి' పాత్రను ఇచ్చారు. ఈ పాత్రద్వారా ఆమె మంచిపేరు తెచ్చుకున్నది. సానపెట్టనిదే వజ్రమైనా ప్రకాశించదన్నట్లు తారగా ప్రకాశించటానికి చాలా అవకాశాలు కలగాలి. 'జగదేకవీరునికథ' అట్టి అవకాశాలను కలిగించింది. పెద్ద సంస్థ—పెద్ద దర్శకుడు—పెద్ద హీరో ప్రక్కనపాత్ర—పెద్దనటులమధ్య నటించటం—పైగా శతదినోత్సవం చేసుకోవటం! ఈ



'గాలిమేడలు' లో జగ్గయ్య భార్యగా జయంతి

చిత్రంతోనే ఆమెపేరు ప్రేక్షకులందరికీ బాగా పరిచయమైంది.

అంతకుముందు ఆమె 'పెండ్లిపిలుపు', 'భక్త రఘునాథ్', 'సులోచన', 'సమాజం' 'మాంగల్యం' చిత్రాలలో వివిధపాత్రలు ధరించింది. ఇందులో 'మాంగల్యం'లో లతపాత్ర పెద్దది, మంచిదీనూ. ఈ పాత్రను సమర్ధనీయంగా నటించిందని, అందరూ ప్రశంసించారు. 'భార్యాభర్తలు' చిత్రంలో నాగేశ్వరరావు పాత్ర 'లవ్' చేసే అమ్మాయిలలో ఒక అమ్మాయివేషం వేసింది. దీనిద్వారా ఆదినారాయణ రావుగారికి పరిచయమైంది. ఆయన, 'స్వర్ణమంజరి'లో మంచి పాత్ర ఇస్తానన్నారు; ఇచ్చారు. 'స్వర్ణమంజరి'లో ఈమె 'మత్స్యకన్య' పాత్రను ధరిస్తున్నది. ఇది వాంప్ పాత్ర—పెద్దపాత్ర!

'గాలిమేడలు'లో నిర్మలగా (జగ్గయ్యకు భార్యగా) నటించాక, కమలకుమారిపేరు మారిపోయింది!

ఆమెకు 'న్యూమరాలజీ'లో నమ్మకం ఉన్న తనపేరు మూడక్షరాలయితే బావుంటుందని, ఐతే 'కమల' అనే పేరుగలవాళ్లు చాలామంది ఉన్నారని—ఏవేవో ఆలోచించి—చివరకు 'జయంతి'గా నామకరణం చేసుకున్నది.

జయంతి బాగా సినిమాలు చూడటం, పుస్తకాలు చదువుకోటం, నటన[illegible] వివిధపద్ధతులూ

[illegible]వ పేజీ చూడండి



తీరిక వేళలో పుస్తకం చదువుతూ జయంతి

హరివంశము

సాందీపని పర్వం-66

పౌండ్రకు డేమియు ననలేదు. మరల గవాక్షములవద్దకుపోయి నిలబడెను. గవాక్షములనుండి కన్పించునంతమేర చూచుచు నతడు నిలబడెను. సాయంసూర్యునికిరణములు హరిదంతతాడితములై, కంది, యెఱ్ఱబారి, రక్తకషాయితములై ప్రవహించి, కాశికను ఆవరించుచున్నట్లుండెను. పౌండ్రకునిచూపులు పోయినంతమేర చెట్లపైన, చెట్ల ఆకులపైన, లేత చివుళ్లపైన, కోటగోడలపైన, కొమ్ములపైన ఆ కిరణములు అతని కన్నులయందలి ఎఱ్ఱని కాంతులవలె ప్రసరించెను. ఆకాశమున మూడు దిక్కులయందు స్వచ్ఛమైన నీలవర్ణము స్థిరమై యుండగా, సూర్యుడు అస్తమించు పశ్చిమపుదిక్కునందు మాత్రము ఈ ఎఱ్ఱనికాంతి, ఆ కాంతి ఆ నీలవర్ణముచేత ఆవరింపబడినదై, ఆ ఒక్క దిక్కునందే నిలువవలసివచ్చి, వేర దిక్కులకు కదులు ఎడములేమి కల్గిన ఏకత్రస్థితివలన కలగి, కలగి, తుదకు నల్లబడి, ఆ నల్లనితనముచేత నా పశ్చిమపుదిక్కుతోడి తక్కిన దిక్కులను గ్రసించబోయి, అశక్తమై, తుదకు తన్ను తానే గ్రసించుకొనుచుండెను. విచిత్రమేమనగా, అంతకు ముందున్న ఎఱ్ఱని కాంతులు భూమియందు, గృహములయందు దీపములుగానైనవో! మణిదీపికలయందు ప్రవేశించినవో! రాజప్రాసాదములయందు మణిదీపపుకాంతులు తెల్లనై ప్రసరించెను. ఆ నల్లని కాంతులకు అక్కడ తావులేదు. పౌండ్రకుడు తనశరీరమునకు వేసికొను నీలవర్ణము అడచుండి నల్లబడినట్లు, రాజప్రాసాదబహిర్దేశములయం దంతటను ఎఱ్ఱనికాంతులు విరిగి యవియు నల్లబడెను. భూమ్యాకాశమధ్యదేశమును మాత్రమే ఆ నల్లని చీకటియొక్క తొలికిరణములు దోరచీకటులై విశ్రాంతిని చూపకల్గుచున్నవిగాని, ఆకాశపు నైగనిగ్యమును ఆక్రమించుకొనలేకపోవుచున్నవి. ఇప్పుడు పశ్చిమపుదిక్కునందలి యాకాశము గూడ ఆ నైల్యముయొక్క కాంతులచేత నిగనిగలుపోవుచున్నది. ఆ నీలవర్ణపు విశ్రాంతిని చూడగా పౌండ్రకునకు భయమైనది. ఏ కాంత్రికిని ఆ నీలవర్ణపు కాంతిని జయించుశక్తి లేదో! ఆ కాంతి ప్రభువై, సర్వదేశముల, సర్వకాలముల విచ్ఛిత్తి నెరుగక ప్రకాశించుచున్నది. తక్కిన కాంతులకు భిత్తికయగుచున్నది. పెరకాంతులు, తమ ప్రరోచనమువేళ, నా కాంతిని ఆక్రమించుచున్నట్లు, ఆ కాంతిని తాము అధోకరించుచున్నట్లు భావించుకొనుచున్నవేగాని, ఆ కాంతి వానికి అందియు అందుటలేదు. పెరకాంతులు పరస్పరవిఘట్టితములై, తమ్ము తాము సంహరించుకొనగా, ఆ నీలవర్ణము, నీలవర్ణముగా మిగిలిపోవుచున్నది. ఇదియు, పౌండ్రకునకు దారుకుని రథసారథ్యమువలె భాసించినది. అతని సారథ్యము ఆ నీలవర్ణమునవలె విరుపులేనిది. తన ఈ సారథులు— మాతలివివా—అతనివి చుట్టుముట్టినప్పుడు నీలవర్ణమును చీకటివలె శోధించగల్గితిమనుకొన్నారు. తుదకేమైనది? చీకటియే అధోకరింపబడినది! ఆ చీకటి ఏమైనది? పౌండ్రకుడు గవాక్షములనుండి కదిలి తన మంత్రాంగమందిరమును చూచుకొనినాడు. దీపపు వెల్గులు లేక, ఆ మందిరము దోరచీకటులతో నిండిపోయినది.

"మాతలీ! రత్నదీపికలు ఏమైనవిరా!"

"నాకేమి తెలియును! మహారాజా!"

"మరి ఎవ్వరికి తెలియును?"

వాచాలు డనినాడు: "పౌండ్రక! సుదక్షిణాదేవి రత్నములను మెరుగుపట్టించుటకు పంపించినారు"

"మరి నాకు చెప్పలేదేమి!"

అంతలో రత్నములు వచ్చెను. వృద్ధకంచుకి వానిని స్వయముగా తెచ్చెను. "మహారాజా! దేవిగారు ఇందలి రత్నములను మెరుగు పెట్టించుటకు పంపినారు. అవి ఇంకను రాలేదు. ఈ రత్నములను ఇచ్చట నుంచవలసినదిగా పంపినారు. ఇంత దనుక మంత్రాలోచనము సాగునని తెలియదు" అనెను అని, వానిని యథాస్థానములతో నమర్చి, చేతిలోని కరదీపికతో నా గూడులయందలి తైలదీపములను వెలిగించి, మందిరమునందు రత్నముల కాంతులు క్రమ్ముకొనగా, నాతడు విచిత్రహాసములు చేయుచు, నటనుండి కదిలిపోయెను. పౌండ్రకుని డాతని చుర చుర చూచి, యాతనిదిక్కు, "తరువాత మనము ఏమి చేసినాముర!" అనినాడు.

మాతలికి నవ్వు వచ్చెను. రత్నములకాంతులు మందిరమునం దంతటను వ్యాపించి, ఆ వెలుగులో వేషముతోడి పౌండ్రకుడు విచిత్రముగ కన్పించుచుండెను అది సహజమైన కాంతికాదు. ఒక కాంతిని మరియొక కాంతి ఆక్రమించుకొన్నది. అదియు వేషమువేసికొన్నట్లుండెను. వేషమును తీసివేసినచో, అసలుకాంతి అసలుకాంతిగా నుండును. పౌండ్రకుడు వేషమును తీయలేదు. అందువలన సహజముగలేదు. ఈ రత్నపుకాంతులు సహజమైన కాంతులుకావు. దీపముల కాంతులు, ఆ రత్నములయందు ప్రసరించగా, ఆ రెండు కాంతులను కలిసి, వేర కాంతియై ప్రసరించుచున్నవి. ఆ కాంతి ప్రసారములో పౌండ్రకుడు శరీరమునకు వేసికొనిన నీలవర్ణము, నీలవర్ణముగాగాక, పెరవర్ణమై భాసించినది. దానికి స్థితియున్నదా! ఆ కృత్రిమవర్ణమున్నంత వరకు ఉన్నది. తరువాతలేదు. దారుకుడు తనకు చూపిన విద్యగూడ తనయందు ఇట్టులే భాసించునా! ఇంతదనుక, అతనికి ఆ ఆలోచన రాలేదు. ఇప్పుడే వచ్చినది. రత్నములకు స్వయముగానున్నకాంతి వేరు. పెరదీపపుకాంతివలన కల్గెడి కాంతి వేరు. మాతలి తనలో తాను మరల నవ్వుకొన్నాడు.

"ఏమిరా! మాతలి! నీలో నీవే నవ్వుకొనుచున్నావు! వృత్తాంతమును చెప్పవు?" అనినాడు పౌండ్రకుడు.

"మహారాజా!"

మరల మాతలి పౌండ్రకుని చూచినాడు. కృత్రిమ వర్ణముతోడి యతని శరీరము మరియు వికృతమై కన్పించినది. పూర్వము తాను ఎన్నిమారు లీ వేషములో నాయనను చూడలేదు! ఇప్పుడే ఇట్లు కన్పించవలయునేమి! ఇప్పుడే ఇట్లు అనిపించవలయునేమి! మాతలికి ఆశ్చర్యమైనది

"మాతలి!"

"మహారాజా!"

"తరువాత నేమైనదిరా?"

పౌండ్రకుని ఔత్సుక్యము పెరుగుచున్నది. అతనికి సర్వ వృత్తాంతమును వినవలయునని యున్నది. ఆ సారథి ఎవ్వడైననేమి! వానిది విద్య!

మాతలి మరల నిట్లు చెప్పెను. "మహారాజా! దారుకస్వామిరథము ముందు పోవుచుండెను. ఎట్లు పోవుచుండెనో చెప్పితినికదా! నేను నా గుఱ్ఱములను తోలలేదు. నా రథము ఆయన రథమువెంట యజమానినంటిపోవు శ్వానమువలె పోవుచుండెను. కాంతోపలము ఇనుము నాకర్షించుట యున్నది. ఇచ్చట నా రథము అట్లు ఆకర్షింపబడినది. అచ్చట నేను లేను. నారథము లేదు. నా గుఱ్ఱములు లేవు. ఓడకుకట్టబడిన మరియొక చిన్ని ఓడవలె నా రథము దారుకస్వామి రథమునంటి పోవుచున్నది. నేనేమి చేసితిని! ఆ అద్భుతమును చూచుచు కూర్చుంటినో! ఆ విద్యను చూచి స్తంభమును భజించితినో! మరల దారుకస్వామి పల్కరించువరకు నన్ను నేను తెలియలేదు. మహారాజా! అది ఏమి తెలియుదు! నేను నాలో లీనమై నన్ను నేను తెలియనిస్థితిలోనుండి నన్ను నేనుగా తెలియు స్థితిలోనికి వచ్చితిని. ముందస్థితిలో దారుకస్వామి విద్యతప్ప మరియొక్కటి నాలో భాసించలేదు. ఇప్పుడు నేను, నా గుఱ్ఱములు, నా రథము, దారుకస్వామి ఆయనరథము, ఆ రథమునందలి వామాక్షి, సుదాములు భాసించిరి. నేను నేనుగాక, మరల మాతలినైతిని. అప్పుడు దారుకస్వామి అన్నాడు·

'మాతలి! మనము చాల దూరము వచ్చితిమి. ఈదేశమును చూచితివిగదా! సమమై, విశాలమై యున్నది. ఇక్కడ నీకు ఒక్క అద్భుతమును చూపెదను. తరువాత నాదారిని నేను పోయెదను. ఓరి! ఇది మన స్నేహమునకు గుర్తురా!"

"స్వామి! మరి తక్కిన రథము లేమైనవి" అని నేను దారుకస్వామితో నన్నాను.

ఆయన నవ్వినాడు. అవిగూడ మనతో వచ్చునను కున్నావా! అన్నాడు. ఆ రథములు మాతో రాలేదు. నేనును, నా రథమును, ఆయనయు ఆయనరథమును మాత్రమే అచ్చట నున్నవి. అప్పుడు జరిగిన అద్భుతమునకు ఆయనయు నేనును సాక్షులము. వామాక్షిదేవి సుదాములవారును సాక్షులు. సర్వ భూతములును సాక్షులు......"

"అవును! అవును! యాదవుడైన వృథా వాసుదేవుడును సాక్షి!" అన్నాడు పౌండ్రకుడు

"మహారాజా! దారుకస్వామి వృథాయనలేదుగాని, వాసుదేవులుగూడ ఇందులకు సాక్షి యన్నాడు....."

"అన్నాడు సరే! ఏమి చేసినాడు?"

"అదే చెప్పబోవుచున్నాను మహారాజా!"

"సరియే! చెప్పుము......" అని పౌండ్రకుడు మందహాసము చేసినాడు. "మాతలి! నీవు వృథా సూతుడవై పుట్టితివి. ఏ వందివో, మాగధుడవో నైన బాగుండెడిది" అనినాడు. ★

—హరిత శివశర్మ



చిత్రభేదము

సుకుమార్

"బాగా డబ్బూ దస్కం మస్తుగా, పుష్టిగా ఉన్న ఒక ఆసామీ సినిమా తియ్యాలని మద్రాసు వచ్చి—ఇక్కడ సరిపడక, బొంబాయి వెళ్లి—మళ్లీ మద్రాసొచ్చి 'సినిమా అంతా అవగతమై పోయింది. నేను తీసి చూపిస్తాను' అని తను మొదలెట్టాడు. తన ఉద్దేశం ఏమిటీ—హిట్లవుతున్న సినిమాలన్నీ కేవలం 'షోమన్‌షిప్' మీదే అవుతున్నాయని! 'షిప్' అన్నానని అదేం పడవ అని అనుకోకండి—అదోమాట. చిత్రాన్ని 'భారీ'గా చూపించటం అన్నమాట. ఇట్లా చూపించటంతో హాలీవుడ్ వాళ్లు పేరుగాంచారు! ఈ ఆసామీకూడా హాలీవుడ్ అమ్మమ్మలా సినిమా తియ్యాలని—ఓ కథ ఎన్నుకున్నాడు. కథను ఎన్నుకోవటం అంటే ఏమిటి—ముందే సెట్లు గీయించేసుకున్నాడన్న మాట! పెద్ద పెద్ద మేడలూ, మిద్దెలూ, స్తంభాలూ, మనుషులు వందలకొద్దీ కనిపించటమూ, యుద్ధాలూ, సముద్రపు ఒడ్లూ, ఒంటెలూ, ఏనుగులూ, ఇట్లాగే బోలెడన్ని పెట్టేశాడు. వీటికితోడు ఇద్దరు, ముగ్గురు తారలను పెట్టాడు. చిత్రం మొదలైనదగ్గర్నుంచి చివరదాకా ఇవే తిరుగుతాయి. కథ ఏమిటో ఎవరూ పసిగట్టలేకపోయారు. మళ్లీ టైటిల్సులో 'కథ' అని వేసి, తనపేరు వేసుకున్నాడుకూడా! అతనికే అసలు కథ బోధపడ లేదుట! అందుకనే కాబోలు—ఈ చిత్రంలోని కథను చెప్పినవారికి—వెయ్యి నూటపదహార్లు బహుమానం ఇస్తానని ప్రకటించాడు. ఎవరూ చెప్ప లేకపోయారు. తానూ చెప్పుకోలేకపోయినా, ఆవెయ్యినూట పదార్లను నిర్మాతే ఉంచేసుకున్నాడు—అన్యాయంగా. పబ్లిసిటీకూడా భారీగా ఇచ్చాడు. మొదటి ఆటకు జనం బాగానే వచ్చారుట! అక్కణ్నుంచి .... గోవిందా! థియేటర్లు ఖాళీ. అందరూ కూచుని 'ఎంచేతంటే ఎంచేత' అని ప్రశ్నలు వేసుకున్నారు. ఇంతంత సెట్లూ వృధాయేనా అనుకున్నారు. ఆ రాత్రి ఆ ఆసామికి కలవచ్చిందట—ఆ కలలో ఒక ప్రేక్షకుడు ప్రత్యక్షమై—'నాయనా! ఆసామీ! సినిమా అనగా నేమి? ఇది కాదు నాయనా. మాకు కావలసింది కథగాని—సెట్లు కాదు బాబూ!" అని చెప్పాడు.

"సెట్లు కాకపోతే, తారలూ, ఇతరాలూ ...." అన్నాడు ఆసామి.

"అవి అంతంతమాత్రమే. అవి కేవలం కథ నడవటానికి తోడ్పడేవేగాని—కథ కాజాలవు. నీ సెట్లకూ, కథకూ—మసాలాకూ, మాంసానికీ ఉన్నంత చిత్రభేద ముంది. మసాలా ఉన్నదని, అదే వండిపెడితే, ఎవరన్నా తింటారా? తినగలరా? తగినంత మాంసం ఉండి, దానికి మసాలా తగినంత పాళ్లలో పడాలి. అదేవిధంగా ...."

"నువ్వేమన్నా నాన్ వెజిటేరియన్ హొటల్లో కుక్కువా?" అని ఆ ఆసామీ కోప్పడ్డాడు.

"అదేవిధంగా .... నీ సినిమా కూడా ...."

"నే నడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పవేం? అని ఇంకా గట్టిగా కోప్పడ్డాడు. అంతే దాంతో ప్రేక్షకుడు మాయమైపోయాడు. ఆసామికి మెలకువ వచ్చింది. చటుక్కున కళ్లు తెరిచాడు.

"నా కళ్లు తెరిచావు గదయ్యా—ప్రేక్షకా!" అని, మళ్లీ పడుక్కుని నిద్రపోయాడుట! విన్నారా—దీని సినీతి ఏమో గ్రహించారా?—'కథకు ప్రాముఖ్యం ఇవ్వకున్నచో కరారావుడి తథ్యం" అందువల్ల కథ బావుండాలి—అది బావుండాలంటే కథకుడు ఉండాలి" అన్నాను నేను.

"ఏంకథ సెప్పినావయ్యా—ఇది తీస్తే ఇట్టే మవుద్ది?" అన్నాడు నిర్మాత.

'దట్‌నాట్ నిర్మాతగారూ అదికాదు! ఈ కథంతా విన్నది మీరు అందుకనా? నేనేకాదు. ఇది సినీతికథకాని, సినీకథ కాదు—ఇది మనం తియ్యం" అన్నాడు ఫలానా.

"అట్టా సెప్పు. అయితే మా ఎంకట్రావుకి రాయమంటావా?"

"ఎంకట్రావూ ఒద్దు—ఏడుకొండలూ ఒద్దు. వాళ్లకేం తెలుస్తుంది గురువుగారూ—ఇక్కడే దొరుకుతారు మనకి—రైటర్లనీ ... ముగా. అందులో ఒకాయన్ను తెచ్చుకుని—ప్రారంభిద్దాం".

"నువ్వూ గలిసినా! సర్లే—సరేగాని సిన్నోడా—నువ్వెల్లి మాకు తెలిసినోడు, ఇక్కడో డుండాడు. ఆడు మొన్న కనిపించాడు— మంచి మంచి సలహాలన్నీ ఇత్తానన్నాడు. ఎల్లి ఆడిని కేకేసుకురా".

"నే లేనుటండీ—మళ్లీ మంకోకడా నా మీదికి కాంపిటేషను" అన్నాడు ఫలానా.

"కామిటేసనేందిరా—నీదంతా ఉపిస్త్రం.! అని నవ్వి, "ఎల్లా—" అన్నాడు.

"పుల్లయ్యను నేంవరం పంపినట్టుంది గురువుగారూ?—ఆ సలహాదారుడు ఎక్కడుంటాడూ ఏం చేస్తూవుంటాడూ? అస లతనికి ఇల్లుందా భార్యవుందా? అతనూ భార్యా చివరకు కలుసుకుంటారా? వాళ్లకొడుకు కేమవుతాడు?—ఈ ప్రశ్నలకు సమాధానాలన్నీ తెరమీద చూడమనా నీ ఉద్దేశ్యం?" అన్నాడు ఫలానా.

"ఏందిరా నీ సొద! సరే, నేనే ఎల్లి కేకేసుకొత్తా గాని—మీ రిద్దరు ఈలోపల మంచి కథ ఆలోచించిపెట్టండి." అని నిర్మాత బయల్దేరబోయి ఆగి—"ఇదిగో—తేగాలు బాగా ఉండాల" అన్నాడు—అని భుజంమీదగా పంచపారేసుకుని వెళ్లిపోయాడు

"తేగలు అంటాడేమిటి ఫలానా?" అన్నాను నేను.

"తేగలేంటండీ బాబూ! తేగాలండీ—అంటే త్యాగాలు. కథలో మంచి మంచి త్యాగాలు ఉండాలని వారి ఆదేశం" అని విడమర్చాడు ఫలానా.

"ఫలానా" అన్నాను నేను—నిట్టూర్చి.

"ఏమండీ?"

"ఏమేమిటోయ్—వీడితో మనం ఎట్లా వేగుతామోయ్—నాకేం నమ్మకమూ లేదు, ధైర్యం లేదు."

"ధైర్యే సాహసే లక్ష్మి అన్నాను నేను, మీతో. అంతలోనే డైలాగు మరిచిపోయారు. ఇంతదూరం వచ్చాక, ఇంక వెనకడుగు ఏమిటి—రోట్లో తల దూర్చిన తర్వాత, రోకటిపోటుకు వెరువరాదని పెద్దలందురు. తొల్లి యొక జంబుకంబు వనమ్మునం గ్రుమ్మరుచు నెక్కడ నాహారంబు చేకూరమిం గరంబుదరం ...."

"ఫలానా!" అన్నాడు చిరాగ్గా.

"కథలండీ. నిర్మాతగారు కథలు ఆలోచించమన్నారు. పాతకథ జ్ఞాపకంవచ్చింది. ఈ కథ ఈయన తీసుకోడు!"

"ఆ సలహాదారు డెవడయ్యా—మన పీకల మీదికి."

"ఏమోనండి. మీరేం భయపడకండి. మీరు డైరెక్టరు కావలసిందే. చెయ్యనంటాడా—నా దారిన నేను పోతాను—అదే తగిన శాస్తి."

"ఏడిసినట్టుంది. నాకేం తోచనివ్వకుండా చేస్తున్నావు నువ్వు."

"కథా అండీ! కథ ఒక్కరుకంటె ఇద్దరు ఆలోచించటం మంచిది. మీకు తోచకపోతే నేనున్నాను."

"అది కాదయ్యా బాబూ. ఈ పిక్చరు ఒప్పుకుంటే, వీడితో వేగలేం. ఒప్పుకోకపోతే పొరుక్కెంచిమీద చూడలేం. ఏం తోచటంలేదు."

"మహాశయుడు గారూ—మంచి కాన్‌ఫ్లిక్ట్ సీములో పడ్డారుకదా! ఆ నిలువుటద్దందగ్గర కెళ్లండి—మీ ప్రతిబింబం మీతో ఏదన్నా సంభాషించవచ్చు—వెళ్లండి."

"అసాధ్యుడవయ్యా నువ్వు."

"అవునండీ—ఇటువంటి ఘట్టాల్లో అద్దంలో చూసుకోవాలిగదా—అమాటే అన్నాను."

"దేవాంతకుడివి."

—49 వ పేజీ చూడండి




ప్రపంచ ప్రముఖులు-8

ఈ శతాబ్దంలోనే జర్మనీ రెండు ప్రపంచ యుద్ధాలు లేవదీసింది. హిట్లర్ నాయకత్వం క్రింద కోట్లమంది మానవుల మరణానికి కారణం అయింది. యూరోప్‌లో జర్మనీమూలంగా నష్టపడని దేశమే లేదనవచ్చు. కాని ప్రచ్ఛన్న యుద్ధం ప్రభావంవల్ల రెండుగా విభజింపబడిన రెండు జర్మనీభాగాలూ ఒకప్పుడు తమ శత్రువులుగా ఉండినవారితో కలిసి నేడు విరోధులు కావలసి వచ్చింది.

తూర్పుజర్మనీ ఇంకా రష్యాఅధికారం క్రిందనే ఉన్నా, పశ్చిమజర్మనీ పూర్తిగా స్వతంత్రదేశం అవటమే కాక-అమెరికా సహాయంతో-ప్రపంచంలోనే అత్యైశ్వర్యవంతమయిన దేశాలలో ఒకటి అయింది. తూర్పుజర్మనీలో పరిస్థితులు మాత్రం బాగా చెడిపోతున్నట్లు తెలుస్తుంది. తమదేశం ఈ విధంగా ఎల్లకాలం వేర్వేరు దేశాలుగా ఉండిపోవటం జర్మన్ ప్రజలకు ఇష్టం ఉండదని ఊహించవచ్చు. 'రెండు జర్మనీ'ల ఏకీకరణమే తమ లక్ష్యమని ప్రతి జర్మన్ పార్టీ చెప్తూనే ఉంటుంది. కాని కొన్రాడ్ అడినోవర్ విధానాలు పరిశీలిస్తే కేవలం జర్మనీ ఏకీకరణమే కాక ఆదేశం తక్కిన పశ్చిమయూరోప్ రాజ్యాలకు అతి సన్నిహితంగా చేయాలనే ప్రయత్నం కనిపిస్తూనే ఉంటుంది. పశ్చిమ యూరోప్ రాజ్యాలన్నీ కలిసి ఒక 'సమాఖ్య' ఏర్పరచుకోవాలనే వాదాన్ని బాగా బలపరిచేవారిలో అడినోవర్ ఒకరు. ఇటీవల రైమ్స్ (ఫ్రాన్స)లో జరిగిన ప్రదర్శనలలో డిగాల్, అడినోవర్‌లు పాల్గొని తమ దేశాలమధ్య ఏర్పడ్డ స్నేహభావాన్ని నిరూపించ ప్రయత్నించారు. (ఇది జర్మనీ అణ్వస్త్రాల ఉత్పత్తిలో ఫ్రాన్సుద్వారా కలుగచేసుకోవటానికి పన్నుతున్న కుట్రలో భాగం అనేవారు లేకపోలేదు.)

ప్రజాస్వామ్యపద్ధతులకోసం, పశ్చిమ రాజ్యాలమధ్య మైత్రికోసం అడినోవర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమే కాని ఆసియా ఆఫ్రికాల విషయం ఆయన అసలు పట్టించుకున్నట్లే కనిపించదు. బీదదేశాలకు సహాయం చేయడంలో పశ్చిమజర్మనీ ముందంజ వేయటంలేదు. పశ్చిమబెర్లిన్, తూర్పుజర్మనీ సమస్యల పరిష్కారం జరిగేటంతకూ జర్మనీలో బయటిప్రపంచం ప్రజల సంగతి ఆలోచించే అవకాశం తక్కువ అనుకొనడం పన్నాయుల వ్యాఖ్య ఏమో! ★


మొన్న మన రావు గారిచ్చిన డిన్నర్.. అత్యద్భుతం రాబోయ్... ఎన్నటికీ మరచి పోలేం... తెలుసా..!?
అలాగా..! ఎలా వుండిందేమిటీ...? ...కాస్త చెప్పు.. వింటాం...!
ఒరేయ్... వాడు నన్ను ఇన్వైట్ చెయ్యలేదురా... పోపోతే...
యూ ఆర్ ఆల్ లక్కీ.. మీరంతా
ఆ రాత్రంతా నేను డోకులు డోక్కోలేక తెగ చచ్చాననుకో...
సుందర్

డా॥ గాలి బాలసుందరరావు

జఠరాశయము : రిఫ్లెక్సులు

గత వ్యాసములలో జఠరాశయమును వ్యాధిగ్రస్తముచేసే కొన్ని కారణములను వివరించాను. ఇరిటేషను, ఇన్‌ఫెక్షను, మానసికపరిస్థితులే కాక, కొన్ని ఇతర అంగములు వ్యాధిగ్రస్తములైనప్పుడు కూడా జఠరాశయములో వ్యాధి లక్షణములు ఏర్పడవచ్చును. లివరును అంటివుండే పిత్తాశయము (Gall Bladder) పెద్ద పేగు (Colon) దానిని అంటివుండే ఎప్పెండిక్సు (Appendix) మూత్రకోశము (Kidney) లో రాళ్ళు, హృదయవ్యాధులు, ఊపిరితిత్తులు, డయాఫ్రమునకు సంబంధించిన వ్యాధులు. ఇవన్నీ జఠరాశయంలో మార్పులు కలిగించవచ్చును. అక్కడ బాధా కలిగించవచ్చును. ఇటువంటి పరిస్థితులలో, పైలోరసుకు డువోడినముకూ మధ్య ఉన్న స్ఫింక్టరు దుస్సంకోచము పొంది, కడుపులో ఆహారము పేగులలోకి పోక వాంతి ఏర్పడవచ్చును.

శరీరంలో ఎక్కడో ఏదో అవయవములో రోగం ఏర్పడ్డప్పుడు దానితో సంబంధంలేని అంగంలో బాధ ఎల్లా ఎందుకు ఏర్పడుతున్నది ? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే నరకోశమును గురించి ముఖ్యంగా రిఫ్లెక్సు ఏక్షను (Reflex Action) గురించి తెలుసుకోవాలి.

మనం నిద్రపోతున్నప్పుడు చీమ కుడితే నిద్ర లేవకుండానే, చేయి ఆ చీమ ఉన్నచోటికి పోయి దానిని నలిపివేస్తుంది. కారు నడిపేవారు ప్రక్కవారితో మాట్లాడుతూ పరధ్యానంగా ఉన్నప్పుడు కూడా కారు కెవరయినా అడ్డంవస్తే అప్రయత్నంగానే బ్రేకు వేస్తారు. ఆ తరవాతగాని వారికది స్మృతిపరిధిలోకి రాదు. మంచి పకోడీల వాసన తగలంగానే నోరూ ఊరుతుంది, కడుపులో జఠరరసమూ ఊరుతుంది.

మన శరీరంలో, మనప్రయత్నం లేకుండా, మనకు తెలియకుండా, ఏదో ప్రేరేపణవల్ల (Stimulus) జరిగిపోయే పనిని 'రిఫ్లెక్సు' అంటారు. రిఫ్లెక్సు అన్న మాటకు "వెనుకకు విసరబడిన" అని అర్థము. రిఫ్లెక్సులు చాలా రకములు.

నరకోశంలో రెండు ప్రధానభాగములు ఉన్నవి: (1) కేంద్ర నరాశయము, (2) నరములు. శిరస్సులో ఉండే సెరిబ్రము, సెరిబెల్లము, వెన్నుపూసలమధ్య ఉండే వెన్నుపాము—ఇవన్నీ కలిసి కేంద్ర నరాశయము ఏర్పడుతున్నది. వీటి ననుసరించి ఉన్న శిరోనరములు, వెన్ను నరములు, స్వచ్ఛందనరములు (అనిచ్ఛాధీనకండరములకు పోయేవి) రెండవ భాగము.

కేంద్ర నరాశయమును గురించీ, శిరో నరములను గురించీ 19—4—61, 26—4—61 సంచికలలో చర్చించాను.

నరకోశం అంతా రెండు ముఖ్య నిర్మితుల కలయికతో ఏర్పడ్డది. అవి (1) న్యూరానులు, వాటి నుంచి పోయే తంతువులు, (2) న్యూరానులను వాటి తంతువులను కలిపివుంచే సంబంధ ధాతువు. నరకోశములో ఉండే ఈ సంబంధ ధాతువును న్యూరోగ్లియా (Neuroglia) అంటారు. న్యూరాను అంటే నరకోశంలో ఉండే జీవకణము. దీనిని అంటివుండే తంతువులు రెండు రకములు. ఒక రకం న్యూరానుకు వార్తలు చేర్చేవి. మరొకరకం న్యూరానునుండి వార్తలను తీసుకు వెళ్ళేవి. వార్తలు తెచ్చే తంతువులను డెండ్రైటులు (Dendrites) అంటారు. వార్తలు తీసుకువెళ్ళే తంతువులను 'ఏగ్జానులు' అంటారు.


న్యూరాను ప్రత్యేకప్రవృద్ధి పొందిన జీవకణము. దానికీ ఇతరకోశములలో ఉండే జీవాణువులకూ చాలా భేదం ఉన్నది. న్యూరాను రెండుగా విభజనపొందదు. అంటే ఒక న్యూరానునుండి మరొక న్యూరాను పుట్టదు. అందువల్ల జీవకణ విభజనకు సంబంధించిన సెంట్రోసోములు అందులో ఉండవు. న్యూక్లియస్, న్యూక్లియోలస్ మాత్రం ఉంటవి. న్యూరానుకు విభజనపొందే శక్తిలేదుగనుకనే, నరకోశంలో ఏ భాగమైనా నశించినప్పుడు అది మళ్ళీ తిరిగి పునఃసృష్టి కావడంలేదు. న్యూరానను నశించకుండా కాపాడగలమేగాని నశించిన తరువాత, చేసే దేమీలేదు. ఇందువల్లనే పోలియో మైలైటిస్ వంటి వ్యాధులకు నివారణ కన్పించదు.

న్యూరానులో ఉండే ప్రోటోప్లాజము రసాయనికస్వభావమూ, నిర్మితికూడా వేరుగా ఉంటుంది.

న్యూరానునకు సంబంధించిన పోగులు ఒక్కటిగా ఉండవచ్చు. రెండుగా ఉండవచ్చు. అనేకములుగా ఉండవచ్చు. అవి నిర్వహించవలసిన ధర్మమును బట్టి ఈ పోగులసంఖ్య ఏర్పడుతుంది.

ఏగ్జానునిర్మితికీ డెండ్రైట్ నిర్మితికీ భేదం ఉన్నది. ఏగ్జాన్ చుట్టూ ఒక తొడుగు ఉంటుంది. ఆ తొడుగు మయెలిన్ అనే కొవ్వువిశేషంతో తయారయింది. ఈ మయెలిన్ తొడుగు, ఎలక్ట్రిక్ తీగెనుచుట్టి రబ్బరు తొడుగున్నట్లు ఒకేలా ఉండదు. నల్లేరులో ఉన్నట్లుగా దానిలో కణుపులుంటవి. ఇచ్ఛాధీనకండరములకు పోయే నరములలో ఏగ్జానులు ఈవిధంగా ఉంటవి. స్వచ్ఛందకండరములకు పోయే పోగులలో తొడుగులో ఈ కణుపు లుండవు. అది వేరే రకమైన రసాయనికవస్తువుతో తయారయి ఉంటుంది.

న్యూరాన్ శరీరభాగంలో ఉన్న ప్రోటోప్లాజంలోని నిస్సిల్ రేణువులు (Nissl's Granules) అనే ప్రత్యేక సూక్ష్మనిర్మితు లున్నవి. న్యూరానుకు వార్తలుతెచ్చే డెండ్రైటు శాఖలు వీటితో కలిసి ఉంటవి. పరిశ్రమిస్తున్న అవయవము అలసిపోయినప్పుడు, న్యూరాన్‌పోగులు తెగినప్పుడు, ఈ నిస్సిల్ రేణువులు జీర్ణించిపోతవి. ఇవి పనిచేస్తున్నంతసేపే మనం ఆలోచించగలగడం గాని, అవగాహన చేసుకోగలగడం గాని, అవయవములను ఉపయోగించడంగాని సాధ్యమవుతుంది. ఇవి గాక న్యూరాన్‌లో అతి సూక్ష్మములయిన పోగులతో ఏర్పడ్డ ఒక వల వంటి నిర్మితీ, ఇతర రేణువులూ ఉన్నవి. ఆ సూక్ష్మతంతువులు ఏగ్జాన్‌లలోకి సాగిపోతవి. నరాశయంలో జరిగే పనులన్నీ రెండురకములుగా విభజించవచ్చును. ఇంద్రియములనుండి వార్తలు న్యూరానులకు చేరడం. ఆ వార్తల ననుసరించి, చేయవలసిన పనిని కండరములకో, గ్రంథులకో మరికొన్ని న్యూరానులు తెలియజేయడం. ఒకే ఏగ్జాను చాలాదూరం పోలేదు. అందువల్ల న్యూరానుకూ న్యూరానుకు మధ్య సంబంధం ఏర్పరచే న్యూరానులు కొన్ని ఉంటవి.



ఇంద్రియములనుంచి వార్తలు స్వీకరించే న్యూరానులను సెన్సరీ న్యూరానులు అంటారు. కండరముల సంకోచ వ్యాకోచములనూ గ్రంథుల స్యందనములనూ కంట్రోలుచేసే న్యూరానులను మోటారున్యూరానులు అంటారు. శిరస్సులో ఉన్న నరాశయభాగములలో న్యూరానులు వెలుపలి ప్రక్కన "లేయర్"గా (Layer) ఏర్పడి ఉంటవి. ఇది గోధుమరంగుకలిగి ఉంటుంది. అందువల్ల దీనిని గౌరభాగము (Gray matter) అంటారు. ఇందులో న్యూరానులు, న్యూరోగ్లియా, తంతుభాగములు ఉంటవి. తంతువులన్నీ కట్టలు కట్టలుగా మెదడు లోపలివైపున ఉంటవి. ఆ భాగము తెల్లగా ఉంటుంది. దానిని ధవళభాగము అంటారు.

వెన్నుపాములో న్యూరానులు బయటవైపున ఉండవు. అవి వెన్నుపాము మధ్యలో H ఆకారంగా ఏర్పడివుంటవి. మెదడులో సెన్సరీ న్యూరానులన్నీ మెదడు వెనుకవైపున గుమికూడి ఉంటవి. మోటారు న్యూరానులన్నీ ముందువైపున గుమిగూడి ఉంటవి. ఈ రెంటికీ మధ్య ఒక గాడి ఉంటుంది.

మెదడునూ, వెన్నుపామునూ చుట్టి మూడు పొరలు ఉన్నవి. ఇందులో డ్యూరామేటరు, ఏరక్నాయిడ్ అనే పొరలు కలిసిఉంటవి. పయామేటరు (Piamater) మెదడునూ, వెన్నుపామునూ అంటి ఉంటుంది. ఏరక్నాయిడుకూ పయామేటరుకూ మధ్య సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ అనే ద్రవపదార్థము ఉన్నది. మెదడులో ఖాళీప్రదేశములు ఉన్నవి. వాటిని వెంట్రికిల్సు (Ventrecles) అంటారు. వెన్నుపాము గొట్టమువంటి నిర్మితి. ఆ గొట్టము మధ్య ఖాళీప్రదేశమును సెంట్రల్ కెనాల్ (Central Canal) అంటారు. ఇది యోగశాస్త్రంలో అతి ప్రధానమైనది. దీనిని సుషుమ్న ద్వారము అంటారు. సెరిబ్రోస్పైనల్ ఫ్లూయిడ్, మెదడు లోపలిభాగములను, పైభాగమును, వెన్నుపామును, దాని లోపలి భాగమును నిండిఉంటుంది. వీటిమీది పొరలను మెనింజెస్ (Meninges) అంటారు. మెనింజెస్ ఇన్‌ఫ్లేం అయినప్పుడు మెనింజైటిస్ అనే వ్యాధి వస్తుంది.


వెన్నుపాములో H ఆకారంగల గౌరభాగం ముందు కొమ్ములలో మోటారు న్యూరానులు ఉంటవి. వెనుకకొమ్ములలో సెన్సరీ న్యూరానులు ఉంటవి. రెండు వెన్నుపూసల మధ్యనుంచి రెండు వెన్ను నరములు వెన్నుపాము రెండు ప్రక్కలనుంచి బయటికి వస్తవి. — వెన్నునరం మోటారుశాఖ సెన్సరీశాఖ కలిసి ఏర్పడుతుంది.


ఇంద్రియములు అయిదు. అందులో స్పర్శేంద్రియము శరీరం అంతటా వ్యాపించిఉన్నది. చక్షురింద్రియము, శ్రవణేంద్రియము, ఘ్రాణేంద్రియము, జిహ్వేంద్రియము—వీటికి సంబంధించిన న్యూరానులూ, నరములూ శిరస్సులోనే ఉన్నవి. అందుచేతనే శిరస్సులో ఉన్న నరాశయభాగము అంత పెద్దదిగా ఉంటుంది. మోటారు నరములు శరీరం అంతటా ఉన్నవి. కండరములు, గ్రంథులు అధికంగా కాండంలో (Trunk) ఉన్నవి. మనం చేసే పనులకు అవసరములయిన కండరములు కాళ్లలోనూ, చేతులలోనూ ఉన్నవి. వీటికి సంబంధించిన న్యూరానులు వెన్నుపాములో ఉన్నవి. వెన్నుపాములో ఉన్న సెన్సరీ న్యూరానులు తమ యాగ్జానులద్వారా మెదడులోఉన్న సెన్సరీ న్యూరానులతో సంబంధం కలిగిఉంటవి. మెదడులో ఉన్న మోటారున్యూరానులు తమ ఏగ్జానులద్వారా వెన్నుపాములో ఉన్న మోటారు న్యూరానులతో సంబంధం కలిగిఉంటవి. ఒకే ప్రదేశంలో ఉన్న న్యూరానుల మధ్య అన్యోన్య సంబంధం ఉంటుంది.

ఒక్కొక్క వెన్ను నరముకు సంబంధించిన వెన్ను భాగమును 'సెగ్మెంటు' అంటారు. ఈ సెగ్మెంటులు వెన్నుపూసలలాగా విడివిడిగా ఉండవు. ఒకే జిల్లాలో తాలూకాలవిభజనలాగా ఈ విభజన కేవలం ఊహాజనితమైనది. ఒక సెగ్మెంటులో న్యూరానులు తమకు పైన క్రింద ఉన్న సెగ్మెంటులలో ఉన్న న్యూరానులతో సంబంధం కలిగి ఉంటవి. ఈ సంబంధము, డెండ్రైటులు, న్యూరానులో ఉండే సూక్ష్మకణములలో చేరినందున ఏర్పడుతుంది. ఏగ్జాను చివరభాగము కండరములోనో, గ్రంథిలోనో అంతము అవుతుంది. వెన్నుపాము నుంచి 31 జతల నరములు శరీరభాగములకు పోతవి. ఇందులో కంఠభాగంలో 8, వక్ష భాగంలో 12, ఉదరభాగంలో 5, జఘన భాగంలో 5, మూల భాగంలో 1 ఉంటవి. ఈనరములను ఇరిటేట్‌చేస్తే ఆ నరమునకు సంబంధించిన ప్రదేశములో ఉన్న కండరములు సంకోచిస్తవి. ఆ ప్రదేశంలో గ్రంథులు స్యందిస్తవి. ఆ భాగంలో బాధ తెలుస్తుంది. ఈ బాధ చర్మంలో ఒకభాగంలో తెలుస్తుంది. కాని వెన్నునరం మోటారుశాఖను ఇరిటేట్ చేస్తే కండరములు, గ్రంథులు మాత్రమే సంకోచస్యందనములు చేస్తవి. సెన్సరీ శాఖను ఇరిటేట్ చేస్తే బాధమాత్రమే దానికి సంబంధించిన చర్మభాగంలో తెలుస్తుంది. శరీరంలో ఇచ్ఛాధీనకండరముల సంకోచ వ్యాకోచములు మన ఇచ్ఛాధీనంగా జరుగుతవి. కాని, శరీరాంతరాళములలో ఉన్న జీర్ణకోశము, గర్భాశయము, రక్తనాళములలో ఉన్న కండరములకు పోయే మోటారుశాఖలూ, అక్కడనుంచి వార్తలు తెచ్చే సెన్సరీశాఖలూ వేరుగా ఉంటవి. వాటికి సంబంధించిన న్యూరానులు వేరుగానే ఉంటవి. వీటి నన్నింటినీ కలిసి స్వచ్ఛంద నరాశయము, (Autonomous Nervous System) అంటారు.

స్వచ్ఛందనరాశయంలో సింపతెటిక్, పేరా సింపతెటిక్ అని రెండుభాగము లున్నవి. (Sympathetic and Para Sympathetic Neruous Systems).

ఇందులో సింపతెటిక్‌భాగములో చాలా గేంగ్లియాను లున్నవి. ఈ గేంగ్లియానులలో ఉన్న న్యూరానుల తంతువులు ఒక గేంగ్లియానుకు మరొక గేంగ్లియానుకు సంబంధము ఏర్పరుస్తవి. ఈ గేంగ్లియానులను వ్రేళ్లాడే పూసలదండతో పోల్చవచ్చును. ఇటువంటి గేంగ్లియాముల దండలు వెన్నుపాముకు రెండువైపులా రెండు ఉంటవి. వెన్నులో సెగ్మెంటులలో ఉండే న్యూరానులకూ సింపతెటిక్ గేంగ్లియానులకూ తంతువుద్వారా సంబంధం ఉంటుంది. ఈ సింపతెటిక్ గేంగ్లియానులకు పోయే తంతువులు, సెరిబ్రముక్రింద ఉన్న మెదడు భాగములలో ఉన్న న్యూరానులనుంచి ఆరంభించి, వెన్నుపాములో ఉన్న న్యూరానులతో కలిసివుంటవి. అక్కడనుండి వేరే తంతువులు, సింపతెటిక్ గేంగ్లియానులలోకి పోతవి. అక్కడ ఉండే న్యూరానులనుండి వేరే తంతువులు బయలుదేరి, రక్తనాళములను అనుసరిస్తూ పోతవి. ఇలా పోతూ ఇవి అసంఖ్యాకములయిన వలలలాగా ఏర్పడుతవి. ఇటువంటి వలలు, హృదయము, జఠరాశయము, గర్భాశయమువంటి శరీరాంతర్భాగములలో ఉండే భాగములన్నింటిమీదా ఉంటవి. ఈ తంతువులలోనూ మోటారు సెన్సరీ తంతువులు రెండూ ఉంటవి. 'సింపతెటిక్' అంటే "కలిసి అనుభవించు" అని అర్థము. వీటి ప్రభావమును అనేక శరీరభాగములు ఏకకాలంలో అనుభవించే కారణంచేత ఈ నరాశయవిభాగమునకు ఈపేరు వచ్చింది. ఇతర శిరోనరముల ద్వారానూ, వెన్ను నరముల ద్వారానూ, సింపతెటిక్ నరములద్వారానూ ఒకే అంగమునకు తంతువులు వచ్చినా, వాటిని ఇరిటేట్‌చేసినప్పుడు ఫలితములు పరస్పరం విరుద్ధములుగా ఉండవచ్చును. ఊపిరితిత్తులకూ జఠరాశయానికీ పోయే వేగస్ నరమును ఇరిటేట్ చేస్తే హృదయం నెమ్మదిగా కొట్టుకొని చివరకు ఆగిపోతుంది. గొంతు పిసికినప్పుడు ఇదే జరుగుతుంది. కాని హృదయానికి పోయే సింపతెటిక్ నరములను ఇరిటేట్‌చేస్తే హృదయవేగం అధికం అవుతుంది. (శేషం)





స్నేహం

బంధువులకన్నా స్నేహితులే నయము. బంధువులనగానే కొన్ని సందర్భాలలో నయినా ఆదుకోగలరని అనుకుంటాము. అందుకు బదులుగా ఓర్వలేనితనము చూపుతారు. ఏదో కొంత అభిమానము ఉన్నట్లు కన్పించినా అది కేవలం "ముఖస్తుతి" మాత్రమే. ఏమయినా నామట్టుకు నేను బంధుత్వానికన్నా స్నేహానికే విలువ ఇస్తాను.

దోర్నాదుల రాజేశ్వరి (నెల్లూరు)

యువతుల సమస్య

ఈ వ్యాసం ఒకసారికాదు, మూడు నాలుగుసార్లు చదివాను. ఇంతకూ ఇందులో యువతులసమస్య ఏమిటో నాకు అర్థంకాలేదు. కొందరు తల్లి దండ్రులు ఆడపిల్లలను చదివించి, ఉద్యోగాలు చేయించి కుటుంబాలను పోషించుకుంటున్నారనా? లేక ఉద్యోగాలుచేసే ఆడపిల్లలకు కొన్నాళ్లకు వివాహంమీద మనస్సు మళ్ళినా, తల్లిదండ్రు లకు ఆ విషయం చెప్పలేక తీరని కోరికలతో కృంగి పోతున్నారనా, లేక చదివి ఉద్యోగాలుచేసే ఆడ పిల్లలను పెళ్లిచేసుకొనడానికే యువకులు ముందుకు రావడంలేదనా? ఒకచోట ఆడపిల్లలకి కూడా స్వతంత్రం యివ్వాలి మొగపిల్లలతోపాటు అంటూ వ్రాశారు. ఈ ఇవ్వవలసిన స్వతంత్ర స్వరూపం ఏమిటో స్పష్టంగా వివరించలేదు. ఇంతకూ వ్యాసం విపులంగా, సోదరీమణులకు అందరికీ అర్థం అయేటట్లు వ్రాసిననాడే దాని ప్రయోజనం వుంటుంది—

బొల్లాప్రగడ కామేశ్వరి (అనపర్తి)

* * *

ఎప్పటివలె అత్తలూ, ఆడపడుచులూ, వారి సాధింపులూ కాకుండా ఈ వ్యాసం కొత్తతరహాగా వుంది. వ్యాసంలో రచయిత్రిగారు ఉదహరించిన రీతి కుటుంబాలు ఎన్నో వున్నాయి. 'చిత్ర'గారు యువతులసమస్య చక్కగా విపులీకరించారు. నాకు తెలిసిన ఒక కుటుంబం ఉన్నది. వాళ్ళు ఐదు గురు ఆడపిల్లలు. తండ్రి బ్రతికివుండగానే పెద్దమ్మాయి పెండ్లిచేశారు. తరువాత తండ్రి పోయాడు. కుటుంబబాధ్యత తరువాత ఇద్దరు అమ్మాయిల మీదపడింది. వారిద్దరూ చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిద్దరితరువాత అమ్మాయి చదువుతూవుండగానే అక్కలవలె బాధపడాల్సి వస్తుందనో ఏమో పెళ్ళిచేసుకున్నది. పెళ్ళిచేసుకోకుండా ఉద్యోగాలు చేస్తున్న ఈ ఇద్ద రమ్మాయిల్లో పెద్దమ్మాయిని అందరూ 'చిత్ర' గారు చెప్పినట్లు 'ఆ అమ్మాయికి పెళ్ళికాలేదు' అందరితో ఫ్రీగా మాట్లాడుతుంది అని అంటూ ఉంటారు. ఇలా అనటంవలన ఆ అమ్మాయి ఎంతో బాధపడుతుంది.

అల్లూరి అరుణ (సూర్యాపేట)

* * *

ఆమె వ్రాసినట్లే చదువుకున్న అమ్మాయిలు పేరంటానికి వెళ్లినా, నల్గురితో 'ఫ్రీ'గా మాట్లాడు తున్నా ఆమెను ప్రత్యేకంగా చూచి ఏవేవో చెప్పు కొంటారు. పేరంటంలో అందరికాళ్లకు వాళ్ల చేతులతో పసుపురాసి ఈ చదువుకొన్న అమ్మాయి దగ్గరకువచ్చి ఆగిపోతారు. చదువుకున్నవాళ్ల పసుపు, గంధం, రాసుకోరుగా అని ఎత్తి పొడుపుగా అంటారు. అందువలననే చాలామంది చదువుకున్న వాళ్లు పేరంటానికి వెళ్ళటానికి జంకుతారని నా అభి ప్రాయం. (నా కిలాటి అనుభవాలు జరిగాయి. కాబట్టే నేనిది రాయకుండా వుండలేకపోతున్నాను.) ఆమె వ్రాసిన వివాహ [illegible] యువతులసమస్య అలా వుంచి ముందు చదువుకున్న అమ్మాయి అమ్మ లక్కల వింతవింత ప్రశ్నలకు జవాబుచెప్పడం, వాళ్ల ప్రత్యేకమైన చూపులనుండి తప్పించు కోవడం పెద్ద సమస్యగా తయారైంది. ఈలాటి సమస్యలు ఎప్పటికైనా తీరుతాయో లేదో!

వేమరాజ రేవతి (హైద్రాబాద్)

* * *

చిత్రగారు ఈవ్యాసములో అసలు సమస్య గురించి పూర్తిగా వ్రాయలేకపోయారేమో ననిపి స్తుంది. నామట్టుకు నేను బి. ఏ ప్యాసయ్యాను. కాని నాకు ఉద్యోగముచేయడము ఇష్టములేదు. మా తల్లిదండ్రులుగూడా నన్ను బలవంతపెట్ట లేదు. ఇంతకూ చెప్పొచ్చే దేమిటంటే కుమార్తెలచే ఉద్యోగం చేయించే తండ్రులున్నారని చిత్రగారు వ్రాసినదానితో మేము ఏకీభవించలేము. ఎంత బీదస్థితిలో ఉన్నా తండ్రులు కుమార్తెలచే ఉద్యో గాలు చేయించరు. కన్నప్రేమ అలాంటిది. ఈ చిన్నతప్పు మినహా వ్యాసం చాలాబాగుంది.

ఇ. ఉషాహేమచందర్ (హైదరాబాదు)

* * *

స్నేహితురాలి పరిస్థితిగూర్చి "చిత్ర"గారు తన బాధను వెల్లడిచేశారు. ఆ స్నేహితురాలు తండ్రి లేనికొరతను తీర్చి ఆమెకుటుంబ విషయంలో ఆమె బాధ్యతను సక్రమముగ నెరవేర్చినారు. అది ఆమె వ్యక్తిత్వమునకు ఎనలేని గౌరవము చేకూర్చింది.

"స్త్రీస్వాతంత్ర్యము!" "సమాన హక్కులు" అని ఘోషిస్తూ వాటికొరకు పోరాడు తరుణంలో చిత్రగారు వెల్లడించిన నిస్పృహలు స్త్రీజాతికి వారి ఆశయములకు గొడ్డలిపెట్టువంటివి. తలిదండ్రులు తమ బిడ్డలను తమ స్వార్థమునకై వినియోగించుకొనుట చాలా అరుదు. బిడ్డల శ్రేయస్సుకై పాటుబడువారు తమతాహతుకు తగిన సంబంధములను తెస్తే అందుకు అంగీక రించి వివాహముచేసుకొనుటే అటు తలిదండ్రు లకు, ఇటు ఉద్యోగముచేస్తున్న స్త్రీకి శ్రేయ స్కరము! అంతేగాని, "మేము ఇంత చదువు కున్నాము. ఉద్యోగము చేస్తున్నాము. మీరు తెచ్చిన సంబంధము చేసికొన్న మా తాహతుకు భంగకరము" అని విర్రవీగితే నాగరికత పేరుతో వారికై వారు ద్రోహముచేసికొని, సంఘమునకు, దేశాభివృద్ధికి సేవచేయుట అటుఉంచి వాటి అభివృద్ధినిరోధ మునకే వారు ఎక్కువ బాధ్యులు కావలసిఉంటుంది.

జె. శ్యామలసువర్ణరత్నమ్మ (బనగానిపల్లి)

* * *

చిత్రగారు వ్రాసిన సమస్య చిత్రంగానే ఉంది. ముఖ్యంగా ఆమె 'తల్లి—దండ్రుల అసమర్థత' అన్న వాక్యం చాల శోచనీయంగా ఉంది. ప్రతి తల్లి దండ్రులకు ఆడపిల్లను కన్న ఘడియనుండి ఆమెకు సక్రమంగా వివాహం జరిగిందాకా మనశ్శాంతి యుండదు. ఏవో ఆర్థికచిక్కులవల్ల, కట్న పిశాచి నెదుర్కోలేక ఆడపిల్లలను చదివించి వారికి జీవనోపాధి చూపించిన తల్లి తండ్రుల నిట్లా నిందించడం అసమంజసం. చదువుకుని ఉద్యోగాలు చేసే, ప్రపంచజ్ఞానముగల పెద్దపిల్లలను సంప్ర దించినమీదటే అత్యవసరపరిస్థితులలో తల్లి — దండ్రులు ఆమెకు పెళ్ళిచెయ్యకుండ చిన్నవారికి

చేసినట్లైతే, అక్కడి పరిస్థితులను తెలిసిన పిల్లలు బాగా అవగాహన చేసుకుని వారికి సలహాలిచ్చుటలోగాని, త్యాగంచేసి సహాయపడుటలోగాని చాల గొప్ప తనముందని నా అభిప్రాయము.

సునర్ల సూర్యకాంతం (గుడివాడ)

* * *

ప్రస్తుతపు యువతులనుగూర్చి చక్కగా వ్రాశారు. చాలామంది యువతులు డబ్బు సంపాదన అనే సరదాలోపడి ఉద్యోగం చేస్తారు. ఒక సంవత్సరం అయ్యేసరికి ఉద్యోగంఅంటే వారికి విసుగు పుడుతుంది. మానేద్దామనుకుంటారు. కాని వారి తల్లి — దండ్రులకుమాత్రం ఉద్యోగం మానేయడం ఇష్టం ఉండదు. నాకు తెల్సిన ఒక అమ్మాయి ఉంది. ట్రైనింగ్ కాకుండా గ్రామసేవికగా ఉద్యోగానికి వచ్చింది. అలాగే ఆ అమ్మాయి 18 నెలలు ఉద్యోగం చేసింది. వాళ్ల నాన్నగారు ట్రైనింగుకు పంపను అనేవారు. పాపంఆమె ట్రైనింగుకు ఆర్డర్స్ వస్తే ఉద్యోగానికి స్వస్తిచెప్పి పెండ్లి చేసుకోవాలనుకొంది. ఇంతగా కబుర్లు చెప్పిన వాళ్ల నాన్నగారు తీరా ట్రైనింగు ఆర్డర్స్ వచ్చాక వెళ్ళి జాయిన్ అవ్వమని ఖచ్చితంగా చెప్పారు. తండ్రిమాటకు ఎదురు చెప్పలేక ఆ అమ్మాయి వెళ్ళి జాయినయింది. ఈవిధంగా తండ్రిమాటకు ఎదురుచెప్పలేక, వాళ్ల కోర్కెలను అణచుకొని ఉద్యోగాలుచేసే స్త్రీలు చాలామంది ఉన్నారు. ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిల తల్లి — దండ్రులకు ఈ వ్యాసం కనువిప్పు కలిగిస్తుందని భావిస్తున్నాను. ఇప్పటికైనా అమ్మాయిల తండ్రులు వివాహవిషయం ఎత్తుతారేమో.

శ్రీమతి సత్యరామకృష్ణ (నర్సీపట్నం)

* * *

పెళ్లి సంబంధాలూ-పెద్దలూ

యల్. కె. రత్నమాలగారు వ్రాసిన "పెళ్ళి సంబంధాలూ—పెద్దలూ" అనే వ్యాసం చదివిన పిమ్మట ఎంతో ఆశ్చర్యము వేసింది. ఈ రోజుల్లో కూడా ఇంకా ఇలాంటి మనస్తత్వంవాళ్ళు ఉన్నారంటే ఎంతైనా విచారించవలసిన విషయం. పెళ్ళికూతురు యొక్క కంఠం తెలిసికోడానికి పాట పాడవలసిన అవసరం ఏమిటి? పేరు చెప్పేటప్పుడు ఆమె స్వరాన్ని తెలిసికోవచ్చుకదా! ఆ అమ్మాయియొక్క చదువును బట్టే ఆమె పుస్తకం చదవటం వచ్చో, లేదో సులభంగా తెల్సుకోవచ్చునే. మగపెళ్ళివారు పెండ్లి కూతురును ఇష్టం వచ్చినట్లు నడవమనటం మొదలైన అసభ్యకరమైన ప్రవర్తనవలన ఆ అమ్మాయి మనస్సు ఎంత బాధపడుతుందో తెల్సుకోవాలి. ఈకాలంలో ఎస్. ఎస్. ఎల్. సి. వరకే చాలామంది చదువుకుంటున్నారు. అలాంటివాళ్ళకి కొంచం వ్యక్తిగతగౌరవము ఉంటుందనేమాట గుర్తుంచుకోవాలి. అంతేగాని వాళ్ళు సంతల్లో పశువులు కాదుగా వాళ్ళు నడవమన్నట్లు నడవటానికి!

కుమారి డి. విజయబాల (శ్రీకాకుళం)

* * *

వ్యాసం రత్నమాలగారు అనుకున్నంత బాగా వ్రాయలేదు. పెళ్ళిచూపులకు వచ్చి పేరుకూడా అడగకుండా ఎవరయినా ఊరుకుంటారా? రచయిత్రి తమ తమ్ముని సంబంధాలగురించి వ్రాశారు. కాని, పెళ్ళిచూపులలోటుపాట్లను బాగా వివరించలేదు. ఇలా విమర్శించినందుకు రచయిత్రి బాధపడవద్దు.

కుమారి భాగవతుల రాజ్యలక్ష్మి (నండూరు)

* * *

"అమ్మాయినిచ్చి పెళ్ళిచేసివెయ్యగానే మన బరువు బాధ్యత తీరిపోయింది" అని భావించే పెద్దమనుష్యులకు ఈ వ్యాసం చెంపపెట్టు. రచయిత్రి చక్కగా విపులీకరిస్తే ఇంకా బాగుండేది.

సి. హెచ్. పార్వతి, (రామచంద్రపురం)

సూచన

"ఈ పత్రికల్లో వ్యాసాలూ, కథలూ వ్రాసే ఆధునిక యువతుల అభిప్రాయలేమిటో నే నింత వరకు అర్థం చేసుకోలేకపోయాను—నువ్వేం చదువుకున్నావు? పుస్తకం చదవగలవా? ఏదీ చదువు. రెండడుగులువెయ్యి. నీకు సంగీతంవచ్చా? వంటి ప్రశ్నలు వేయకూడదట"— పెళ్ళిచూపులు జరిగిన ఒక యువకుని బాధను వివరించారు. పైవ్యాసంలో పెళ్ళిసంబంధాల విషయంలో ఎక్కడో దగ్గర వాళ్లైతేతప్ప, మనసుల మాటలాడుంచి, అబ్బాయీ, అమ్మాయీ ఒకరికొకరు కనీసం "ముక్కూ—మొహము" కూడ తెలియనివారవడం జరుగుతోంది. ఏవైనా విషయాలు తెలుసుకోడానికి యువకులవలంబించే ఏ పద్ధతైనా ఎబ్బెట్టుగానే కనిపిస్తోంది. (పెళ్ళీడు కొచ్చిన అమ్మాయి తల్లిదండ్రులకు కూడ) అందువలన ఈ విషయంలో యువతీ లోకానికి క్రింది సూచన చేయదలచాను. "బ్రతికున్నంతకాలం తనను కట్టుకొని ఉండవలసిన వాడు, తనను గురించి క్షణమువరకు ఏమీ తెలియనివాడు — అటువంటివానికి తననుగురించి ఏమి తెలియాలి? తెలియడానికి మార్గమేమిటి?" అన్న విషయాలమీద యువతులు, ముఖ్యంగా యుక్త వయస్సుకు వచ్చినవారు, వివాహమై కొద్ది కాలం గడిపినవారు (అనుభవంమీద వీరికే ఎక్కువ విషయాలు తెలియవచ్చు) తమ అభిప్రాయాలను తెలిపి "పరుల నొప్పింపక, తా నొవ్వక" రీతిలో ఏదైనా 'పెళ్ళిచూపుల పద్ధతి'ని రూపొందిస్తే యువకులకు చాల సహాయం చేసినవారవుతారు.

ఒక యువకుడు (పూనా)

* * *

విమర్శలా!

హైద్రాబాద్ సోదరిగారు వ్రాసినదానిని తిరిగి విమర్శిస్తూ, "విమర్శించడం పాఠకుల హక్కు" అని వ్రాశారు. సోదరి చెప్పినట్లు విమర్శించడం పాఠకుల హక్కు కావచ్చు. దానిని నేను కాదనను. కాని, ఈ పవిత్రమైన హక్కును దుర్వినియోగ పరచుకోకుండా సద్వినియోగ పరచుకోడం చాలా మంచిది. పందొమ్మిది సంవత్సరాలకే కొడుకులు మనవలు ఉంటారా? అని విమర్శించారు. అలా తీసుకుంటే, ఈకాలంలో ప్రేమించాననగానే పెళ్ళి చేసేస్తారా? నవ్వుతుంటే నవరత్నాలు రాలుతాయా? మీరు విమర్శించిన ప్రకారం తీసుకుంటే, నేను వ్రాసినదంతా తప్పే కావచ్చు. కేవలం తమాషాగా వ్రాస్తేమేకాని, సందర్భానుసారముగా కర్త, కర్మ, క్రియలుపెట్టి వ్రాస్తామా? అలా తీసుకుంటే ప్రచురిస్తున్న కథలన్నీ సందర్భానుసారంగానే వున్నాయా? మీరే చెప్పండి. కాబట్టి దీనిపైన విమర్శించాలనుకున్న సోదరులుకాని, సోదరీమణులుగానివుంటే, ఇంతటితో మన విమర్శలను ఆపుచేస్తే, ఇటు కుతూహలంకొద్దీ వ్రాసిన (కథను) నాకు, అటు మన విమర్శలను సహృదయతతో ప్రచురిస్తున్న ఎడిటర్‌గారికి, వీటిని చదువుతున్న పాఠకులకు సంతోషం కలిగించి, రక్షించినవాళ్ళమవుతాము. కాబట్టి దయచేసి, విమర్శలను ఆపుచేయవలసినదిగా సహృదయులైన పాఠకులను ప్రార్థిస్తున్నాను.

కుమారి కె. మీనావిజయ్ (బాపట్ల)

★

వంటలు

మైదాపూరీ పాయసం

కావలసిన వస్తువులు

మైదాపిండి	-	½ అర్ధాకు
నేయి	-	1 కప్పు
చక్కెర	-	తగుమాత్రం
పాలు	-	1 కప్పు
ఏలకులు	-	3
లవంగాలు	-	3
జీడిపప్పు	-	కాసిని
ఎండుద్రాక్షపళ్ళు		కాసిని

మైదాపిండి తడుపుకుని పూరీలు వత్తుకోవాలి. వాటిని చిన్నచిన్న ముక్కలుగా కోసుకుని నేతిలో వేపుకోవాలి. నేయి సలసలా కాచి, ఈ వేగిన ముక్కల్ని అందులో వేసి మెత్తగా ఉడకనివ్వాలి. తరవాత చక్కెర (రుచిని బట్టి) వేసి, అది కరిగిందాకా ఆగి, పాలు కలపాలి. పది నిమిషాలు సన్నటి సెగ మీదఉంచి వేయించిన జీడిపప్పులు, ద్రాక్షపళ్లు, ఏలకులూ లవంగాల పొడుం అందులో కలుపుకోవాలి.

★

చదువుల్రావు


కలలో
మన క్లాస్ విద్యార్థులందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుని ఫస్ట్‌క్లాస్ తెచ్చుకున్న మన చదువుల్రావుగారు మన క్లాస్ విద్యార్థులు అల్పాహారవిందు ఇస్తున్న సందర్భంలో మీరందరూ విచ్చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు మన ప్రిన్సిపాలుగారు మాట్లాడ
అందరికంటే అన్నిరంగాల్లో చలాకీగా ఉంటూ చదువుల్లో కూడా తన ప్రతిభ చూపించి, తన పేరు నిలబెట్టుకున్న మన చదువుల్రావు అభివృద్ధిలోకి రావాలని ఆశిస్తున్నాను.
లెక్చరర్లను పేర్లు పెట్టి ఏడిపిస్తున్నట్లు పైకి కనిపించినా అది కేవలం 'హాస్యామరసం'కోసమే చేస్తున్నాడని చాలా మందికి తెలీదు. ఇటువంటి వారు నాకు శిష్యులుగా ఉండడం వలన చాలా సంతోషంగా ఉంది
ఇంక టీపార్టీకి నడవండి
రావుగారూ టీ తీసుకోండి...
ఆ. ఆ. మా జయశ్రీగారా
సూడండమ్మగారోయ్ అబ్బాయిగారు మా నాసెయ్యి పట్టుకుని ఎట్టాగుంజుతుండరో
థేంక్యూ థేంక్యూ...
ఏమిటే ఆగోల?
వీడికెప్పుడూ ఇదే గోలలాగుంది. జయశ్రీ, రావ్ అంటూను, రండి చూద్దురిగాని-
వెధవకి ఊరికే కలలు, కలవరింతలూను

హాయవాతా అదృష్టగాథ



మూలం: లాంగ్‌ఫెలో

అనుసరణ: పి. గణపతిశాస్త్రి

జరిగిన కథ

జాబిల్లి చిన్నారి భార్య నోకోమిస్ ముద్దులకూతురు వెనోనా. పడమటిగాలి అనే తుంటరివాడు ఆమెను మోసగించి మటుమాయమవుతాడు, వెనోనా హాయవాతాను కని దిగులుతో మరణిస్తుంది. నోకోమిస్ మనుమణ్ణి చేరదీస్తుంది. హాయవాతా క్రమక్రమంగా పెరిగి పెద్దవాడయి ఎందరెందరో వీరులను ఓడిస్తాడు.

నోకోమిస్ జరిగిన కథ అంతా పూసగుచ్చినట్టు మనుమడికి చెబుతుంది. హాయవాతా పడమటిగాలితో యుద్ధంచేసి ఓడిస్తాడు. తిరుగు ప్రయాణంలో హాయవాతా దకోటా దేశానికి వెళ్లి మకోరిమో నడిగి మంచిమంచి బాణాలు తెచ్చుకుంటాడు. మకోరిమో కుమార్తె మిన్నెహాహా హాయవాతాను ప్రేమిస్తుంది. కాని అతడు తన ప్రేమను తోసిపుచ్చి బాణాలు తెచ్చుకున్నందుకు ఆగ్రహిస్తుంది. హాయవాతా ఆమెను బుజ్జగించి స్వదేశానికి తిరిగివెడతాడు. ఇంతకాలం ఎదురుచూచిన మనుమడు క్షేమంగా తిరిగివచ్చినందుకు నోకోమిస్ ఆనందిస్తుంది. హాయవాతా పెద్దసైన్యం సమకూర్చుకుని శత్రురాజులనందరినీ జయిస్తాడు. ప్రాయోపవేశంచేసి, దేవదూతను ఓడించి, కులదైవం మెప్పుపొంది దేశంలో కరువు నివారిస్తాడు.

అలాగ నాలుగయిదురోజులు గడిచినతరవాత, ఒకనాడు నోకోమిస్ హాయవాతాదగ్గిరికి వచ్చి 'ఇదేమిటి నాయనా! రోజురోజుకి ఇలాగ చిక్కిపోతున్నావు! నీ కేమి లోటని! శత్రువులనందరిని లోబరుచుకున్నావు! ఆపైన పంటలు బాగా పండుతున్నాయి. మరి ఎందువల్ల నీ కింత దిగులు?' అంది.


హాయవాతా కొంచెం సేపాలోచించి 'అమ్మమ్మా! నీ వన్నమాట నిజమే! కాని మన శత్రురాజ్యం దకోటాలో మకారిమో లేడూ! మిన్నెహాహా అని అతని కొక కుమార్తె ఉన్నది. అంతటి అందగత్తె మరి ఈలోకంలో ఎక్కడా లేదు! నేనా అందాలరాశి పెళ్ళి చేసుకోవాలని ఉబలాటపడుతున్నాను! నీ కది నచ్చదని నాకింతకుమునుపే తెలుసును. అందుకని ఎటు తేల్చుకోలేక ఇన్నాళ్ళనించి ఏమి చెయ్యాలా? అని తటపటాయిస్తున్నాను. నేను చిక్కి శల్యమయిపోవడానికింతకంటె వేరే కారణం లేదు!' అన్నాడు. ఆపైన నోకోమిస్ కవంతసేపాలోచించి చిన్న సలహా ఇచ్చింది:

'పోనీ! మన దేశంలో ఇంకొక చక్కనిచుక్క నెవరినయినా పెళ్ళి చేసుకోకూడదూ! పరి కోరి ఆ పగవారి పిల్లనే పెళ్ళిచేసుకోవడ మెందుకు? ఇంతకీ మకారిమో దీని కంగీకరించాడా?'

'లేదు! ఇంకా అడగలేదు!'

'పోనీ ఆ చిన్నదానికేమయినా నీమీద వల్లమాలిన ప్రేమ కలిగిందా?'

'కొంత నేనంటే ఇష్టం లేకపో



వెండిమబ్బు

కన్నడ మాతృక * త్రివేణి

అనువాదం * శర్వాణి

జరిగిన కథ

'వెండిమబ్బు' యజమాని సదాశివరావు గారు, భార్య లలితమ్మగారి ప్రోద్బలం వల్ల తమ ఏకైక పుత్రిక ఇందిరను మోహనుడికిచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించి, పైచదువులకు అతణ్ణి అమెరికా పంపుతారు. మోహనుడు అమెరికా వెళ్ళిన కొద్ది కాలానికి లలితమ్మగారికి గిరిరాజు కలుగుతాడు. ఇందిర ఈ సంగతి తెల్పితే మోహనుడు పట్టీపట్టనట్టు సమాధానం వ్రాస్తాడు. మొదలే క్షీణించిన లలితమ్మగారు కూతురు పెళ్ళి చూడకుండానే దిగులుతో కన్ను మూస్తారు. పసికందు గిరిరాజుకు తల్లి లేనిలోటు తెలియకుండా ఇందిర పెంచుతూ ఉంటుంది. మోహనుడు అమెరికాలో చదువు ముగించుకుని స్వదేశానికి బయలుదేరుతాడు. అతడికి స్వాగతం చెప్పేందుకు రావుగారు బొంబాయి ప్రయాణమవుతారు.

(గతసంచిక తరువాత)

"ఇప్పటినుండే బిడ్డను ఎవరికన్నా నువ్వే అలవాటుచెయ్యమ్మా."

"ఎందుకు నాన్నా అంత కష్టం? వాడికీ అదికష్టమే కావచ్చు. నాతో ఎందుకు పంపకూడదు నాన్నా?"

"అదొక్కటి మాత్రం వీల్లేదమ్మా."

"అలా అయితే ఇప్పటినుంచి నర్సుకే అలవాటు చేస్తాను. ఇక వాడెంత మొండికేసినా, నర్సు చేతనే అన్నీ చేయిస్తాను.

"అలాగే చెయ్యమ్మా, వీలయినంతవరకూ గిరి నుండి దూరంగా ఉండు. లేకపోతే తరువాత వాడు బెంగపెట్టుకోవచ్చు."

"కాని నాకుమాత్రం చాలా కష్టంగా ఉంటుంది. వాడిని విడిచి నేనుమాత్రం ఎలా ఉండగలను ?"

"ఏం ఫరవాలేదు. అదే సరిపోతుంది" అన్నారు రావుగారు చిలిపిగా.

"ఎప్పటికి సరిపోతుందో ?"

"నీకో అబ్బాయి పుట్టినప్పుడు" అని నవ్వారు రావుగారు.

"పో నాన్నా"—అంది ఇందిర చిరుకోపంతో.

"ఇప్పుడు నేనొక్కడినే వెళ్లనా బొంబాయికి ?

"నీ ఇష్టం."

"మోహనుడి తండ్రి వచ్చి ఉంటారో ఏమో ? ముందు తల్లిదండ్రులను చూసి వస్తానంటే, అలాగే చెయ్యనీ. వాళ్లమ్మకూడా చూడాలని ఆత్రుతగా వేచిఉంటుందిగా. అక్కడికి వెళ్లే రమ్మంటాను."

"ఊఁ."

"లేకపోతే ముందు ఇక్కడికే వచ్చి ...."

"వద్దు. తల్లిదండ్రులను చూసే రానివ్వండి."

"నీకు అతడిని చూడాలని ఆత్రమే లేదు. అంతేనా ?"

"పో నాన్నా" —అంది ఇందిర.

మోహనుడిని చూడాలని తనకు ఆత్రంలేదా ? మోహనుడిని చూడాలనే కోరిక, అతడిమీది ప్రీతి ఎలాంటి విషమపరిస్థితులలోనూ తనకు జీవితంలోని ఆశ నశించిపోకుండా చేసింది.

తనకు ఆత్రంలేదా ?

—43 పేజీ చూడండి

ఎఫ్. బి. ఐ. కథలు-6



నార్మన్ ఆబట్

డెన్వర్ (కొలరాడో రాష్ట్రంలో ఒక నగరం) పోలీసు దళానికిచెందిన డిటెక్టివ్ శావ్ ఫిన్నీ పిస్టల్ కాల్చడంలో బాగా ఆరితేరినవాడు. అందుకనే ఇది ఎవరో నిపుణుడు చేసిన పని అని గ్రహించాడు.

ఆ అమ్మాయి ఒక డెన్వర్ వీధి ప్లాట్‌ఫారంమీద నుంచుని తన స్నేహితురాలితో మాట్లాడుతూ ఉండగా రెండు తుపాకి గుళ్లు ఆమె గుండెలో నుంచి దూసుకుని వెళ్లిపోయాయి. రెండూ ఒక దాని ప్రక్కన ఒకటి ప్రవేశించాయి! వారిద్దరూ నుంచుని మాట్లాడుతున్న చోటుకి ప్రక్కగా ఒక చిన్న సందు ఉంది. ఈ తుపాకిగుళ్లు ఆ సందులో నుంచి వచ్చాయి.

పోలీసు నిపుణులు పరీక్ష చేసి నిర్ధారణ చేసినది : (1) తుపాకి .32 సైజుది, (2) హంతకుడు 60 అడుగుల దూరం నుంచి కాల్చిఉండాలి, అని

అంటే కాల్చిన మనిషికి మంచి గురి ఉందన్న మాట. 'ఈ విద్య'లో నిపుణుడయి ఉండాలి.

చనిపోయిన స్త్రీని గురించి అప్పటికి ఎవరికీ అంతగా తెలియదు. ఆమె పేరు అడాస్నెల్. వయస్సు 29. (అన్నివిధాలా హంతకుడి లక్ష్యమయిన ఆమె హృదయంలో దాగిఉన్న రహస్యాలే చివరికి హత్యారహస్యాన్ని బయట పెట్టాయి.)

సహాయం చెయ్యలేని పరిస్థితి


అడాస్నెల్ హత్య కళ్లారా చూసిన ఆమె స్నేహితురాలి సాక్ష్యం పోలీసులకు ఎక్కువ సాయపడలేదు.

ఆమె హంతకుడిని చూడలేదు. అసలు అడాకి తుపాకి దెబ్బ తగిలిందని కూడా ఆమె (అడా) అక్కడే కూలి పడిపోయేవరకూ తెలియలేదు. తుపాకి చిన్నసైజుది కాబట్టి ఎక్కువ శబ్దం చెయ్యలేదు.

హత్య 3—4—1944 పొద్దున సుమారు పది గంటలకు జరిగింది. అడా స్నేహితురాలుతో పరిచయమయి నెల రోజులు కావస్తోంది. అడా స్నెల్ కొత్త ఇంటికి మారి అంతకాలమే అయింది.

అసలు మిస్ స్నెల్ డెన్వర్‌కి వచ్చి అప్పటికి ఆరు నాళ్లు మాత్రమే అయ్యింది. యుద్ధ కాలంలో కార్మికులు కరువు కావటంచేత స్త్రీలకు

—42 వ పేజీ చూడండి



జరిగినకథ

ఐదు వాటాల లోగిలియిల్లుగలావిడ వరసమ్మగారు మనుమడు సూర్యానికి తల్లీతండ్రీతానే అయి పెంచింది. ఆ ఐదు వాటాల లోగిలిలో రకరకాల కుటుంబాలున్నాయి. రాజ్యలక్ష్మికి నరసమ్మగారంటే చనువూ, భక్తీ. సూర్యం బావంటే సిగ్గూ, నిర్మలంటే స్నేహం. సాంబశివం గారికి గతం గాయం. సూర్యం నిర్మలకి పాఠాలు చెబుతూంటాడు. మేనమామ కూతురు మీనాక్షితో సూర్యానికి చనువు ఏర్పడుతుంది. నూతిగట్టున కాలు జారిపడిన నరసమ్మగారికి నిర్మల ఉపచారం చేస్తుంది. రాజ్యలక్ష్మి పీడ విరగడచేసుకునేందుకు లలితాంబ పథకం వేస్తుంది. తానుచేసిన తప్పు భార్యకు చెప్పే ధైర్యం లేని సాంబశివంగారు ఈ సంగతి తెలిసి క్షోభకు లోనవుతాడు. సూర్యం శంకరంగారి అమ్మాయిని ప్రేమిస్తున్నాడని మంగపతి రీటాకి చెబుతాడు. నరసమ్మగారికి నిర్మల తన గత చరిత్ర చెబుతూంటుంది.

(గత సంచిక తరువాయి)

"ఎంతమాట!" నరసమ్మగారు ముక్కున వేలేసుకుని, వులిక్కిపడి, నిర్మలజుట్టు పుచ్చుకొని మొహంఎత్తి "అయితే నీకు మొగుడున్నాడు?" అని గద్దించింది.

నిర్మలతలూపింది.

"ఛీ! ఎంత పనిచేసేవ్! మొహాన గల పసుపూ కుంకుమా స్వహస్తాన చేరుపుకుంటారా?" ఆమె విదిలించింది.


"మొదట ఆవేశంలో అంతపని చేసేను..... పారిపోయేను. కాని అబద్ధ మాడిం తర్వాతగాని యీ బ్రతుకెంత దుర్భరమో తెలిసిందికాదు. అసలు యీ లోగిలిలో నేనేం చెప్పానో మరి....? యిల్లు యివ్వరనికూడా జడిసేను ఆయనమీద పగసాధించాలని కసిగా ఆలాగే చెప్పా"నంది నిర్మల.

నరసమ్మగారు "ముందు లెంపలేసుకుని క్షమాపణ చెప్పు. దైవానికి, ఇందు యీకుంకుమ.... వెధవముండను నేనెట్లా వుంచను? నువ్వే నుదుట వుంచుకో...." అంటూ ఆవేశపడి కుంకుమ భరిణె యిచ్చింది.

"శివశివా? ఎంతపాపం! ఎంతమాట? నీలాంటి నిర్మలమైన మనస్సులో.... ఎంత అపభ్రష్టపు పనిచేయించేడు?" ఆమె భగవంతుణ్ణి నింద చేసింది.

నిర్మలలేచి కుంకుమ భరిణెతో సహా దుఃఖం దిగమింగుకుంటూ, తడబడ అడుగులు వేస్తూ

—39వ పేజీ చూడండి


ప్రేమ కానుక
బొమ్మల కథ
నీ పేరేమిటి బాబూ?
వీడికి మాటలు రావులాగుందిరా..
పోనీ లే నేను చెప్పినట్లు చెయ్యి. ఈ వేళ్టి నుంచి నేను వీడికి తండ్రిని నువ్వు తల్లివి
కుర్రాడు పెద్దగా ఏడుపు మొదలెట్టాడు..
దామ్మా ... దా.... ఏడవకు బిస్కట్లు కావాలా.. ఒరేయ్ బిస్కట్లు బిస్కట్లు
నీ మొహం లేనివి అడుగుతావేమిట్రా?
పోనీ చాక్లెట్లు



ఆంధ్రసచిత్ర వారపత్రిక వారఫలాలు

దైవజ్ఞపాతూరి శ్రీరామమూర్తి

27-7-1962 శుక్రవారము మొదలు
2-8-1962 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

మీ స్థితిని మీరు తెలుసుకొని మెలగ గలుగుతారు. బంధువుల తాకిడి అధికం. వృత్తిలో అకస్మాత్తుగా జరిగే సంఘటనలు, మార్పులు ఆందోళనను కలిగిస్తవి. ఏది ఎలా ఉన్నా, ఆదాయ, గౌరవాలకు భంగం రాదు. మీ మాటలలో అప్పుడప్పుడు కాఠిన్యం కనిపిస్తూఉంటుంది. దూరమందున్న మిత్రులు మీకు సహాయం చేస్తారు. మీ క్రింద పని చేస్తున్నవారు మిమ్ములను మోసగించటానికి సమయంకోసం చూస్తుఉంటారు. విందులు, వినోదాలు మొదలయిన కార్యక్రమాలలో పాల్గొంటారు. రాజకీయాలలో ఏ పనీ చురుకుగా ముందుకు సాగదు. నిరుత్సాహపడకుండా మీ ప్రయత్నాలను సాగిస్తారు. ఒకరివల్ల ధనం సంపాదించుకొంటూ, మరొకరికి శ్రమ చేయువలసిన స్థితి ఏర్పడుతుంది. గత సమయంలో చెప్పిన మాటను సకాలంలో నిలుపుకో గలుగుతారు. 28, 29 తేదులలో సంతోషవార్తలు, స్నేహితులవల్ల కార్యసిద్ధి.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఏపనికైనా ధైర్యమే ప్రధానం. చాటున ఎవరు మాట్లాడినా ప్రత్యక్షంలో మిమ్ములను ఎదిరించే వారు ఉండరు. క్రొత్త పనులవల్ల, క్రొత్తవారివల్ల మీ ఆదాయం పెరుగుతుంది. ఇప్పటికే భారం వహిస్తున్నారనుకొంటూ, మరికొంత కార్యభారాన్ని పైన వేసుకొంటారు. అందువల్ల మీ కీర్తి ప్రతిష్ఠలు క్రమంగా పెరుగుతవి. కుటుంబ విషయాలలో మీ బాధ్యతలను చక్కగా నెరవేర్చుకొని సుఖం అనుభవించగలుగుతారు. మీతో పోటీ చేస్తున్నవారు చల్లగా తప్పుకొంటారు. ఉష్ణాధిక్యంవల్ల బలహీనత తోస్తుంది. అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకొనవలసిన అవసరం కలుగుతు ఉంటుంది. 1, 2 తేదులలో నిరుత్సాహ వార్తలు, అసౌఖ్యము.

> **గ్రహస్థితి**
>
> వృషభంలో అంగారకుడు, కర్కాటకంలో సూర్య, బుధ, రాహువులు, సింహంలో శుక్రుడు, మకరంలో శని, కేతువులు, కుంభంలో గురువు, వృషభ, మిథున, కటక, సింహాలలో చంద్రుడు.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

పండు ఒలిచి చేతులో పెట్టినట్లు మాటలు చెప్పేవారేగాని, సమయంలో అక్కరకువచ్చేవారు ఉండరు. మీ చేతినుంచి డబ్బు వదిలించుకొంటూ, ఎదటివారి గౌరవాన్ని నిలుపవలసిన సమయం. వ్యవహార విషయాలలో మీకు ఆత్మీయులమాదిరి కనుపించేవారు అవతలివారితో చేరతారు. మీ మనోనిగ్రహం మిమ్ములను కాపాడుతుంది. క్రొత్త వ్యాపారాలయందు ఆసక్తితోపాటు, అవకాశాలు కూడా బాగుంటవి. నిష్కర్షగా మాట్లాడటం అవసరమేగాని, పాకం ముదరకుండా చూచుకొనటం ముఖ్యం. ఇంతకుముందుకన్నా ఖర్చులు అధికమైనా, వానివల్ల తగినంత ప్రయోజనం పొందగలుగుతారు. వ్యాపార, వ్యవహార విషయాలలో పొరపాట్లు వచ్చే అవకాశాలున్నవి. ప్రయాణాలు చేస్తారు. 30, 31 తేదులలో ఒకదానికొకటి సంబంధంలేని ప్రసంగాలు, శుభకార్యసిద్ధి.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష.)

మీ కార్యక్రమాలు కొంతవరకు గాలికి ఎదురు నడచిన పద్ధతిలో జరుగుతు ఉంటవి. కష్టనష్టాలు ఏమాత్రము ఉండవు. పదిమందికి మీ మాట అనుకూలిస్తుంది. క్రొత్త మనుష్యులతో ధన విషయంలో గాని, వృత్తి, వ్యాపారాలలోగాని సంబంధం కలిసే అవకాశాలున్నవి. అయితే, చివరవరకు కొనసాగటం కష్టం. జాగ్రత్తగా ఉండండి. మీ ఆరోగ్యం ఇంతకుముందుకన్నా, బాగుంటుంది. మిమ్ములను సందేహపెడుతున్న వార్తల యథార్థ స్వరూపం ఈ సమయంలో తెలుసుకోగలుగుతారు. క్రమక్రమంగా ఆడంబరం పెరుగుతుంది. వారం రెండవ భాగంలో వచ్చే వార్తలవల్ల మీ బాధ్యత విశేషంగా పెరుగుతుంది. 28, 29 తేదులలో దేహశ్రమ, ధనవ్యయంతో కూడిన కార్యానుకూలత.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

అన్నివిధాలా అభివృద్ధి పొందతగిన కాలం. మీరు ఏ పనిలో ప్రవేశించినా, త్వరలో దాని పర్యవసానం తెలుసుకోగలుగుతారు. దక్షిణదిక్కు నుంచి లాభవార్తలు తెలుస్తవి. ఇతరులవద్ద నుంచి రావలసిన ధనం విషయంలో నిదానం అవసరం. బంధుమిత్రులకు అకస్మాత్తుగా ఏర్పడిన చిక్కులవల్ల మనశ్శాంతికి భంగం కలుగు

తుంది. పై అధికారులవల్ల మాట వస్తుందేమో నని ఆందోళన కలుగతగిన సమయం. తాత్కాలికంగా మీ మాట సాగటం లేదనే విషయం తోస్తుంది. కొంచెం ఓర్పువహిస్తే అన్ని సమస్యలు సులభంగా పరిష్కారం అవుతవి. అనేకరకాలుగా డబ్బుయొక్క అవసరం పెరుగుతుంది. వృత్తిలో గౌరవం పెరుగుతుంది. మీ శక్తిని తెలుసుకొని కార్యానికి పూనుకో గలుగుతారు. 27, 28 తేదులలో ఇష్టవస్తులాభము, సంఘంలో పెద్దరికము.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

శ్రమను మరచిపోయి నిశ్చింతగా ఉండగలుగుతారు. ధనరూపంలో ఫలితం చేతికి రావలసిన సమయమే కాని, స్వల్పకారణాలవల్ల కాలం గడచిపోతూ ఉంటుంది. సంఘ కార్యాలలో విశ్రాంతి తక్కువ. కుటుంబంలో పరస్పర సహాయం, సంప్రదింపులు బాగుంటవి. పెద్ద మనుష్యుల సంబంధము, తద్వారా మీ కీర్తి ప్రతిష్ఠలు అభివృద్ధి చెందగల అవకాశములు ఉన్నవి. పుణ్యకార్యాలు సులభంగా నెరవేరకపోవచ్చు. వృత్తి, ఉద్యోగరంగాలలో శ్రద్ధాశక్తులతోనే ఉంటారు. కాని, ఏదో ఒక సమయంలో తప్పటడుగు వేయటం జరుగుతుంది. అందువల్ల మానసిక ఆందోళనకు గురి అవుతారు. 28, 29 తేదులలో గౌరవప్రాప్తి. శుభకార్యాలలో పాల్గొనటం.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ముందు మీ సుఖం చూచుకొనవలసిన సమయం. మీకు సంబంధం లేకపోయినా, బంధు మిత్రులలో మీకు చెడ్డపేరు రాతగిన పరిస్థితులు ఏర్పడుతవి. సాధారణంగా ఏ సమయంలో చేయతగిన పనిని ఆ సమయంలో పూర్తి చేయలేకపోతారు. ఎదటివారి హోదా నిమిత్తం మీరు బాధపడతారు. ప్రయాణాలు చేయగలుగుతారు. పిల్లల ఆరోగ్యం ఇంతకు ముందుకన్నా బాగుంటుంది. మీ క్రింద పనిచేసే వారితో మృదువుగా మాట్లాడుతూ, సకాలంలో కార్యసిద్ధి పొందగలుగుతారు. బంధుమిత్రుల తాకిడి వల్ల ఖర్చులు మితిమీరగలవు. గౌరవంగా మీ చేత పని జరుపుకొని, చల్లగా జారుకొనేవారుంటారు. ఇతరుల వ్యవహార విషయాలలో పెద్దగా ఉత్సాహం చూపలేకపోతారు. 31, 1 తేదులలో చిక్కులతో కూడిన పనులు, సంతోష వార్తలు.

* * *

వృశ్చికం :

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

ఒకరిమాటను లక్ష్యపెట్టకుండా స్వబుద్ధితో యోచించి ముందుకుపోగలుగుతారు. గౌరవం బాగుంటుంది. మీ ఆరోగ్యసుఖాల నిమిత్తం ఆహారాది విషయాలలో జాగ్రత్తగా ఉండవలసిన సమయం. మాట నేర్పుతో ఎదటివారిని సంతృప్తి పరచగలుగుతారు. ప్రయాణాలు చేయవలసి రావచ్చు. తరచు అర్థంలేని ప్రసంగాలు, చిన్న చిన్న తగాదాలు రాగల అవకాశాలున్నవి. మీరు ఏ కార్యం నిమిత్తం ప్లాను తయారు చేసినా, చాలా బందోబస్తుగా సాగించగలుగుతారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆదాయ, వ్యయాలను గురించిన శ్రమగాని, అసంతృప్తిగాని తోచదు. వినోద కార్యాల నిమిత్తం ఖర్చులు ఎక్కువ. 29, 30 తేదులలో జరగటానికి అవకాశంలేని ఆలోచనలు, చేసినపనినే తిరిగి చేయవలసి రావటం.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఎప్పటికప్పుడు మీ వృత్తిలో మంచి అవకాశం కనుపిస్తూ, తిరిగి చేయి దాటిపోతూ ఉంటుంది. ధనం చేతికి వస్తూఉండగానే దానిని మరొకకార్యం నిమిత్తం ఉపయోగపరుస్తూ ఉంటారు. అధికారుల ప్రోత్సాహం బాగుంటుంది. కుటుంబ కార్యక్రమాల నిమిత్తం సంచారము, శ్రమ అధికంగా ఉంటవి. పట్టుదల వదలకుండా సంఘ కార్యాలను ఒక స్థితికి తీసుకొనివస్తారు. మీ చెప్పు చేతలలో ఉంటున్నవారు కూడా ఈ సమయంలో మీ మాటను వ్యతిరేకిస్తారు. విద్యా, వినోద రంగాలలో మీ ప్రతిభను చూపగలుగుతారు. కుటుంబంలోనివారి ఆరోగ్యం గురించి జాగ్రత్తగా యుండండి. వారాంతంలో మంచి మాటలతో మిమ్ములను పట్టి కొట్టించేవారు తటస్థపడతారు. జాగ్రత్త. 30, 31 తేదులలో శక్తికిమించిన కార్యభారం, వృథా కలహాలు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

ప్రస్తుతం మీ పరిస్థితి "ఆరంభశూరత్వం" మాదిరిగా ఉంటుంది. ఒక సమయంలో మీరు సులభంగా చేయగలమనుకున్న ధన సంబంధమైన సర్దుబాట్లు మధ్య మధ్య ఏర్పడిన చిక్కులవల్ల ఈ సమయంలో మనోవేదనకు కారణమవుతవి. అయినవారే మిమ్ములను నిరుత్సాహపరుస్తారు. శ్రమపడి ఎదురుచూస్తున్న ఫలితం ప్రస్తుతానికి వాయిదా పడే అవకాశాలున్నవి. దక్షిణ, పడమర దిక్కులనుంచి కొంతవరకు మిత్రుల ప్రోత్సాహము, ధనలాభము కనుపిస్తవి. సాధ్యమైనంతవరకు ఖర్చులను తగ్గించుకొనటం అవసరం. ఇతరులచేతికిపోయిన వస్తువులు సక్రమంగా చేతికిరాకపోవచ్చు. మాట, మంచితనము బాగున్నా, ఆర్థికంగా ఉపయోగం తక్కువ. 1, 2 తేదులలో ధనలాభము, గౌరవప్రాప్తి.

* * *

ఈ వారము ధరలు

ఈవారం ఆరంభంలో కొద్ది తేజీ వచ్చి 29 నుంచి కొంత తగ్గే సూచన లున్నవి. వెండిధర నిలకడగా ఉండదు. వెంట వెంటనే హెచ్చు తగ్గులు వచ్చును. మిర్చికి గిరాకీ వస్తుంది. పసుపుధర తాత్కాలికంగా మందీ వస్తుంది. వేరుశనగపప్పు ధర వారాంతంలో మందీ అవుతుంది. నూనె ధరలో పెద్ద మార్పులు ఉండవు. నూవులధర వారం ఆరంభంలో పెరుగుతుంది. కందులకు గిరాకీ రాబోవు సూచనలు ఆరంభమగును.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)


దైవబలం బాగున్న సమయం. ముందు రకరకాల సమస్యలను ఎదుర్కొంటారు. మీ బుద్ధిని ఉపయోగించి కార్యం జాగ్రత్తగా గట్టెక్కించుకొంటారు. స్నేహితులు చేసేపనులు, మాటలు మిమ్ములను చల్లగా ఇబ్బంది పెడుతున్న ధోరణిలో ఉంటవి. నిర్లక్ష్యంగా తప్పించుకొనగలుగుతారు. కాని, మనశ్శాంతిమాత్రం ఉండదు. మీ వృత్తి, వ్యాపారాలలో ముందు యోచనతో మెలగగలరు. మీ మాట నేర్పువల్ల పదిమందినీ ఆకర్షించగలుగుతారు. గౌరవం బాగుంటుంది. మీ పలుకుబడిని ఉపయోగించి బంధుమిత్రులకు సహాయం చేయగలరు. వాహనాలు కొనటం భూములమీద డబ్బును వినియోగించటం మొదలయినవి సాఫీగా జరుగుతవి. 30, 31 తేదులలో ఆరోగ్యలోపం, వృథా వ్యయం.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ప్రశాంతమైన కాలం. క్రొత్తవారితో సహవాసం, మీ విద్యను సమయానుకూలంగా వినియోగించుకొని పదిమంది ఆదరాభిమానాలను పొందగల అవకాశము లభిస్తవి. ధనాదాయం పెరుగుతుంది. ఏ విషయంలోనైనా మనోధైర్యంతో ముందడుగు వేయగలుగుతారు. పిల్లల ఆరోగ్యం అంతగా బాగుండదు. వృత్తి, ఉద్యోగాలలో ముందే ఎదటివారి అభిప్రాయాలను గ్రహించి నడచుకొంటారు. అందువల్ల క్రమంగా మీ అంతస్తు పెరుగుతుంది. రెండు మూడు రకాల కార్యభారం ఒకే సమయంలో పైన వేసుకొని నిర్వహించవలసివస్తుంది. ప్రయాణాలు చేయవలసివస్తుంది. వారాంతంలో అభ్యాసంలేని పనులతో చిక్కుపడతారు. అసంతృప్తికరమైన విషయాలు తెలుస్తవి. 28, 29 తేదులలో పుణ్యకార్యాలు, సంఘంలో గౌరవం. ★



ఆడుగడియారం !

నేనొకసారి మా మిత్రునింటికి వెళ్లాను. (వాళ్ళది గోదావరి జిల్లాలెండి) వాళ్ళింట్లో గడియారాన్ని చూచి, అది ఆడదా? అన్నాను. వాడు అదిరిపోయి "గడియారాల్లో ఆడ, మగ భేదంకూడా వుంటుందటోయ్?" అన్నాడు అర్థం కాక: అప్పుడడిగాను_మీ గడియారంలోని ముళ్ళకు చలనం లేదా? అని. అప్పుడుగాని అర్థం కాలేదు వాడికి!

గోవాడ జనార్దనరావు (న్యూఢిల్లీ)

*   *   *

నవలా ప్రపంచం

శ్రీ "కోణంగి" "నారాయణరావు"గార్కి_"వేయిపడగలు" "దేవదాసు" నమస్కారములు. "బిందుగారబ్బాయి" "పంకజాక్షి"ల వివాహం నిశ్చయ మయిందని తెలిసి సంతోషించాను. "పంకజాక్షి" "పల్లెపడుచు" అయితే అయివుండవచ్చు. అంత మాత్రంచే "చెప్పుడు మాటలు"విని అ "తల్లి లేనిపిల్ల"ను "పతిత"అనడం "అపవాదు"లు వెయ్యడం శోచనీయం. "ప్రేమ-పెళ్ళి"అనేది యువతీ యువకుల "జన్మహక్కు." దాన్ని మనంకాదంటే ఆ 'స్త్రీ' హృదయంలో "త్రిశూలమ"య్యి ఆమె "జీవితా"న్ని "కాళరాత్రి"గా చేస్తుంది. కనుక "పాడులోకం"మాటలు లెఖ్ఖచేయక ఆ "ప్రేమసుందరిని" "కన్నకూతురు"గా భావించి ఆ "నిర్మల" హృదయాలను "పెండ్లిదండ"తో ఒకటిగాచేయ ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

"వేయిపడగలు" "దేవదాసు"

వి. బి. జి. శ్రీకూర్మం (కొవ్వూరు)

*   *   *

కాలమహిమ

మంచికి కాలము గావున
లంచముతో జాబులు మరి_
లభ్యమ్మయినన్,
ఎంచగ మరుసటి నెలకరి
ప్రెంచికి లోనాటి కగద_
లంబోదరుడా !


కలిమి గలవారు ఊరక
విలపించగ వారి పేరు_పేపరు కెక్కన్;
కలి ! పేద ఏడ్చి చచ్చిన
* అలజడియే లేగదయ్య_లంబోదరుడా!

కోకొల్లగ ధనముండగా
మాకేపని గాదటంచు_మసలెడువారల్;
కాకాయి పట్టకున్నన్
లాకేత్వము చూడగలరు_లంబోదరుడా !


* "అక్కడక్కడ ఇంగ్లీషు మాటలు పెక్యూలియర్ టైప్‌లో వాడినా, యతి తప్పులున్నా, ఆధునికుల పోకడలు గోచరిస్తున్నాయిరా భక్తా!" అన్నారు స్వామి లంబోదరులవారు.

శ్రోవి రామమోహనశాస్త్రి (దొండపాడు)

★







ఆదినం ఆదివారం. రోజంతా విశ్రాంతి తీసుకోవడం తప్ప ఇంకేమి చేయలేదు. అక్కడ ఉద్యోగంలో చేరినప్పటినుండి ప్రతి ఆదివారం ఊరిబయట నదికేసి వాహ్యాళి కెళ్ళడం అలవాటయిపోయింది. ఆరోజుకూడ అలవాటును అతిక్రమించలేదు. బ్రిడ్జిమీద నడుస్తుండగా వెనుక కారు హారన్ రెండు మూడుమార్లు వినిపించింది. రోడ్డుమీద బళ్ళు అసల్లేవు. ఇక నడుస్తున్నవాణ్ణి నేనొక్కణ్ణి. ఫుట్‌ఫాత్‌మీద నడుస్తుండగా హారన్ ఇవ్వవలసిన అవసర మేమొచ్చిందని తిరిగి చూశాను. స్టీరింగ్‌ముందు చిరునవ్వుతో కూర్చుని ఉన్నాడు శ్రీకాంత్. ఇద్దరము కాలేజిలో కలిసి చదువుకున్నాము. సార్థకనామధేయుడు శ్రీకాంత్. ధనవంతులఇంటి బిడ్డ. డిగ్రీ పుచ్చుకున్నా తండ్రిగారి వ్యాపారము, వ్యవహారాలు చూసుకుంటున్నాడు. జీవనోపాధికి చదువుకున్నాను కనుక నేను డిగ్రీ పుచ్చుకుంటూనే ఉద్యోగం చూసుకుంటున్నాను. మామూలుకన్నా కాస్త ఎక్కువ సాన్నిహిత్యమే ఉండేది మామధ్య. కారు తలుపు తెరిచి లోనికి రమ్మన్నట్టు సంజ్ఞచేశాడు. కుశల ప్రశ్నల అనంతరం ఉన్నట్టుండి కర్నూల్లో దర్శన మివ్వడంలో కారణమేమిటో అడిగాను.

"డాక్టర్ రఘురాం అని ప్రొద్దుటూరు ఆయన ఒకత - నీమధ్యే - అమెరికానుండి పై చదువులు పూర్తిచేసుకుని తిరిగివచ్చాడు. ఇక్క డీమధ్య కలరా ఉన్నట్టు వింటున్నాంకదా. దానివిషయంగా ప్రభుత్వం కోరికమీద ఆయన కొన్ని దినాలు ఇక్కడ ఉండడానికి ఈదినమే ఇక్కడి కొచ్చాడు. ఆయన్ను కలుసుకోవడానికే 'గెస్ట్ హౌస్' కెళ్ళి వస్తున్నాను."

"డాక్టర్లతో నీకేం పని వచ్చిందోయ్."

"రోగమేమీ కాదులే. నాన్నగారు నామీద వేసే బాధ్యతలు ఒకటి కావు. మా ఇందుమతి పెళ్ళివిషయంగా ఈయన్ను కలుసుకోమని నన్ను పురమాయించారు. నాకు మించిన పనులివి, నీవే చూసుకోమని ఎంతగానో చెప్పి చూశాను. కాని ఏదో ముఖ్యమయిన వ్యవహారమ్మీద నాన్నగారు మద్రాసు వెళ్ళవలసి ఉన్నందువల్ల ఈ పనిమీద రావడం నాకు తప్పలేదు. యువకుడు పెద్దచదువులు చదివినవాడు. ఎంతమంది కాచుకూర్చుని ఉంటారో ఈయనకొరకు. వేరే పక్షులు వాలేలోపల జాగ్రత్తపడటం మంచిదని నాన్నగారి తాపత్రయం. పేదకుటుంబంలో పుట్టినా పరీక్షల్లో బంగారు పతకాలు వగైరాలు సంపాదించుకోవడంవల్ల స్కాలర్‌షిప్పుతో మెడిసిన్ చదివాడు. ప్రభుత్వ డెప్యుటేషన్‌మీదే విదేశాలకు పోయాడు. ఇంత చిన్న వయసులో ఇంత పెద్ద చదువులు చదవటం చూస్తే గుణ సంపన్నుడనే తెలుస్తోంది. కాని కోతిని గుర్తుచేసే ఆకారమా ఏమో అనే విషయం కూడ తెలుసుకోవాలిసుంది కదా. కనుకే [illegible]ట్నే పర్సనల్‌గా కలుసుకోవలసొచ్చింది. [illegible] ఏం లాభంలేదులే."

"ఎందుకనో, ఆకారం నీ వన్నంత నిరుత్సాహకరంగా ఉందా ఏం."

"అబ్బే, పొరపాటు. మన 'లోకల్ [illegible] హీరో' అంతా బలాదూరనుకో. కాని తన [illegible]లేమీ వివరించలేదుగాని, ఈ విషయంలో ఏమీ [illegible]


ఝలక్
మెరిసే
తెల్లగాను
అధిక
కాంతిగాను
వుతుకును
గోద్రెజ్
ZALAK
నిజం, ఈ క్రొత్త సబ్బు చాలా
బాగుగా శుభ్రపరుస్తుంది
ఆతేడా నేను కనిపెట్టేను.
అది ఏ ఇతర సబ్బులకంటె
చాలా కాలము నిలవుంటుంది,
అంతకంటె ఇంకేమి కావాలి.
జ్ఞాపకముంచుకోండి. అది ఝులక్.
దానిని బజార్లలో అమ్మకము చేయుచున్న
వారు: మార్గదర్శక సంస్థ. గోద్రెజ్ సబ్బులలో ఉత్తమ నామము.

తీరిన ఋణం

సుముఖంగా లేనట్టు, వ్యవహారం ఏమాత్రం ముందుకుపోవలసిన అవసరం లేదన్నట్టు వివరంగానే చెప్పేశాడు."

ఈవిధంగా తన కుటుంబవిషయాలన్నీ నాకు చెప్పుకోడం శ్రీకాంత్‌కు మొదట్నుండి అలవాటే. ఏదో సినిమా కెళ్లాము. ఆ తర్వాత మా హొటల్ భోజనం శ్రీకాంత్‌కు పరిచయంచేశాను. రాత్రి ఉండి ఉదయాన్నే వెళ్లవచ్చన్నాను.

"గంటన్నరలో ఊరు చేరగలను. నాన్నగారు కూడ ఊళ్లో లేరు. కనుక నేను పోవడమే మంచిది. వచ్చినపని ఏమయినా, నిన్ను కలుసుకున్నందుకు సంతోషంగా ఉంది" అని శలవు పుచ్చుకున్నాడు.

ఇల్లు చేరి ఒంటరిగా కూర్చున్నాను. 'ఇందుమతి పెళ్లిప్రయత్నాలకు శ్రీకాంత్ వచ్చాడు.' రేణుక నా మదిలో మెదిలింది.

* * *

వ్యసనా లెన్ని అని ప్రశ్నిస్తే, సప్త వ్యసనాలని ఏడింటినే వల్లిస్తారు ఎవరైనా. కాని నిజంగా చూస్తే వ్యసనాలు ఎనిమిదేమో ననిపిస్తుంది. చేతిలో పదిహేపైసల సిగరెట్ కాలి పొగయ్యె గాలిలో కలిసిపోతుండగా కారులో స్టీరింగ్‌ముందు కూర్చుని, ఒక పైసా కనికరించమని మొరపెట్టుకుంటున్న కుంటి బిచ్చగాణ్ణి దారి కడ్డుతప్పుకోమని హారన్ మోగించే వ్యక్తులు లేరని నేనను. కాని నడివేసవిలో ముదిరిన ఎండలో నీరులేని బాట వెంబడి మైళ్ల తరబడి నడచిపోతూ, దారిలో చెట్టుక్రింద దాహంతో పడివున్న వాణ్ణి చూసి తన మరచెంబులో మిగిలివున్న గుక్కెడు మంచినీళ్లు అతనికి సమర్పించిపోయే బాటసారులుకూడ అక్కడక్కడ ఉంటారనే నే నంటాను. ఈ దానం చేయడమనేది ఏ లక్ష్యాధికారికో పట్టుబడితే, అతనికున్న మంచి అలవాట్లు లెక్కించేప్పుడు దీన్ని మొదటిదానిగా లెక్క వేసుకోవచ్చు. కాని ఈ అలవాటు చాలా అరుదుగా పట్టుబడుతుంది. అది పట్టుబడే కొద్దిమందిలో ఎక్కువభాగం ఆర్థిస్థితిపరులై ఉండరు. వాళ్లకు అది కొంత కీర్తి సంపాదించిపెట్టినా వాళ్ల దారిద్ర్యాన్నికూడా ఇనుమడింపజేస్తుంది. అక్కడే అది ఒక వ్యసనంగా పరిగణింపబడవలసొస్తుంది.

మానవకోటిలో సరిగా ఆ 'మైనారిటీ' కోవకు చెందినవాడే మా బాబాయి— గుమాస్తాగా జీవిత రంగంలో ప్రవేశించి, తాశీల్దారుగా రిటైరైన రంగయ్యగారు. ఇప్పుడు రంగయ్యగార్ని చూపి, తాశీల్దారుగా రిటైరైన వ్యక్తి ఈయనే అంటే, క్రొత్తవాళ్లెవరైనా "కాదు గుమాస్తాగనే రిటైరయి ఉంటారని" అడ్డుచెప్పినా ఆశ్చర్యపోవడానికి ఎక్కువ అవకాశంలేదు.

మనిషి కుండవలసిన లక్షణాల్లో, ముందుచూపు, దయ రెండయితే, రంగయ్యగారికి మొదటిది పూర్తిగా నాస్తి. దాని పాలుకూడ పంచుకొని రెండవదే కాస్త ఉండవలసినదానికన్న ఎక్కువ మోతాదులో ఉండిపోయింది.

రంగయ్యగారికి ఒక్కగా నొక్క కూతుర్ని ప్రసాదించిన కొద్ది దినాలకే ఆయన సతీమణి పరలోకగతురాలైంది. కాని, ఆడదిక్కు లేకుండా పసికూనతో రంగయ్యగారు అవస్థపడుతున్నారని సానుభూతి చూపడానికి లోకానికి అవకాశం లేకపోయింది. కారణం, రంగయ్యగారు రెండుచేతులా ధన మార్జిస్తున్న రోజులవి. ఆయన ఇంటిలో రక్తసంబంధాల్ని బట్టి ఆయన కుటుంబం అని చెప్పవలసొస్తే ఉన్నది ఆయన, ఆయన తనయ ఇద్దరే అయినా, ఆడవాళ్లయితే నేమి, పిల్లలయితేనేమి మొత్తం ఒక డజను మందికి తక్కువ లేకుండా ఉంటూ ఉండేవారు ఆయనతో.

పరిచయస్తుల్లో గాని, బంధువర్గంలోగాని ఎవరయినా ఆర్థికంగాగాని, ఇంకేవిధంగా నయినా చిక్కుల్లో ఉన్నారంటే తనకు తోచిన సహాయం రంగయ్యగారు ఎంత గుట్టుగా చేసినా, బైటపడి పోతుందని ఆఫీసుకేసి వడివడిగా పోతున్నప్పుడు, బండ్ల రద్దీలో బాటమధ్యన చిక్కుపడిన కుంటివాడుకాని, గ్రుడ్డివాడుగాని తారసపడితే ఆ అనాథుణ్ణి రోడ్డు కొకవైపు పదిలంగా చేర్చిగాని తన దారిన పోయేవారు కారు రంగయ్యగారు. అటువంటి చిన్నచిన్న విషయాల్లో నయినా ఆయన స్వభావం బయటపడుతూ వచ్చేది. ఆయన కూతురే రేణుక.

బెల్లమున్నచోటే ఈగలు చేరతాయన్నది ఎంతవరకూ నిజమో తెలియదుగాని, తనకున్న ఆస్తి, సంపాదించిన ధనంతో ఎంతోమందికి ఎన్నివిధాలుగానో సాయంచేసి, రిటైరై విశ్రాంతి తీసుకుంటున్న రంగయ్యగారికి ఇప్పుడు తోడుగా ఉన్నది ఆయన ఏకైకపుత్రిక రేణుక. ఆమెకు తోడుగా ఉంటున్నది ఆయన మాత్రమే.

రంగయ్యగారి సతీమణి ఉండే ఉంటే, రేణుక భవిష్యత్తు ఇంత అశ్రద్ధచేయబడి ఉండేది కాదేమో. మామూలు పరిస్థితుల్లో అయితే తాశీల్దారు చేస్తున్న వ్యక్తికి ఏకైక పుత్రిక వివాహం ఒక సమస్యగా ఉండి ఉండేదికాదు. ఇప్పుడు రంగయ్యగారికి మిగిలిఉన్నదల్లా, కర్నూల్లో ఉన్న ఒక ఇల్లు మాత్రమే కనిపిస్తుంది. అయినా ఏరోజూ రంగయ్యగారు రేణుక వివాహము, ఆమె భవిష్యత్తు ఒక సమస్యగా పరిగణించడంలేదు. ఆయన మంచితనంలో ఈ నిశ్చింతకూడ ఒక భాగమేమో ననిపిస్తుంది.

ఆయనకు చెందిన ఇంట్లోనే కర్నూల్లో ప్రస్తుతం నా నివాసం. ఆయన రేణుకతోసహా దిగువపాడులో ఉన్న నా చిన్న గదిలో ఉంటున్నారు. నాకు కర్నూల్లో ఉద్యోగ మవుతూనే ఆయన తన విశాలమైన గదిలో నన్నుండమని కోరి, తనకుగా ఆ చిన్న గ్రామాన్ని ఎందుకు ఎన్నుకున్నారో నాకు బోధపడేది కాదు. ఆయన ఆ వింత కోరికకు కారణమిది అని ఇదమిద్దంగా ఈనాడు చెప్పలేకపోయినా, దిగువపాడులో ఉన్న కొన్ని పేదకుటుంబాలకు చెందిన బాలబాలికలకు కొందరికి ప్రతిదినం కొంతకాలంపాటు ఆయన చేస్తున్న విద్యాబోధ చూస్తే ఒక కారణం స్ఫురిస్తుంది. డబ్బు, హోదా లేకుండా, పెద్ద ఊళ్లో ఇతర్లకు చేయ

తీరిన ఋణం

గగిన సహాయాలకు అట్టే అవకాశం లేకపోగా, అట్టి అవకాశం కొంతవరకు చిన్నగ్రామాల్లో ఉంటుందని ఆయన గ్రహించి ఉండవచ్చును.

బాబాయిగారైనా, రంగయ్యగారితో చాలా చనువుగా మాట్లాడ్డం నాకు మొదటినుండి అలవాటు. ఆ చనువుకొద్దీ ఒకదినం "దూరాలోచన నీకు చాలా లోపమున్నట్టు అనిపిస్తుంది బాబాయ్. రేణుకను గూర్చి ఎప్పుడూ తలపోస్తున్నట్టు కన్పించవేం' అని ప్రశ్నించాను.

"ఒరే! వేణు! నేను కనిపిస్తున్నంత అమాయకుణ్ణి కానురా. కీర్తిశేషులైన మా అక్కయ్యగారి పుత్రుణ్ణి కారణం లేకనే అంత డబ్బు వెచ్చించి ఎమ్మెస్సీదాకా చదివించా ననుకున్నావా. మన మనుకున్నవన్నీ అనుకున్నట్టే జరుగవు. చదువంతా పూర్తయి వాడు ఉద్యోగంలో చేరగానే వదినగారు, తనకు ముసలితనం ముదిరిపోతూ ఉందని, తన కూతురు రమ ఏ రోజైనా వాడి పెళ్ళామేననే విషయం మొదట్నుండీ అందరూ అనుకున్నదేనని, ఆ మూడు ముళ్ళుకూడా త్వరలో వేయించమని కోరింది. విధవరాలు కోరినదాన్ని మన్నించకపోవడం భావ్యంకాదని వాడి పెళ్లి రమతో చేయించాను. కాని నా ఉద్దేశం ఇంకోవిధంగా ఉండేదిరా వేణు" అన్నారు.

రంగయ్యగారు అమాయకులనాలో లేదో తెలియదు.

"నిన్నెవరు బాబాయ్ అమాయకు డనేది. అయితే నన్నే ఉద్దేశ్యంతో చదివించావు" అంటే చిరునవ్వే సమాధానంగా ఇస్తారు.

నా చదువూ చాలావరకూ బాబాయ్ చెప్పించిందే. కృతజ్ఞత అన్నది మనిషి కుండితీరవలసిన లక్షణాల్లో ఒకటని నమ్ముతాను నేను. అందుకే బాహాటంగా కాకపోయినా నా మనసులోనయినా రేణుక వివాహమయేవరకు నేను పెళ్లి చేసుకోకూడదనే నిర్ణయించుకున్నాను. నా సంపాదనలో చాలాభాగం ఆ ఉద్దేశంతోనే ప్రోగుచేస్తున్నాను.

"ఒంటరి జీవివి, ఇప్పుడే ఇంతగా మిగల్చడం ఎందుకో," అనేవాళ్ళ మిత్రులు.

'పెళ్లికి' నే ననేవాణ్ణి.

"నీపెళ్లికి పిల్లనియబోయే మామయ్య ప్రోగుచేస్తుంటాడు నీకెందుకోయ్ ఆ శ్రమ" అనేవాళ్ళు.

నాపెళ్లికికాదని వాళ్లకు చెప్పవలసిన అవసరం కన్పించేదికాదు.

రేణుక సన్నగా, పొడుగ్గా వుంటుంది. రేణుక అంత అందమయినవాళ్ళు ఎక్కడోగాని కనిపించరు. ఎక్కువగా మాట్లాడం రేణుకకు ఎందుకనో అసలు అలవాటేదు. మౌనంగా వుండడం ఆమెలో ప్రత్యేకత. ఈ లక్షణాలే ఆమెను ఎంతో ఆకర్షణీయంగా చేశాయనిపిస్తుంది. గుణసంపన్నురాలు కూడ అయిన ఈ రేణుక వివాహమయ్యేవరకూ పెళ్లిచేసుకోకపోదలచుకోవడంవల్ల నేను ఆజన్మ బ్రహ్మచారిగ వుండిపోవలసొచ్చే ప్రమాదం ఎంత మాత్రములేదు.

ఆమెలో ఇంకొక ప్రత్యేకత ఆమె గానం. ఆమె గానమాధురి శ్రోతలను ఏదో ఉన్నతశిఖరాలకు తీసికెళ్ళేంది.

రేణుకపాట విని చాలాదినాలయింది. రే పొక నాలుగు దినాలకు శలవుపడేసి, దిగువపొడెళ్ళి రావాలనుకుంటూ కూర్చున్నాను. బయట వాన కురుస్తూంది. వేసవి ప్రారంభంలో తొలకరి వానలు క్రొత్తకాకపోయినా ఆరోజు మామూలు కన్న ఎక్కువ వర్షిస్తోంది ఎందుకనో.

తలుపుమీద ఎవరో తడుతున్నట్టు శబ్దమయింది. వానజల్లుకు ఈ దురుగాలికి తలుపు చేస్తున్న చప్పుడనుకున్నాను మొదట. కాని తిరిగి ఆచప్పుడు విడవకుండా వినిపిస్తూంది. వెళ్ళి తలుపు తీశాను. రైన్‌కోటు టోపీతో అజాను బాహువుగా కనిపిస్తున్న ఒక యువకుడు.

"నమస్తే, ఈ వేళకాని వేళలో మిమ్మల్ని శ్రమపెట్టినందుకు మన్నించాలి," అన్నాడు.

"వర్షానికి తడిసిపోతూ, చోటివ్వమని కోరే బాటసారికి, చోటులేదు పొమ్మని చెప్పగల గృహస్థులుకూడ ఉంటారని నేననుకోలేదు. నిరభ్యంతరంగా రావచ్చు", అన్నాను.

"వర్షపుజల్లునుండి రక్షణకొరకు మాత్రమే నేను మీవద్దకు రాలేదు. వరండాలోఉండి వర్షం తగ్గగానే వెళ్ళిపోవచ్చని దయచేసి శలవీయకండి. మీతో పనిఉండే, ఈవేళలో, వర్షంలోకూడా మీవద్దకు రావలసొచ్చింది. లోనికి రావడానికి అవకాశమిచ్చి, కూర్చోవడానికి చోటిస్తే ఆనందిస్తాను," అన్నాడు రైన్‌కోటు తొలగిస్తూ.

అనాహూతుడైన ఈ అతిథినిగూర్చి తెలుసుకోవాలని కుతూహలంగానేఉంది. నాకెదురుగా వున్న పేముకుర్చీలో ఆసీనుడవుతూనే "నాపేరు రఘు. ఉద్యోగరీత్యా డాక్టరును. వేణుగోపాల్ గారంటే మీరే ననుకుంటాను." అని కరచాలనం చేశాడు.

"నే నొచ్చినపని తెల్పేముందు నన్నుగూర్చి కొంత తెల్పడం అవసరం."

"సిగరెట్ తీసుకుంటారా?" అన్నాను టిన్ను ముందుకుతోస్తూ.

"నో, థాంక్స్, అలవాటులేదు. లక్కణ్ణుండే ప్రారంభిస్తాను. నేను విదేశాలకు వెళ్ళకముందు అప్పుడప్పుడు సిగరెట్లు కాల్చేవాణ్ణి. విదేశాలకు పోయేటప్పుడు సిగరెట్లుకాని మద్యంకాని తీసుకోరాదని మా అమ్మ వాగ్దానంతీసుకుంది. అప్పట్నుండే సిగరెట్లు మానేశాను. నా చిన్నతనంలోనే నాన్నగార్ని కోల్పోయాను. మా అమ్మను ఇక్కడ ఒంటరిగా వదలి విదేశాలకు పోవడం కూడా నా కిష్టంలేదు. కాని, నేను జీవితంలో సాధ్యమయినంత పైకి పురోగమించాలని ఆమె లక్ష్యం. అందువల్లనే ప్రభుత్వం స్కాలర్షిప్పు మంజూరుచేసినట్టు తెలియగానే తన ఏకైక పుత్రుని ఎడబాటునుకూడ లెక్కచేయక వెళ్ళమనే కోరింది. ఆమె కోరిక కాదనడం జీవితంలో ఎన్నడూ నేను చేయలేదు. కనుకే విదేశాలకు పోక తప్పిందికాదు. విదేశాలనుండి తిరిగి రాగానే ఉన్నతస్థాయిలో నన్ను చూసే భాగ్యం భగవంతుడామెకు కలుగచేయలేదు. దూరదేశాన్నుండి తిరిగి రానున్న తనపుత్రుణ్ణి చివరిసారి చూసుకోవడానికే ఆమె జీవించి ఉందేమో. నే నొచ్చిన పదిరోజులకే ఆమె దివంగతురాలైంది. ఆ కొద్ది రోజుల్లో నా కా మాతృదేవత కొత్త విషయాలు తెల్పింది. అందులో రంగయ్యగారనే ఒక దయామయునిగూర్చి ఆమె చాలా చెప్పింది. ప్రొద్దుటూరులో ఆయన ఉద్యోగం చేస్తున్నప్పుడు మా పొరిగింటిలోనే ఆయ ఉండేవారట. తన స్వంత అన్న మా అమ్మకు ఒకాయ సుండేవాడు. కాని ఆయనకన్న ఆమె రంగయ్యగారే తన అన్నయ్య అన్నభావం కల్గేటంత దయ ప్రదర్శించారా రంగయ్యగారు. నా కాలేజీ చదువంతా మెరిట్ స్కాలర్‌షిప్పులతోనే కొనసాగినా ప్రతి కొత్తతరగతిలో చేరిన మొదట్లో మాత్రం మేమే స్వంతంగా డబ్బు కట్టవలసి వచ్చేది. అంత ఖర్చు చేయగల శక్తి మా అమ్మకు లేదు. నా చదువు మానివేయవలసివచ్చినప్పుడంతా ఏదో ఊళ్ళల్లో ఉంటున్న రంగయ్యగారే కల్పించుకొని నన్ను డాక్టరు కోర్సులో ప్రవేశింపచేసేందుకు తోడ్పడ్డారట. ఆయనమేలు మరవవద్దని చివరిఘడియల్లో మా అమ్మ నన్నాదేశించింది. ఆయన ఉంటున్నది కర్నూల్లోనే అని తెలిసి ప్రభుత్వం కోరినవెంటనే ఇక్కడికి రావడానికి ఒప్పుకోలు సూచించాను. కలరానిర్మూలన నాపనే అయినప్పటికి రంగయ్యగారిని కలుసుకుని ఆయన ఋణం తీర్చడం ముఖ్యమైన పని. వారినిగూర్చి విచారించగా వారిప్పుడిక్కడ లేనట్టు వారి వివరాలు మీవద్ద దొరకగలవన్నట్టు తెలిసింది."

"మీ కాయన ఎప్పుడో చేసిన సహాయాన్ని ఇప్పుడు విలువకట్టడ మంత సులువైనపని కాదే. ఏవిధంగా మీరు ఋణం తీర్చగలరో నాకు బోధపడ్డంలేదు."

"ఆయనకు తీర్చవలసిన ఋణాన్ని నేను విలువకట్టే మీవద్ద కొచ్చాను. నే నివ్వదలచుకున్నదాన్ని ఆయన అంగీకరిస్తారో లేదోనన్నదే నా సందేహం."

"రంగయ్యగారు నాకు బాబాయ్. ఆయన్నుగూర్చి నాకు బాగానే తెలుసని చెప్పగలను. మీ రాయనకు ఋణపడిఉన్నట్టుకూడ ఆయన ఎరుగ రనుకుంటాను. మీరు తీర్చేది చాలదని వాదించడ మటుంచి మీ రిచ్చేది అసలు స్వీకరించక పోవచ్చనే నా ఉద్దేశ్యం ......"

* * *

పెళ్లిలో తలవంచుక కూర్చున్న రేణుక వదనంలో ఏదో తృప్తి ఆనందం కన్పించాయి నాకు. చెమ్మగిల్లిన నా కన్నులు తుడుస్తూ "సి పెళ్లేస్తుదురా వేణూ" అన్నారు బాబాయ్. ★

సౌగ్యమైనంత తొందరగా అక్కణ్ణించి మాయ మయ్యింది.

నరసమ్మగారు కొయ్యబారి అలాగే కూచుండి పోయింది. తన సూర్యంగతి యింతేనా? ఎంత మగవాడయితేనేం.... రేపు ఆ జయరావు సాధించ కండా వుంటాడా?"

నిర్మల గురించి ఆమెకు పూర్తివివరాలు తెలియక పోయినా నమ్మకమే కుదిరింది. కర్కోటకుడు ఎంత కటికగుండె కాకపోతే తల్లిరంకుదని కూతుర్ని సాధిస్తాడు? యింతకీ నిర్మలతల్లి నీతిమాలినదో కాదో?.... కాదో.......

"సర్వేశ్వరా! నీవేచెప్పు" అని గొణుక్కున్నదామె.

నిర్మల చరిత్రమే నిజమవుతే లోగిలిలో ఆపిల్లకి మనుగడ వుండదు. భర్తను చేరేవిధానం యెవరూ చెప్పరు.... భర్తదోషమున్నా ఎవరూ విచారించరుకాని "యింత సాహసం మాత్రం ఒక ఆడదానికి వుండడం వారంతా వ్యతిరేకించి తీరుతారు.

నరసమ్మకళ్లవెంట ఆమె ఆపుకోలేని కన్నీటి ధార ఆమె లోతైన చెక్కిళ్లమీదుగా జారిపోయింది.

"అయ్యో! యిదేం కర్మరా!" అని ఆమెయెంత సేపు అలావిలపించిందో సూర్యంవచ్చి "అదేం బామ్మా! నీదేవుడు యెలక్ట్రిక్‌లైటు వద్దన్నాడా? అంటూ స్విచ్‌వేశాడు.

ఆమె గభిక్కున మొహం దాచుకున్నది.

41

ఆ రోజంతా రాజ్యలక్ష్మి అగుపించనేలేదు. ఆముందురోజు రాత్రి సినిమా కెళ్లిందని తెలిసింది. నరసమ్మగారు విస్తుపోయింది. ఆఖరికి చీమ చిటుక్కుమంటే నాకుచెప్పందే వుండనిదీ సినిమాకు పోయిందేనని.

ముందునాడు వుదయం మీనాక్షి స్వయంగా వెళ్లి వెడుతున్నానని చెప్పిందితప్ప ఆపిల్లరానేలేదు.

నాగరికతలోనే అవతరించిందో యేమో ఆడదానికి త్యాగమూ, మగవానికి దర్పమున్నూ. రాజ్యలక్ష్మి మీనాక్షితో "మళ్లీ కనిపించనేమో నక్కా" అన్నది.

"ఛ!" అవేం మాటలు. యింతకీ పెళ్లి కొడుకుని చూపించావే కాదు.... మీఅక్కయ్యా యెత్తుకు పోతుందనేనా? బెంగా?"అంది నవ్వుతూ! మీనాక్షి.

రాజ్యలక్ష్మి ఒక్కసారి మానసికంగా యెన్నో సంవత్సరాలెదిగి పోయింది. "అంతేనక్కా! అదే భయం.... నీవు పెద్దదానివి యెత్తుకు పోతావు? అంటూ పొడిగా నవ్వింది.

"పెళ్లికి వస్తాగా" నని మీనాక్షి అర్థంకాని రాజ్యలక్ష్మి మాటలు మననం చేసుగుంటూ వెళ్లి పోయింది.

సూర్యం మీనాక్షిని "మళ్లీరా!" అంటూ వీడ్కోలుఇచ్చి వచ్చేడు. అప్పుడుకూడా అతగాడికి రాజ్యలక్ష్మి అగుపించలేదు.

అదీ గాక మంగపతి ఆసాయంత్రం "మా యింటికొక్కసారి రమ్మంటూ లాక్కుని పోయేడు.

"రానన్నాడు" సూర్యం.

విడీ విడని చిక్కులు

26-వ పేజీ తరువాయి

"నాకర్మ! నాకూతురికింకా పదేళ్లే! లేక పోతే నువ్వురాననీ అనవ్! నేనూ రమ్మని అననూ" అన్నాడు వికటంగానవ్వి మంగపతి.

పృధివిని విష్ణుకి పూజ దుష్టుకి పూజ. గ్రామ దేవతకి మరీ.... పూజన్నారు. అంతే సూర్యంకిమ్మన కండా వెళ్లేడు వాళ్లయింటికి.

సూర్యం ఎక్కడికి వెళ్లినాయేమీ చేస్తున్నా అతనిమనస్సు దేనిమీదా లగ్నమయ్యిందికాదు. అతని కేమోయెదనంతా ఆందోళన.

రాజ్యలక్ష్మికి పెళ్లి అన్నమాట సృష్టి మొత్తం మీద వికృతమైన మాటగా తోచిం దతనికి.

తనరాజ్యలక్ష్మికి పెళ్లేమిటి? రాజ్యలక్ష్మివచ్చి యెదుట నిలిచి "నాకు పెళ్లి.. అంటే యేం చేస్తాడు తను?" "పీకె పిసికేస్తాను" సూర్యం ఆవేశంతో గట్టిగానే అన్నాడు.

"ఏమండీ! ఇక్కడ చుట్ట త్రాగవచ్చునా?" మొదటిసారిగా పట్నంవచ్చిన పెద్దమనిషి బస్సులో కూర్చుని కండక్టరుని అడిగాడు.

"త్రాగకూడదు."

"విచిత్రంగా ఉందే! మరి ఆ సిగరెట్ ముక్కలన్నీ ఇక్కడి కెలా వచ్చినట్టు?"

"ఓ...అవా? వాళ్లెవరూ మీలాగ నన్నడిగి త్రాగలేదే!"

జి. గోవిందరాజులు (మద్రాసు)

"ఎవరిపీక పిసికేస్తావురా అబ్బీ! నువ్వు. నీవర ధ్యానమూ అసలు సంగతి చెప్పరా?.... అయ్యో! యిదేం విపరీతం యీ లోగిలిలోఏదో దుష్టగ్రహం ఆవహించిందే"నన్నది ఆందోళన వ్యక్తపరుస్తూ నరసమ్మగారు.

సూర్యం అన్నం కెలుకుతూ సిగ్గుపడిపోయి "రాజు కనిపించడం లేదేంబామ్మ?"— అన్నాడు.

నరసమ్మగారు యెందుకో తెలీదుకాని నవ్వడానికి ప్రయత్నించింది.

లోగిలిలో తతిమ్మా అందరికి మళ్లే! పెళ్లి అంటే ఆడపిల్లకి సిగ్గుగనక రాలేదనే సంజాయిషీ, ఆమె అంతర్యంలోయింత పిసరైనా చోటుచేసుకో లేదు. ఆమెకుకూడా అంతా విపరీతంగానే తోచింది. రెండోపెళ్లివాడికి యివ్వడానికి ఏం పోయేకాలంరా? అన్నదామె సాంబశివం, లలితాంబ దంపతుల నుద్దేశించి, మనుమ డడిగిన ప్రశ్నకి జవాబుగా?

సూర్యానికి గుండెలు మరిగి ఒళ్లు మండి పోయింది.

"రాక్షసులు.... యెంతేనా సవత్తల్లికూడా తలపెట్టని పనులు తలపెడుతున్నది ఆ లలితాంబ.

"ఆసాంబశివంగారికే నువ్వేనా చెప్పు" అన్నాడు బాధను దిగమింగుతూ.

"ఏమని చెప్పను?...." ఆమె నిస్పృహ వెరి బుచ్చింది. నిజమే నరసమ్మగారికి జయరావురాక, మీనాక్షి సేవా యీనాడు సంభవించేయిగాని మొదట్నించీ లేవుగదా.

అదివరకామెకి యింటిదీపంలా తిరుగుతూన్న లక్ష్మిమీద ఒకటిరెండుసార్లు మోజు కలిగింది.

తల్లీదండ్రీ లేరనడానికి తనుమాత్రం సూర్యానికి తల్లీతండ్రీకనకనా? సరి ఆస్తి పాస్తులా? అవి చూస్తే ఏమో యేం చిక్కులువచ్చి పడతాయో? ఈ పిల్ల విషయంలో తన కుటుంబపు గతం యెవ్వరూ అడగవల్సిన అవసరం యేంరాదుకదా? కాని దుర దృష్ట వశాత్తు శోభాంతరమేనని మరో ఆటంకం తెచ్చిపెట్టుకుని గారుకున్నది తిరిగి. కాని యివాళ ఆమె మనసులో రాజ్యలక్ష్మిమీద ఆపేక్ష ఐతే తగ్గలేదు కాని, సూర్యం వధువుగా మాత్రం ఆపిల్ల మాయ మయ్యింది నరసమ్మగారి హృదయ పీఠంమీంచి.

ముఖ్యంగా ఇటీవలిసంగతులు ఆమె అహంకారం మీద సవాలుచేసేయి—సూర్యం అన్నం కెలుకుతూనే వున్నాడు. అంతలో "నరసమ్మగారూ!" అంటూ అవతల కృష్ణవేణమ్మ కంఠం వినవచ్చింది.

"వేళకానివేళ పిలుస్తున్నామే అని మరోలా అనుకోకండి!.... పోతున్నాము గనక చెప్పిపోదామని వచ్చాము.... మీరాజ్యలక్ష్మికి పెళ్లి కుదిర్చి నట్లే భావించవచ్చును" అన్నది వసారాలోంచి తొంగిచూసి.

"అలాగా! అయ్యో వెయ్యేళ్లాయుస్సు అదేదీ? యెక్కడా అగుపించదేం.... యింతకీ సాంబశివం గాని లలితాంబగాని యిటురాలేదే! నన్నది. నొచ్చు కున్నట్లు. అనిమళ్లీ" వూ హూ.... వరివరుడు కెంతవుంటుంది? వయస్సు, కట్నం కాసులేమైనా నిర్ణయమయ్యేయా?.... అయ్యో! కూర్చోండి.... నిలబడిపోయారేమ్? చూశారా?.... నేనుస్నా యింక ఒకబొమ్మను తేవాలి.... అలా చాపవేసిందికేనా ఎవరూ లేరూ".

కృష్ణవేణి, సావిత్రి యిద్దరూనూ కినీడలో వున్నందున వరుడి వయస్సు అడిగినప్పుడు వాళ్ల మొహాల రంగులు యేలా మారిందీ ఎవరూ గమనించలేదు.

"ఆఁ వయస్సా?.... రెండోపెళ్లి అనుకోడమే తప్ప.... యిద్దరు పిల్లల తండ్రి. అంతే!! యీ రోజుల్లో కాస్త విడ్డూరమేగాని మనరోజుల్లో యిది శ్రేష్ఠమేకదా" అన్నది కృష్ణవేణమ్మ.

సావిత్రి అక్కసంగా అన్నది.

"అందుకే మనం యిలావున్నాం ఒక బిడ్డనేనా యెత్తకుండా.... వండగలేకా, వబ్బమూలేక—."

"సరే వెళ్లిరండి!" నరసమ్మగారి ఒళ్లుమంటే ఆమె నిగ్రహాన్ని పూర్తిగా తినేసింది.

వాళ్లు "దయమాత్ర ముంచండీ" అంటూ వెళ్లిపోయారు.

విడి విడని చిక్కులు

సూర్యానికి మొదటిసారి బహుశా యింత పెద్దహృదయా ఘాతమయ్యింది. తనగురించి తనకు తెలియని రహస్యమావేళ తెలిసింది.

మరిఒక్క మెతుకు కతకలేక పోయాడు. మొన్న సాంబశివంగారు తనఆఫీసు కెందుకొచ్చినట్లు! ఎందుకు మాయమైనట్లు?

నరసమ్మగారు నిట్టూర్చింది "చూశావురా! యిదీ తల్లిదండ్రీ, లేని బిడ్డల అవస్థ.... వెర్రిబాగులది యెలా వొప్పుకుంటుంది? వాళ్లఅహా యిత్యం చట్టుబండలవా! మూలపడేసి వుంటారు." ఆమె నిజంగా గద్గదికమైన కంఠంతోనే అన్నది పై మాటలను.

"చూడు అవతలమీనాక్షి నాన్న జయరావుకి తనబిడ్డఅంటే ఎంత తాపత్రయమో: ఎంతో లౌక్యంగా కార్యంనడప బోతున్నాడో" అని యింకా చెప్పనుంకించి మనుమడు చెయ్యి కడిగేసుకున్న కంచంలోకిచూసి విస్తుపోయిందామె. ఆమె జయరావుకి తరవాత వెనకనుంచి వుత్తరం రాస్తానన్నది. ఆ ప్రస్తావనికి నాందికి అదను యిదికాదని ఆమె గ్రహించింది.

"బామ్మా! నువ్వు రాజు పెళ్లి ఆపలేవూ....ఆపు బామ్మా...." అన్నాడు.

ఆమె ఎంతో ఆవేదనతో ఏమోచెప్పాలనుకున్నది. ఏమీ అనలేకపోయింది. నిర్మలసంగతి విచారిస్తుందా? రాజ్యలక్ష్మి పెళ్లివారిస్తుందా? తన మనుమడికి యీ వ్యక్తిత్వాన్ని నిలిపి, గతమంతా చెరిగిపోయిన పేజీలుచేసి తనజీవిత శిక్ష్మేమ్మే నిలబెట్టుకుంటుందా?

సూర్యం ఎట్లాదీన్ని ఆపాలో తెలియక తికమకపడుతున్నాడు. బామ్మ తప్పితే తనకు మరో దైవమే లేదు మొరపెట్టుగుందికి. ఆ దైవమే యిందుకు వారిస్తే! అసలింతకీ రాజ్యలక్ష్మి యీ "కళ్యాణ మహోత్సవాన్ని" అంగీకరించిందే? ఏలా?

"ఛీ! ఆడపిల్లకి వయస్సు మనస్సు ఇవి హద్దులు కావు...పీకె పిసికెద్దును నాయెదుట నిలబడితే.... దీనికప్పుడే పెళ్లికేమి తొందర....బహుశా బంగారం పెడతా నన్నారేమో?........"

పరిపరి విధాల పోసాగింది అతని మనసు.

* * *

నిర్మలకథ విన్న నరసమ్మగారు "ఇదివెటు వెళ్లిందో.... వెక్కిళ్ళ గుక్కిళ్ల పొర్లుకొచ్చి ఏడుస్తూ పోయిందే ఒక్కసారి దాని గదిలోకి పోయి చూద్దునా?" అని మథనపడసాగింది.

నిర్మలపట్ల ఆమెకుగల ఆత్మీయతకి కారణం ఆ సర్వేస్వరుడికే తెలియాలి. ఆమెపేగ నిర్మలకేసి పీకుతున్నది. నిర్మలకథనిండా హంసపాదు లున్నాయి. ఆ హంస పాదులే నరసమ్మగారి ఎదను చిమ్మురేపుతున్నాయి. వాటిని నిజంగా యెరిగి ఆమె భరించగలదా? అన్న ప్రశ్న వుదయించలేదుగాని. ఆవిషయమే గనక ఆలోచిస్తే: ఆమెచెవులు, కళ్లే గాదు మనసును సైతం మూసుకుంటుంది. సూర్యం భవితవ్యంముందు ఆమెకి చంద్రమౌళి రాకకూడ ఏమంత లెక్కలోదికాదు.

42

రావణాసురుడి కాష్ఠంలా కాలుతూవున్న అపవాదు, కుటుంబ ప్రతిపత్తిని, వ్యక్తిసుఖన్ని పీడిస్తుందని, వెంటాడుతూనే ఉంటుందని నరసమ్మగారికి తెలుసును. నిజానికది నిర్మల విషయంలోనూ, రాజ్యలక్ష్మి విషయంలోను ప్రత్యక్షంగా అగుపిస్తున్నది కూడాను.

ఐతే సూర్యం విషయంలోమాత్రం నరసమ్మగారి ప్రయత్నంవల్ల నది మంత్రించి సీసాలోనికి దింపేసిన 'భూతం'లాగ గతంలోనే దాగివున్నది.

సంద్రపుటొడ్డున కెరటాలతో కేరింతలాడే పసిపిల్లవాడికి, సంద్రగర్భంలో బడబాగ్నులుంటాయని తెలియనట్లు నరసమ్మగారి పెంపకంలో పెరుగుతూ పెద్దవాడైన సూర్యానికి ఆమె ఎదనున్న వ్యధంగురించి తెలియనే తెలియదు.

సంప్రదాయాలను, బూజపట్టిన నైతిక సూత్రబంధనాలనుకాదని ఎదురీదడం యేమంత సులభసాధ్యమైన పనిగాదు. అందుకు ఒక్క త్యాగశీలమే చాలదు. తెగువ, మొండితనం కూడా చాలా అవసరం.

లలితాంబలాంటి స్త్రీకి ప్రతీకారవాంచ కలగకపోవాలేగాని, కలిగిందీ అంటే అది ఏ దిక్కున ప్రసరించి యెలాంటి ప్రమాదంగా పరిణమిస్తుందో చెప్పడం కష్టం. నిజానికి రాజ్యలక్ష్మిని గదిలోనికి లాక్కుపోయి తలుపులు వేసుకున్ననాడు, ఆ పిల్లను పిల్లికూన పీకె నులిమేసినట్లు నులిమి చంపేస్తుందేమో లలితాంబ అనుకున్నారు, సావిత్రీ కృష్ణవేణమ్మలు ఒకనాడు. కాని లలితాంబ అటువంటి దౌర్జన్యం చేయలేదు.

'కొట్టావద్దు, తిట్టావద్దు. తిరగేసి వేన్నీళ్లు పొయ్యి'' మన్నారుట తాబేలు గురించి అలాగా, ఆమె రాజ్యలక్ష్మిని నేలకూలదోసి "నువ్వు జాతిభ్రష్టవి. దిక్కు మొక్కూలేని అనాథవి. ఇన్నాళ్లూ నువ్వు చిన్నాన్న అని తలపోస్తున్న వ్యక్తి నీకు ఆశ్రయదాత మాత్రమేనని 'భయాన బోధపరిచింది.

లలితాంబ అదివరకు కొట్టిన దెబ్బలకే రాజ్యలక్ష్మికి చెవులు దిమ్మవేసిపోయాయి. నవనాడులూ క్రుంగిపోయాయి. తన కొక చిన్నాన్న లేడనీ, కేవలం ఈ చిన్నాన్న, పిన్ని అనేవాళ్ల ఆశ్రయాదాతలనీ ఆ పిల్లకి తెలియడంతో ఆ లేత హృదయం మరింతగా కొరడుబారిపోయింది.

"ఇప్పుడు వెక్కి వెక్కి ఏడిస్తే ఏం లాభం?'' లలితాంబ చెప్పింది. "నామాట విను.....ఈ సంగతి యింతవరకూ రెండో కంటివాడికి తెలియదు గనుక సరిపోయింది......ఇదిగాని బయటికి పొక్కిందో నీతో పాటు నేనూ, నా పిల్లలు కూడా పరువూ, ప్రతిష్ఠలను మంటగలుపుకొని రోడ్డున పడాలి.......అంచేత నీ 'చిన్నాన్న'మీద "పోషించి పెంచి ఇంత చేసినవారని విశ్వాసమే''ఉంటే నే చెప్పింది చెయ్యి......వూ..... ఏమంటావ్?''

లలితాంబ గద్దించింది.

ఒక చెంపకొడితే పాలూ, వో చెంపకొడితే నీరూ కారే పసిపిల్ల రాజ్యలక్ష్మికి లలితాంబ పొడిచిన బుగ్గ పోట్లవల్ల అవి ఏనాడో పట్టిపోయాయి.

కళ్లవెంట నీళ్లుగారుస్తూ, "నన్ను చంపు పిన్నీ'' అన్నది.

ఇది కలియుగమైన కారణాన ఈ భారతభూమి నిరపరాధుల కన్నీటికి చలించలేదుగాని, లేకపోతే భగ్గున మండటమో, ఫెళ్లున చీలడమో చేయాలి.

లలితాంబ నవ్వింది. అది నవ్వుకాదు. ప్రతీకారమనే వాంఛ.

"పిచ్చిదానా! చంపడమెందుకే. నేను నీకు పెళ్లి చేస్తానుగా'' అన్నది.

"నువ్వు ఏ పాపిష్ఠి పుటక పుడితే నాకేం! ఇన్నాళ్లు పెంచిన దోషానికి ఇంకోనేరమని అనుకుంటాను. ఈ లోకంలో ఈ నీ జాతిమాలినతనాన్ని ఎవ్వరికీ చెప్పను......నీ చిన్నన్నామీద, నామీద విశ్వాసముంచి నువ్వు ఈ పెళ్ళికి ఒప్పుకున్నావంటే చాలు......డబ్బూ, కులమూగల మొగుడు నీకొస్తాడు. నేనూ, నా పిల్లలు వెలిపడకండా బ్రతికి బయట పడతాం''—లలితాంబ భయాన నయాన బోధపరిచి రాజ్యలక్ష్మిచేత ఒట్టు వేయించుకున్నది. "ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే మీ చిన్నాన్నకు ఈ సమాజంలో పుట్టగతులుండకండా ఐపోతుంది. గనుక ఆయన మొహం చూసేనా నువ్విందుకు సమ్మతించు'' మని హెచ్చరించిందామె.

"ఇక్కడ పని మహా సరదాగా ఉంది సార్" కొత్తగా వచ్చిన కోతలరావు ఇకిలిస్తూ హెడ్ క్లర్కుకి బాణం వదిలాడు.

"ఔనౌను. చూస్తూనే ఉన్నాగా - గంటలతరబడి నువ్వు కాగితాలు ముందరేసుకుని కూర్చోడం."

సోమేశ్వరరావు (కాకినాడ)

"చేస్తా పిన్నీ......చేస్తాను......నువ్వేం చెబితే అదే......''

వెక్కి వెక్కి ఏడుస్తున్న రాజ్యలక్ష్మినివదిలి విజయగర్వంగా బయటికి వెళ్ళిపోయింది లలితాంబ.

* * *

సాంబశివంగారు ఇన్ని సంవత్సరాలు భార్యకు చెప్పలేకపోయిన నిజం—దేవునికి సైతం వినిపించలేకపోయిన రహస్యం—అసిగిపోతుందనుకున్నాడుగాని, పాంచివుండి పసిపిల్ల రాజ్యలక్ష్మి జీవితంలో ఇంత చిచ్చుగా రగుల్తుంది అనుకోలేదు.

"ఏమైనా, నా తల్లికి నేను నిజం చెబుతాను' అనుకున్నాడాయన రాజ్యలక్ష్మి నుద్దేశించి. కన్నీరింకిపోయి మొండిబారిపోయిన పసికందు రాజ్యలక్ష్మికి నిజం చెప్పి తన బరువుదించుకుందామనుకున్నాడు. సాంబశివంగారు.

* * *

లలితాంబ వదిలి వెళ్ళిపోయినతర్వాత రాజ్యలక్ష్మికి ఎదనెవరో నమిలినట్లనిపించింది. తనకు జాతిలేదనీ, తల్లిలేదని, తండ్రి తెలియదనీ లలితాంబ అన్న మాటలు ఆ పిల్లకి వింతగా తోచాయి. తను "పిన్ని" మాటవిని పెళ్ళికి ఒప్పుకుంటే చిన్నాన్న పరువు దక్కుతుంది అని పిన్ని అన్నది గనుక అలాగే చేద్దామనుకుంది. ఆశ్రయదాతకి కృతజ్ఞతా, విశ్వాసం చూపడమంటే తాను చెప్పినట్లు విని పెళ్లికి ఒప్పుకోడమేనన్న లలితాంబ హితోపదేశానికి ఆ పిల్ల కట్టుపడి పోయింది.

ఆ పిల్లకు యెవరు చెప్పారో తెలియదుగాని—ఎలా కలిగిందో తెలియదుగాని—తన జన్మ రహస్యం దాచవల్సినంత పాపమే అయితే దానిని దాచడమే మేలు అనిపించింది! అందుకు మార్గం ముసిలాడితో పెళ్లి అయినా—ఫర్వాలేదని కూడా అనిపించింది!!

కుక్కిమంచంలో మూటగట్టుకుపోయి పడున్న ఆ పిల్లను దీకట్లు పోదార్చడానికా అన్నట్లు కౌగలించుకున్నాయి.

ఆ లావణ్యం ముద్దను ఎదను అదుముకుని, గుండెల్లో దాచేసుకుందామా అన్నట్లు సాంబశివంగారు ఆ మంచందగ్గర చతికిలబడి, కన్నీటితో ఆ పిల్లను తడిపేశాడు.

రాజ్యలక్ష్మి పెదవులువిప్పి, "ఏడవకండి చిన్నా"... "న్నా" అన్న మాటను ఆ పిల్ల పూర్తి చేయలేదు. తనకు ఈయన 'చిన్నాన్నాకాడు' 'ఆశ్రయదాత' అని ఎవరో పొడిచినట్లయింది. ఆపిల్ల ఏడవటం లేదు. పైగా 'ఏడవకూడదని' సాంబశివంగారిని శాసించింది కూడాను.

"ఎలా ఏడవకండా ఉండను తల్లీ! కన్నతండ్రినై యుండీ నీపట్ల కటికవాడిగా ప్రవర్తించిన నాకు పుట్టగతులుంటాయా......'' ఆయన ఏడిచాడు.

ఆక్షణంలో ఆ ఇద్దరి హృదయాలలోనూ ఒకటే కోరిక—ఒకటే ఆవేదన. తమ ప్రాణాలలాగే ఎగిరిపోతే బాగుణ్ను. అటుతర్వాత స్వర్గమే దొరకనీ—నరకమేరానీ. ముందు ఈ రంపపుకోత తప్పుతుంది కదా........

సాంబశివంగారికి ఎందుకు భయం? ఎవరిదగ్గర? ఎందుకొచ్చిన భయం?

ఆత్మవంచన పరవంచన ఏ అవసరాలకోసరం చేశాను? అని ఆత్మావలోకనం చేసుకుంటే సాంబశివంగారికి ఈ చిక్కు ఏనాడో విడిపోయేదేమో....

"నేను దిక్కుమాలినదాన్ని. నన్ను మీరు పెంచేరు" అని రాజ్యలక్ష్మి తన వొళ్లో తలదాచుకున్నప్పుడు అతని గుండెలమీదనే సమ్మెటపోట్లు తాకినట్లనిపించింది. చెవులు మూసుకుని, "తల్లీ! అలా అనకు తల్లీ! నేనే నీ పాపిష్ఠి తండ్రిని. నువ్వు అనాథవి, దిక్కుమాలినదానివీకాదు. నీ తల్లి లోకంలోని ఏ ఇతర స్త్రీకి తీసిపోదు. ఆమె నీచురాలూకాదు. ఆమె చేసినపని హీనమూ, నేరమూకాదు......నాకు ఏ శిక్షఐనా వెయ్యితల్లీ........నన్ను క్షమించకమ్మా..." అంటూ ఆపిల్లను చేరదీసుకుని......"ఈ పెళ్లికి మాత్రం ఒప్పుకోకు రాజా........పోతేపోయింది నా పరువూ, నా సమాజం అన్నీ మంటగలవనీ. నువ్వు మాత్రం మీపిన్నిమాటలు నమ్మి ఈ పెళ్లికి ఒప్పుకోకమ్మా'' ఆవేశంగా చెప్పాడు.

ఐతే సాంబశివంగారికి రాజ్యలక్ష్మి తన కూతురేనని చెప్పి, ఆ పిల్లకు శిష్టసమాజంలో వివాహం జరిపించ గల ధైర్యంలేదు. అందుకనే ఆమాటంటూనే భార్యలేచి వస్తుందేమోా నన్నభయంలో ఆయన వెళ్ళిపోయాడు.

సంస్కార హృదయం అపరాధనను కుంటే శిక్ష ననుభవించడంలో నిమగ్నమౌతుంది. అంత వరకూ రాజ్యలక్ష్మి దదే తత్వం. కాని, సాంబశివం గారు వెళ్ళిపోయింతర్వాత ఆమె ఎదనంతా ప్రతీకారవాంఛ నిండింది. ఆలేత హృదయంలో కూడా ఎవరికోసరం నా త్యాగం? ఎవరు నాకోసం త్యాగం చేశారు గనుక? ఇంతకంటే చస్తేమేలు......చావు వల్ల ఎవ్వరి ప్రతిష్ఠ భగంపడేదిలేదు'' అనిపించింది.

విడీ విడని చిక్కులు

ఆత్మహత్య కూడా పాపమేనని ఆ పిల్లకి ఎవరూ చెప్పలేదు. అదే మార్గమని ఆ పిల్ల అనుభవిస్తున్న రంపపు కోత ఆమె అంతరాళంలో స్ఫురింపజేసింది కూడా.

రాజ్యలక్ష్మిలేచి కూచున్నది. మూగదేవుడి ప్రతిమలాగ నిశ్శబ్దంగా, గంభీరంగా, బరువుగా చీకటి అలుముకున్నది.

సూర్యం బావను చూద్దామనిపించింది, రాజ్యలక్ష్మికి. కాని అంతలోనే సూర్యంబావమీద కూడా విపరీతమైన కోపంవచ్చింది. "ఛీ! తనకుమాత్రం నేను కావాలా? అక్కర్లేదు......ఐనా ఈ దిక్కుమాలినదాన్ని తనేం చేసుకుంటాడు........అక్కర్లేదు చూడక్కరలేదు" అనుకుంది.

ఎవరు?

తనని చేరదీసి అప్యాయంగా "నువ్వు నా దానివిరాజా!" అన్నారు? ఆ పిల్లకి దుఃఖం పెల్లుబికింది. నిర్మలక్కయ్య మంచిది. ఒక్కసారి చూడాలనిపించింది. తను ఉన్నాలేకపోయినా సానుభూతి చూపగల ఒక్క వ్యక్తి నిర్మల ఉన్నది. ఆమెను ఒక్కసారి చూడనా?.....

రాజ్యలక్ష్మి లేచింది. నిర్ధారణ చేసుకున్నట్లు. "నా కెవ్వరూలేరు......" అనుకుంది.

(సశేషం)

పెద్ద జీతాలతో పనులు తేలికగా దొరికేవి. డెన్వర్ వంటి పారిశ్రామిక నగరంలో ఉద్యోగాలకోసం వచ్చిన వేలాది యువతులలో అడాస్పెల్ ఒకతె. మాంసం డబ్బాలలో సరఫరాచేసే ఒక ఫాక్టరీలో పనికి కుదిరింది. ఆరోజు — అంటే సోమవారం. ఆమెకు 'ఆఫ్‌డే' (ఆదివారం పనిచేసినందువల్ల ఇచ్చిన సెలవురోజు.)

ఆమెతో పరిచయం ఉన్న ఇతరులు కూడా ఇంతకంటే ఎక్కువ వివరాలు చెప్పలేకపోయారు. అడా ఎక్కడినుంచి వచ్చింది ? తన తండ్రి తూర్పు కాలరాడోలో ఎక్కడో ఒక రాంచ్ (పశువులు పెంచే క్షేత్రం) నడుపుతున్నాడని చెప్పినట్లు జ్ఞాపకమని ఎవరో అన్నారు. ఆమెకు వివాహం అయిందా ? ఏమో, ఎప్పుడూ చెప్పలేదు.

పోనీ ఆమెకు డెన్వర్‌లో 'అబ్బాయి' లెవరైనా తెలుసా ? ఒకడు తెలుసు. ఇంచుమించు ఆమె వయస్సే ఉన్న ఒక మనిషి—ఆమె పనిచేస్తున్న ఫాక్టరీలోనే అతనికీ ఉద్యోగం. ఇంకా ఎవరైనా ఉన్నారా ? అడాతో పరిచయం ఉన్న ఒక స్త్రీ, ఒకరోజు అడాస్పెల్ ఎవరో ఒక వయస్సు ముదిరిన పురుషునితో గట్టిగా మాట్లాడటం గమనించానని చెప్పింది. ఇంతకంటే ఏమీ తెలియలేదు.

అడాకి తెలుసునని అందరూ చెప్పిన అబ్బాయిని ప్రశ్నించటమే తరువాయి అని డిటెక్టివ్ ఫిన్నీ నిశ్చయించుకున్నాడు. ఈ యువకుడు అప్పుడప్పుడూ అడా ఇంటికి వచ్చి వెడుతూ ఉండేవాడు. ఇతనికి కొద్దిగా కుంటి ఉండేదని చుట్టుపక్కల వాళ్ళు చెప్పారు. కాని, అతను అడా చనిపోయిన రోజంతా ఫాక్టరీలో పనిచేస్తున్నాడు.

ఆమె మరణించిందని తెలిసి దిగ్భ్రాంతుడైనట్లు చెప్పాడు. తా మిద్దరూ మంచి స్నేహితులుగా ఉండే వార మన్నాడు. అయినా ఆమెను గురించి తనకు అంతగా తెలియదు. ఆమెకు వివాహం అయిందా ? లేదని అతని అభిప్రాయం. ఆమెకు ఇతర పురుషులు ఎవరైనా తెలుసా ? తెలియదు—కాని ఒక సారి మాత్రం తాను అడాని చూడటానికి వచ్చినపుడు మాత్రం వయసు ముదిరిన మనిషి ఒకడు

నిపుణునిచే హత్య

25-వ పేజీ తరువాయి

బయటకు వెళ్లిపోవటం గమనించాడు. అతను తన తండ్రి, అని అడా తర్వాత చెప్పిందిట.

సమాధానాలు దొరకని మరికొన్ని ప్రశ్నలు

అడా అద్దెకు తీసుకున్న గది వెతికినా రహస్యాలు ఏమీ బయటపడలేదు. ముగ్గురు చిన్నపిల్లలు కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి దొరికింది. దాని మీద ఏమీ రాసి లేదు. ఆమె పేరు కల బైబిలు ఒకటి ఉంది. దానిమీద, "ఫ్రం మదర్ ఎండ్ ఫాదర్ (మా అమ్మా, నాన్నా వద్ద నుంచి)" అని రాశారు ఎవరో. ఒక 'వెడ్డింగ్ రింగ్' (పెళ్లి అయితే ఆడవారు పెట్టుకునే ఉంగరం) దొరికింది.

అడాకి నిజంగా వివాహం జరిగినట్లా ? అయితే ఆమె తన పుట్టింటిపేరు మాత్రమే వాడుతోం దన్నమాట—తన తండ్రి ఒకసారి వచ్చి తిరిగి ఇంటికి వచ్చెయ్యమని కోరినట్లు ఒక స్నేహితురాలితో అడా చెప్పిందట. ఆ సందర్భంలో తన తండ్రిపేరు గైస్పెల్ అని చెప్పింది.

సరే, ఆమె తండ్రిని ప్రశ్నించిచూస్తే బాగుంటుందేమో ? తూర్పు కొలరాడో రాష్ట్రంలో భూస్వాముల జాబితాలో వెతికి చూశారు. 'రామా' అనే చిన్న వూరిలో గైస్పెల్ దంపతులు ఒక చిన్న 'రాంచ్' (పశువుల క్షేత్రం) నడుపుతున్నారని తెలిసింది.

డిటెక్టివ్ ఫిన్నీ అదే సాయంత్రం రామాకి వెళ్లాడు. స్పెల్ రాంచ్‌లో ఒక కొత్త విషయం తెలిసింది. అరవైఏళ్ళపైన వయస్సు ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. కాని అతని పేరు ఆల్‌స్పెల్. గైస్పెల్ అతని అన్న. అతను ప్రస్తుతం డెన్వర్‌లో తన భార్యతో ఉంటున్నాడని, ఆల్‌స్పెల్ చెప్పాడు. అయినా గైతో పోలీసువారికి పని ఏమిటి ?

డిటెక్టివ్ ఫిన్నీ తను వచ్చినపని చెప్పాడు. గైస్పెల్ కూతురు అడాని ఎవరో చంపివేశారని తెలుపటానికి చింతిస్తున్నా నన్నాడు.

ఆల్‌స్పెల్ ఆశ్చర్యపడ్డాడు. తన అన్నగారికి అడా అని పేరుకల కూతురు లేదే అన్నాడు. అతని కూతురుపేరు వర్జీనియా. వర్జీనియా వయస్సు ఏడు సంవత్సరాలు ! అడా వర్జీనియా తల్లి.

బయటపడిన కథ ఇది :

అడా చిన్నప్పుడే ఆమె తలిదండ్రులు పోయారు. అప్పటినుంచీ స్పెల్ సోదరులవద్దనే పెరిగింది. అడాకి 20 సంవత్సరాలు వచ్చినప్పుడు గైస్పెల్ వయస్సు 58. వా రిద్దరూ పెళ్లిచేసుకున్నారు. ఇదంతా జరిగి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నది. ఈ మధ్యలో వారికి ముగ్గురు పిల్లలు పుట్టారు.

రెండు సంవత్సరాల క్రితం అడా మాయమైపోయింది. గైస్పెల్ పిల్లలను డెన్వర్‌కి తీసుకొని వెళ్లి అక్కడ ఒక హాస్టల్‌లో ఉంచాడు. అడా కోసం ఎక్కడెక్కడో వెతికిచూశాడు కాని ఆమె కనిపించలేదు. ఇటీవలే ఆమె డెన్వర్‌లోనే ఉన్నదని విన్నాడు. రహస్యంగా వచ్చి పిల్లలను చూసి వెడుతున్నదిట. ఇది విన్న వెంటనే డెన్వర్‌కి వెళ్లాడు.

గైస్పెల్ తుపాకితో మంచి నిపుణుడా ? తప్పకుండా. తన .32 పిస్టల్‌తో 20 అంగలదూరంలో కదులుతున్న వస్తువులను సైతం తేలికగా కొట్టగలడు. పిడికిలి పరిమాణంగల వస్తువులను చెప్పి చెప్పి కొట్టేవాడు. పిడికిలి అంటే సుమారు గుండెకాయ అంత ఉంటుందికదా !

నిర్బంధన

రెండు రోజుల తర్వాత డెన్వర్‌లో గైస్పెల్‌ని పట్టుకున్నారు. ఆ .32 పిస్టల్ అతని వద్దనే దొరికింది. అడాస్పెల్‌ను చంపిన ఆయుధం అదేనని పరిశోధనలవల్ల తెలిసింది.

1949 డిసెంబర్‌లో విచారణ జరిగింది. పిస్టల్ ఉపయోగించటంలో నిపుణుడని తేలిన గైస్పెల్‌కి హత్యానేరంమీద 15, 20 సంవత్సరాల కారాగార వాస శిక్ష విధించారు.

కాని జైలులో ప్రవర్తన బాగా ఉండటంచేత అతను 1949 ఏప్రిల్‌కే విడుదల అయ్యాడు. అదేసంవత్సరం సెప్టెంబర్‌లో తమ రాంచ్‌లో చనిపోయాడు. ★

మోహనుడితో తను తిరిగిన స్థలాలకు వెళ్ళి విన్నిమార్లు తను స్వప్నలోకంలో విహరించలేదు.

స్వప్నంలోనే రెండేళ్లు గడిపింది ఇందిర. మోహనుడికి ఉత్తరాలు వ్రాయటంతోనే తృప్తి పడేది. మోహనుడి ఉత్తరాలు విరహతాపంతో క్రుంగిపోతున్న మనస్సుమీద ప్రేమవర్షాన్ని కురిపించి దానిని చల్లపర్చేవి.

'మోహన్—మోహన్—మోహన్—'

ఇందిరకు ఎప్పుడూ మోహనుడి జపమే. ఆఖరికి గిరికూడా మోహనుడిని ఆమె మనస్సునుండి దూరం చేయలేకపోయాడు.

గిరి అంటే ఇందిరకు అమితమైన ప్రేమ. మోహను డామె సర్వస్వం. ఆమెకు మోహనుడిని చూడాలని ఆత్రంలేదా ?

అసలే సుందరరూపంగల మోహన్ ఇప్పుడు విదేశయాత్ర, ఆహారం, వాతావరణం మార్పులవల్ల మరింత అందంగా తయారయ్యాడేమో ?

ఎప్పుడు ఆ 'పవిత్రమూర్తిని' కళ్లారా, తనివి దీరా చూస్తానా అని కలవరిస్తున్న తనకు ఆత్రం లేదా ?

ఒక్కోరోజు ఒక్కో యుగంలా గడుస్తోంది ఇందిరకు.

మోహనుడికోసం తన జీవితసర్వస్వమయిన 'వెండిమబ్బు'నే వదలి ముందుకు నడవడానికి సిద్ధంగా ఉంది ఇందిర.

తన ప్రాణమయిన గిరిని రెండోమారు అనాథుడిగా చెయ్యటానికికూడా సిద్ధపడింది ఇందిర.

'వెండిమబ్బు', గిరి—ఇద్దరిని వదిలేసి నాతో రావాలి అని మోహనుడు షరతు విధించినా ఇందిర ఒప్పుకొనేదే.

'వెండిమబ్బు'లోని ఈ గడుసుపిల్ల, ఎవ్వరికీ భయపడకుండా, లొంగకుండా, ప్రతిఘటన లేకుండా గిరిలా తిన్నగా ఏ అడ్డు లేకుండా ఆకాశమెత్తు పెరిగిన మనస్సును అపరిచిత సుందర యువకుడికి అర్పించేసింది.

ఆమె అచంచల నియమసంయమాలను మోహనుడి చూపులు, మాట శిథిలపరిచాయి.

సామాన్యంగా ఎప్పుడూ ఏ విషయంలోనూ దౌర్బల్యానికి లోనవని ఇందిర మోహనుడి ప్రేమ ముందు దుర్బలురాలయింది. ఆ దౌర్బల్యమే ఆమెను వివశురాలినిగా చేసింది.

మోహనుడిని కలుసుకునేరోజు దగ్గరి కొచ్చిన కొలది ఆమె హృదయంలోని భావనలు విజృంభించాయి.

శ్రుతిచేసిన ఆ వీణ ప్రేమీ ఎప్పుడు తనను మీటి ప్రేమగీతాన్ని ఆలాపిస్తాడో అని తపించింది.

వీచే చిరుగాలికికూడా కంపిస్తున్న వీణా తంత్రులు తమలో రాగలోకాన్నే ఐక్యంచేసుకున్నాయి. ఉత్తమ కళావిదుని రాకకోసం మౌనంగా ఎదురుచూస్తోంది ఆ వీణ.

ఇందిరకు ఆత్రం లేదా ?

కొలవలేనంత ఆతురత.

నోటితో చెప్పలేనంత తపన.

బ్రహ్మాండాన్నే దాచుకోగలిగిన హృదయంలో దాచినా దాగక తొణికిసలాడే ప్రేమవాహిని ఆమెను వివశురాలిగా చేసింది.

వెండిమబ్బు

24—వ పేజీ తరువాయి

ఇందిర మేలుకునే కల కంటోంది.

కలకంటూనే తండ్రిని బొంబాయికి సాగనంపింది. తను ఇంట్లోనే ఉండి అతడి ఆగమనానికి తగిన సన్నాహాలు జరుపసాగింది.

'వెండిమబ్బు' ఆమె స్పర్శతో బంగారుమబ్బుగా మారి మెరవసాగింది. మబ్బుల్లో తేలిపోయే ఈ కిన్నెరకన్నె స్వప్నసౌధంలో విహరిస్తూ ఉంది.

ఆమె వనితనంతో 'మెరుపుతార' రూపే మారిపోయింది. ఇంటిని ఎంత అలంకరించినా ఆమెకు తృప్తిలేదు. మోహనుడికోసం ప్రత్యేకించిన గది మాట చెప్పనే అక్కర్లేదు. పూరివిప్పి నాట్యమాడే నెమలి అందాన్ని గుర్తుకు తెస్తోంది.

మోహనుడు ఓడ దిగగానే కూతురికి టెలిగ్రాం పంపారు రావుగారు.

"మోహనుడు వచ్చాడు. క్షేమంగా ఉన్నాడు. వాళ్ల ఊరు వెళ్ళి వస్తాడు."

ఇంతదాకా ఊహామాత్రంగానే ఉన్న మోహనుడు ఇక సజీవంగా, జీవంతంగా తన కళ్లకు కనుపించబోతున్నాడు.

"మీరు డిక్షనరీ ఎలా తయారు చేశారు."

"అదా. అందులో కష్టమేమీ లేదే! మీరు మీ ఆవిడతో పోట్లాడుతున్నారనుకోండి, మాటకు మాట వస్తుందా రాదా? అంతే."

వి. పద్మనాభం (మద్రాసు)

భావనల తంత్రులు మరింత బిగువుగా మీటడానికి సిద్ధపడింది. రావుగారు రాగానే వేయిప్రశ్నలడగా లనుకున్న ఇందిర ఒక్కమాటకూడ మాట్లాడలేక పోయింది.

మాటరాని మూగదానిలా చూస్తూ నిల్చుని తండ్రి చెప్పినదంతా వింది ఇందిర.

"కులాసాగా ఉన్నాడమ్మా. బాగా లక్షణంగా ఉన్నాడు. నువ్వూ వస్తే బాగుండేదని అన్నాడు. అలిత పోయిన సంగతి విని చాలా బాధ కలిగిందన్నాడు. వాళ్ల నాన్న రాలా మరి ...."

"గిరివిషయం అడిగారా నాన్నా ?"

"ఆఁ .... ఊఁ .... అడిగినట్టున్నాడు. ఇక్కడికి రేపు సోమవారం వస్తాడు."

రావుగారు తరువా తేం మాట్లాడారో. అదేమీ ఇందిర వినిపించుకోలా.

"రేపు సోమవారం వస్తాడు."

ఇందిర లోపలకు పరుగెత్తుకుంటూ వచ్చి,

"గిరీ, మీ బావ సోమవారం వస్తారటరా" అంటూ ముద్దెట్టుకుంది.

రెండేళ్ళు ఎలా గడిచాయోగాని ఆ వారంరోజులు గడపటమే గగనమయింది ఇందిరకు.

రోజొక యుగంగా, గంటొక సంవత్సరంగా అగుపించింది.

మోహనుడికి స్వాగతమివ్వడానికి రావుగారు, ఇందిర బయల్దేరారు. ఇందిర తన మామూలు సరళమైన దుస్తులలోనే ఉంది.

కూతురి దుస్తులు చాలా సాదాగా ఉన్నాయనిపించింది రావుగారికి. కాని ఆయనేమీ మాట్లాడలా.

కడూరు ప్లాట్‌ఫారంమీద తండ్రీ, కూతుళ్లిద్దరూ కాచుక్కూర్చున్నారు.

ఇందిర వెయిటింగ్ రూములో కూర్చుంది. తండ్రిమాటలు ఆమెకు వినపడటంలేదు. దేహమంతా చెవులు చేసుకుని రైలుశబ్దం కోసం ఆలిస్తోంది.

భావనల వీణాతంత్రులు మరింత బిగువయ్యాయి.

ట్రైను సద్దు వినబడింది.

తండ్రీ కూతుళ్లిద్దరూ బయటకు ఆత్రుతగా వచ్చారు.

ఇప్పుడు ఇందిర అన్నీ మరిచి కళ్ళుమాత్రమే అయింది.

ట్రైను నిలిచింది.

రావుగారు ముందుకు వెళ్లి మోహనుడి కరస్పర్శ చేశారు. మోహన్ ట్రైనులోంచి దూకాడు.

కొంచెం దూరంలో నిల్చున్న ఇందిర రెండడుగులు ముందుకు వేసింది.

మోహనుడు ఆమెను చూశాడు.

నాలుగుకళ్లు కలిశాయి.

రెండు క్షణాలు ఇద్దరూ ఈ లోకాన్నే మరిచిపోయారు.

మోహనుడు ఇందిరను చూసి అందంగా నవ్వాడు. ఇందిర పెదిమలపై వికసించబోయిన మందహాసం ముకుళించింది. ఆమె భావనలన్నీ గడ్డకట్టుకు పోయాయి.

ఇందిర మొహం పాలిపోయింది. నుదుటిపైన స్వేదబిందువులు మెరిశాయి. నేలకు అతుక్కుపోయిన కాళ్లు అస్థిరమయ్యాయి. దేహం కంపించింది.

రాగవీణ తంత్రులు తెగిపోయాయి.

మరుక్షణంలో ఇందిర తేరుకుంది. నిర్జీవమైన నవ్వు, ఎండిన పెదివుల నాక్రమించుకుంది..

మోహనుడు దగ్గర కొచ్చాడు.

తనకు తెలీకుండానే రెండడుగులు వెనక్కి వేసింది ఇందిర.

"ఇందిరా. కులాసాయేనా ?"

"ఆఁ .... "

తరువాత ఏం మాట్లాడాలో తోచలే దతనికి.

"చాలారోజు లయింది."

"అవును . . . . "

"ఈరోజు వచ్చిందంటే నమ్మడానికే వీల్లేకుండా ఉంది."

"అవును. నాకూ అలాగే ఉంది."

"నేను విదేశాలకు వెళ్లి అక్కడ రెండేళ్ళు ఉండటం ఓ కలలా ఉంది,"

"కల !"

"ఎంత త్వరగా రెండేళ్ళు గడిచిపోయాయి. నేను విదేశానికి బయల్దేరటం నిన్నమొన్న

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక
సర్క్యులేషన్ అత్యధికమైనది!

నాటకంలాగా నా మనసులోంచి మాయంకాకుండా ఉంది."

"నాటకం ! ఊఁ .... నాటకం"—ఇందిర మాట తడబడింది.

మోహనుడి సామాన్లు దింపించుకుని రావుగారు మోహనుడి దగ్గరకొచ్చి భుజంతట్టి

ఇహ వెడదామా ?" అన్నారు.

"వెడదాం ఇందిరా," అన్నాడు మోహన్.

"ఊఁ—ఊఁ—వెడదాం" అంది ఇందిర.

రావుగారు డ్రైవరుప్రక్కన కూర్చున్నారు .

వెనకసీటులో ఇందిరా మోహన్ కూర్చున్నారు.

కారు బయల్దేరింది.

రావుగారు, మోహన్ మాట్లాడుతూనే ఉన్నారు.

మోహన్ తన అనుభవాలను ఎంతో రసవత్తరంగా వర్ణిస్తున్నాడు. అతడి వర్ణన, మాటతీరులను రావుగారు మెచ్చుకుంటూ తలూపుతూనే ఉన్నారు. మోహనుడు తమాషాగా మాట్లాడినప్పుడల్లా రావుగారు నిండుగా నవ్వుతున్నారు.

ఈ మాటల్లో కలవకుండా ఇందిర బయటకు చూస్తోంది.

తాను పట్టుకున్న ఆధారస్తంభం కూలిపోతోందనిపిస్తూ ఉంది ఇందిరకు.

ఇందిర మౌనంగా ఉండటం గమనించి రావుగారు,

"ఇందిరా, అలా ఉన్నా వేమమ్మా ?" అన్నారు.

తండ్రి పిలుపుతో అన్యమనస్కురాలైన ఇందిర ఉలిక్కిపడి,

"ఏమన్నావు నాన్నా ?" అంది.

"అలా ఉన్నా వేమమ్మా" అన్నారు రావుగారు మళ్లీ.

"ఏం లేదే" అంటూ చిన్నగా నవ్వింది ఇందిర.

మితిమీరిన సంతోషంతో హృదయం నిండుకోగా మాట్లాడలేకపోతోందని ఊహించి మనస్సులోనే నవ్వుకున్నా రాయన.

మోహనుడు సంశయంతో నిండిన ఓరచూపొకటి విసిరాడు ఇందిరవైపు.

ఇందిర బయటకు చూస్తూనే ఉంది. మోహనుడికి ఆమె దగ్గరగా జరిగి కూర్చోవా లనిపించినా ఎందుకో అలా చెయ్యటానికి ధైర్యం చాల్లేదు.

'మెరుపుతార' పోర్టికోలో కారు ఆగింది.

పై మెట్టుమీద పనిమనిషి గిరిని ఎత్తుకుని నిల్చుంది.

తండ్రినీ, అక్కనూ చూడగానే చప్పట్లుకొడుతూ క్రిందికి వంగాడు.

తనవైపు చాచిన తమ్ముడి చిన్నారిచేతులవంక చూడనట్లుగానే లోపలకు వెళ్లిపోయింది.

సరళంగా ఉన్న మోహనుడిమొహం అకస్మాత్తుగా గంభీరమైపోయింది.

రావుగారు బిడ్డ నందుకుని,

"బావరా బాబూ." అన్నారు.

మోహనుడు బిడ్డను పరీక్షగా చూశాడు.

సంవత్సరం రెండునెలల పిల్లాడు మూడేళ్ల పిల్లాడిలా అగుపిస్తున్నాడు. దేహపు పెరుగుదలకి తగ్గ చురుకుదనం, ఉత్సాహం వాడి ఆటల్లో కనిపిస్తోంది.

గిరి కొత్తమనిషిని విప్పారిన కళ్లతో చూస్తూ, తండ్రివేపు ప్రశ్నార్థకంగా చూశాడు.

వెండి మబ్బు

"బావరా బాబూ, పుట్టటంతోనే తల్లిని మింగాడు మోహన్‌రావ్. ఈరోజు లలిత ఉంటే ఎంత సంతోషించేదో! మీ పెళ్లి చూడాలనే కోరిక తీరకుండానే పోయింది. ఏం చేస్తాం ? గిరి పుట్టేటప్పుడే కొరడా చేతిలో పట్టుకుని పుట్టి ఉండాలి .... "

"ఛ ఛ! అలా అనకండి. బంగారు చెమ్చా నోట్లో పెట్టుకుని పుట్టాడు అల్లరి పిల్లాడు ..... " అంటూ మోహన్ బిడ్డబుగ్గమీద మృదువుగా ఒక చిన్నదెబ్బ వేశాడు.

"దేవుడు ఒకరూపంలో ఇస్తే ఇంకో రూపంలో లాక్కుంటాడు...."

—రావుగారు ఆత్మీయులతో చెప్పుకున్నట్లు మోహనుడివద్ద తమ బాధను వ్యక్తపరిచారు.

పనిపిల్ల స్నానానికి నీళ్ల సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

రావుగారు మోహనుడిని అతనికోసం ప్రత్యేకించిన గదికి తీసుకువెళ్లి,

"ఇక మీరున్నారు. ఇంది రుంది. సంకోచపడకండి. ఇది మీ ఇల్లే అనుకోండి."—

బిచ్చగాడు : "బాబ్బాబు! చెల్లని కాసు ఇచ్చాగు. ఇది తీసుకుని మరోటి ఇవ్వండి."

పెద్దమనిషి : "ఉంచరా అది నీ నిజాయితీకి గుర్తుగా ఉంటుంది!"

గంగాధరరావు (నిడుబ్రోలు)

అని చెప్పి కొడుకు నెత్తుకుని వెళ్లిపోయారు.

అక్కడే ఉన్న పడకకుర్చీలో కూలబడ్డాడు మోహన్.

అలాగే పడుకుని యోచనాసమాధిలో మునిగిపోయాడు.

ఇందిర వచ్చి "భోజనానికి లేవండి" అన్నప్పుడే మేలుకున్నాడు మోహన్.

"ఊఁ .... ప్రయాణం బడలిక .... " అంటూ ఇందిరను చూసి నవ్వి, బూట్లు విప్పసాగాడు.

ఇందిర నిస్సారంగా నవ్వింది.

"నాటకం .... నాటకం .... " అని ఆమె మనస్సు గోలపెట్టింది.

"ఇందిరా, నేను అమెరికాలో ఉన్నప్పుడు .... " అంటూ మోహన్ తల పైకెత్తేసరికి అక్కడ ఇందిర లేదు.

మోహనుడు చకితుడయ్యాడు.

మోహనుడు భోజనాల గదిలోకి వెళ్లేసరికి పీటమీద కూర్చున్న రావుగారు "రండి, రండి"— అన్నారు.

మోహనుడికోసం రకరకాల పిండివంటలు చేయించారు.

"లలిత ఉంటే మిమ్మల్ని ఇంతటితో వదిలేసేదే కాదు. ఎంత ఉపచారం చేసేదో! అల్లుడికోసం ఎన్నిరకాల భక్ష్యాలు చేయించేదో ? పాపం! ఇందిర ఏమీ తెలియని పిల్ల. ఇంటి బాధ్యతంతా ఇప్పుడు ఇందిరమీదే పడింది. ఇహ పెళ్లి పనులు...'

"జిలేబీ వెయ్యనా, నాన్నా ?" ఇందిర వారి మాటలకు అడ్డుతగిలి ప్రశ్నించింది.

"నా కొద్దమ్మా. మీవారికి వెయ్యి" అన్నారు రావుగారు.

మోహనుడు జిలేబీ వేయించుకుని,

"ఇలాంటి వేవీ అక్కడ దొరకనే దొరకవు. మన తిండికోసం మొహం వాచిపోయా ననుకోండి" అన్నాడు.

మోహనుడు భోంచేస్తూ చేస్తూ ఎదురుగా ఒక జిలేబీ చప్పరిస్తూ కూర్చున్న గిరివైపే చూస్తున్నాడు.

"ఇక చాలులే బాబూ" అన్నారు రావుగారు కొడుకుని.

మోహనుడు తదేకంగా గిరినే చూస్తూ,

"గిరి అచ్చం మీలాగే ఉన్నాడు" అన్నాడు.

"ఇందిర వచ్చి గిరిని ఎత్తుకుంది. కాని గిరికి అంత త్వరగా అక్కడనుంచి కదలాలని లేదు. కాళ్ళు చేతులు, జాడిస్తూ ప్రతిఘటించాడు. కాని ఇందిర బలవంతంగా తీసుకువెళ్లింది.

బిడ్డ ఏడుపు వినలేక,

"ఇక్కడే ఉండనివ్వు ఇందిరా !" అన్నారు రావుగారు. కాని ఇందిర వెనక్కి రాలేదు.

భోజనా లయ్యాక మోహనుడు పడుకున్నాడు. మేలుకునేసరికి గంట ఐదయింది. ఇందిరే గదిలోకి కాఫీ, టిఫిన్ తెచ్చిచ్చింది.

"తోటలో అలా తిరిగివద్దామా ?" అన్నాడు మోహన్.

"ఊఁ"

"అయితే తయారవు."

"తయారుగానే ఉన్నాను."

"చేతిలో కత్తి లేదే .... "

"మీరు బయల్దేరండి. ఇప్పుడే తీసుకుని వస్తున్నా."

"ఆత్మరక్షణకా, నా రక్షణకా ?"

"రెండూనూ."

మోహనుడు మొహం కడుక్కుని, తల దువ్వుకుని బయల్దేరాడు. ఇందిర మామూలుగా కత్తి పట్టుకుని బయల్దేరింది.

దోవలో కనిపించిన పుట్టయ్య వాళ్లిద్దర్నీ చూసి కొంటెగా నవ్వాడు. ఇందిర కోపంతో గుడ్లురిమి చూసింది.

కాస్సేపు ఇద్దరూ తోటలో తిరిగారు. ఎక్కువగా మాట్లాడటంలా ఇద్దరూ. మౌనాన్ని భరించలేక మోహనుడే అప్పుడప్పుడూ ఒక్కొక్కమాట మాట్లాడుతున్నాడు.

"కూర్చుందామా ?"

"ఊఁ"

"ఎక్కడ కూర్చుందాం ? నీతో చాలా మాట్లాడాలి."

"అలా సెలయేటిదగ్గరకు వెళ్దాం."

"చాలా దూరమా ?"

"లేదు. దగ్గర్లోనే ఉంది. కొండలలోంచి

వెండిమబ్బు

ప్రవహించే నీటిప్రవాహం ఇప్పుడు చాలా బాగుంటుంది."

"సరే, పద."

"ఇందిర దారిచూపుతూ ముందుకు నడిచింది. మోహనుడు ఆమెను అనుసరించాడు.

ఇందిర సెలయేటిలోనే ఉన్న ఒక రాయిమీద కూర్చుంది. మోహనుడు ప్రక్కనే ఉన్న ఇంకో రాతిమీద కూర్చున్నాడు.

మోహనుడు చుట్టూ కలయజూశాడు. ఎక్కడా జనసంచారం లేదు.

మోహనుడు చెప్పే విషయాల్ని వినడానికి సిద్ధంగా ఉన్నట్టు కూర్చుంది ఇందిర.

మోహనుడు చేతులు పిసుక్కుంటున్నాడు. ఇందిరకళ్లు తప్పించుకుంటూ చుట్టూ చూస్తున్నాడు. పావుగంట గడిచినా అతడేమీ మాట్లాడకపోయేసరికి ఇందిర—

"ఏమో చెప్పాలన్నారు ?" అంది.

"ఊ. ఎలా చెప్పాలో తెలియటంలేదు."

"అంత కష్టమా ?"

"ఊ .... కొంచెం కష్టమే. నువ్వు ఏవిధంగా తీసుకుంటావో నాకు తెలీదు."

"శాంతంగా వింటాను. ధైర్యంగా చెప్పండి."

"కాని ఎలా చెప్పను ? నోరు రావటంలేదు. ఒకమాట మాత్రం చెప్పగలను — మీ అందరి ముందూ నేను అపరాధిని. మీ క్షమ యాచించే యోగ్యతకూడా నాకు లేదు."

"ముందు అపరాధంసంగతి చెప్పండి. తరువాత క్షమించేవిషయం చూద్దాం."

"ఎలా చెప్పను ఇందిరా ? నేను చెప్పే విషయం అందరికన్నా ఎక్కువగా నిన్ను బాధపెడ్తుంది. నువ్వు నన్ను క్షమించాలి."

"అసలు సంగతి తెలియందే."

"ఎలా చెప్పను ? ఈ క్షణాన్ని ఎలా ఎదుర్కోవటమా అని ఈ నిమిషందాకా ఆలోచిస్తూనే ఉన్నాను."

". . . . ."

"ఇందిరా .... "—అన్నాడు మోహన్ అతి దీనంగా.

"ఏమిటి ?" అంది ప్రశాంతంగా ఇందిర.

"నిన్ను చేపట్టడానికి నా మనస్సెందుకో ఒప్పుకోవటంలేదు ఇందిరా."

ఇందిర మాట్లాడలేదు.

ఇందిర బదులు చెప్పకపోయేసరికి మోహనుడు కంగారుగా మళ్లీ,

"ఇందిరా"—అన్నాడు.

"ఏమిటి ?"

"ఏమైనా మాట్లాడు ఇందిరా. మౌనంగా ఉండి నన్ను వేధించకు."

"ఏం చెప్పను ?"

"ఏమైనా సరే. నన్ను తిట్టు, కొట్టు. కృతజ్ఞత లేనివాడు అని శపించు. ఒకమనిషి ఇంకో మనిషిని ఎన్నిరకాలైన దైహిక, మానసిక బాధలు పెట్టగలడో అన్ని హింసలూ పెట్టు. చిత్రవధ చెయ్యి. కాని ..... "

"కాని నన్ను పెళ్లి చేసుకోవటానికి మాత్రం సిద్ధంగా లేరు. అంతేనా ?"

"మోహనుడు అవమానంతో తల వంచాడు.

"అంతేనా ?"

"అవును."

మోహనుడు ఇందిరలోంచి ఓ పెద్ద జ్వాలాముఖి ఉద్భవిస్తుందని ఊహించాడు. ఆమె హృదయాన్ని దహించే జ్వాల 'వెండిమబ్బు' నంతా వ్యాపించి దహించివేస్తుం దనుకున్నాడు. ప్రళయాన్ని ఎదురు చూశా డతడు. ఆమె కళ్లనుండి ప్రవహించే కన్నీటి ధారలతో ఆ సెలయేరు సముద్రంగా మారుతుం దనుకున్నాడు.

కాని ఇందిరనుండి ఏవిధమైన ప్రతిక్రియా కానరాలేదు. [సశేషం)

హాయవాతా అద్భుతగాథ

23-వ పేజీ తరువాయి

లేదుగాని ఇంతకీ మకారియో ఒప్పుగోవాలిగా!'

'నువ్వడిగితే ఒప్పుకోక ఏం జేస్తాడు?'

'ఏమో! చెప్పలేను! అతని కొకరంటే లక్ష్యంలేదు!'

'అలాగయితే మన దేశంలో ఇంకొక అందాలరాణి నెవరినయినా ఎన్నుకో నాయనా! మనలో అంతటి అందగత్తెలే లేరా ఏమిటి? పనికట్టుకుని అక్కడికి వెళ్లి ఆ మాయల మారిని దేహి అని అడగడమెందుకు?'

ఆమాటమీద హాయవాతా మరి మాట్లాడలేదు. మరికొంత సేపటికి నోకోమిస్ మళ్లీ అందుకుంది:

'చూడు! నాయనా! మనకి కావలసినది ఇంటికంతటికి చల్లని వెలుతురీయగల నట్టింట దీపం! అంతేగాని నక్షత్రాల వెలుగు, జాబిల్లి వెలుతురు మన కెందుకు? అదీగాక తాత ముత్తాతల కాలంనుంచి ఆ దేశస్థులందరు మన బద్ధశత్రువులు. ఆ మకారియో వాళ్లందరికన్న మరో రెండాకులెక్కువ చదువుకున్నాడు! అతనికూతురంతకన్న మిడిసిపడిపోతుందేమో! కనక నామాట విని అతని కుమార్తెమాట మరి తలపెట్టకు!?

అయినా హాయవాతా తనపట్టుదల విడిచిపెట్టలేదు. 'అమ్మమ్మా! ఆ మిడిసిపాటు లన్ని నన్ను పెళ్ళి చేసుకోగానే, నిన్ను చూడగానే అణగారిపోతాయిలే! ఇంకో మాట! నట్టింట చిన్నారిదీపంతోనే సరిపుచ్చుకోవాలని అనుకుంటున్నావుగాని, నేనెవరినో తెలుసునా? ఇరుగు పొరుగు రాజ్యాలన్ని జయించిన చక్రవర్తిని! ఆజాబిల్లినే తీసుకువచ్చి నీనట్టింట దీపంలా నిలబెడతాను! నాకేమి భయంలేదు! ఆ మకారియో నన్నేమి చెయ్యలేడు! మరి కాదు కూడదనక నన్ను వెళ్లనీ!'

హాయవాతాకి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకునితీరాలన్న గట్టి పట్టుదల కలిగిందని నోకోమిస్ కనిపెట్టింది. మరి లాభంలేదనుకుని చాలా జాగ్రత్తగా ఉండమనిచెప్పి, తగినంతమంది సైనికులతో ప్రయాణాని కంగీకరించింది.

కొన్ని వేలమంది సైనికులను వెంటబెట్టుకుని హాయవాతా దకోటారాజ్యానికి ప్రయాణమైనాడన్నమాటేగాని నిజంగా అతనికి తనకోరిక నెరవేరుతుందన్న ధైర్యం కలగలేదు! మొట్టమొదట మాగుపేరేదో చెప్పి మిన్నెహాహా తోడ్పాటుతో మకారియోదగ్గర ఉన్న చిత్రవిచిత్రములయిన బాణాలుకొన్ని సంపాదించుకు వచ్చాడు. మరి ఇప్పు డేముఖంపెట్టుకుని అతని

ఎదట నిలబడగలడు? తన సైనికుల బలగంతో మకారిమోని సులభంగానే ఓడించవచ్చును. కాని ఆ పరాభవంతో భగ్గుమని మండి పడి అతగాడు ఏదైనా అఘాయిత్యం తలపెడితే! విషం పూసిన క్రూరబాణంతో కుమార్తె ప్రాణం తీసి అమెతోబాటు తానుకూడా చచ్చిపోతే! మకారిమో మహా దురభిమాని! తన ప్రాణం పోవడానికయినా అంగీకరిస్తాడు కాని, అంతటి అవమానాని కెంతమాత్రము అంగీకరించడు! ఇంతకీ పట్టిబలగం చూపించి భయపెట్టడంవల్ల రవం తయినా ప్రయోజనం లేదని తేలిపోయింది. ఇక ఏమిచెయ్యాలి?

అయినా ఆ భటులందరిని వెంట బెట్టుకుని హాయవాతా నాలుగైదు రోజులపాటు కొండలమ్మట, గుట్టలమ్మట ప్రయాణం కొనసాగించి మకారిమో ఉద్యానవనం సమీపించాడు. సైనికుల కందరికి ఆ ఉద్యానవనాని కల్లంతదూరంలో ఒక పెద్ద విడిది ఏర్పాటుచేయించాడు. విల్లమ్ములు చేతబట్టి, మరి కొన్ని బాణాలు అమ్ముల పొదిలో అమర్చుకొని నెమ్మది నెమ్మదిగా మకారిమో ఉద్యానవన సింహం ద్వారం సమీపించాడు. కాని మకారిమో ఆద్వారం రెండు తలుపులు గట్టిగాబిగించి తాళం వేశాడు. మరి వేరే దారి కనబడ లేదు. మిన్నెహాహా ఎక్కడయినా కంటపడక పోతుందా అని ఒకచెట్టెక్కి బాగా పరకాయించాడు. ఆమె ఎక్కడ కనబడలేదు! గత్యంతరం లేక గోడ దూకి లోపల ప్రవేశించాడు.

'ఎవరు నువ్వు?' సింహగర్జన లాంటి గద్దింపు వినబడింది. మరు క్షణంలోనే ఎదురుగుండా మకారిమో సాక్షాత్కరించాడు. అయినా హాయవాతా చలించలేదు:

'నాపేరు హాయవాతా!'

ఆ ప్రతి సమాధానం విన్నీవినగానే మకారిమో గుగ్గిలంచల్లిన అగ్గిలాగ భగ్గుమని మండిపడ్డాడు:

'నువ్వేనా మారుపేరుచెప్పి నా

రామయ్యగారికి ఎక్కడెక్కడి విషయాలు తెలుసు. కాని ఆయన సహజంగా సోమరిపోతు. మరి అలాంటప్పుడు అన్నివిషయాలు ఎలా తెలుసుకోగలిగాడా అని ఒక పెద్దమనిషికి సందేహంకలిగి ఆయన్నే అడిగేశాడు.

"అదా నీ సందేహం! మన దంతా శ్రుతపాండిత్యంనాయనా. బద్ధకించి మర్చి పోలేదంతే" రామయ్యగారు యదార్థం చెప్పేశారు.

పి. రామమోహన్ (కాకినాడ)

బాణాల రహస్యాలు కాజేసిన పరమ ద్రోహివి!'

'అవును ఆద్రోహిని నేనే!' హాయవాతా ఎక్కడ నదురుబెదురు లేకుండా సమాధానం చెప్పాడు.

'మరి ఏముఖం పెట్టుకుని మళ్ళీ ఇక్కడికి వచ్చావు? నీకిక జీవితం మీద ఆశలేదా?' నాబాణాల పాలబడి చనిపోవాలని అనుకుంటున్నావా?' లోలోపల పేరుకొన్న అక్కసుతో మునిపంటితో పెదవి కరచిపట్టి గట్టిగా గద్దించాడు మకారిమో! అయినా హాయవాతా ఎక్కడ చెక్కుచెదరలేదు!

'జీవించాలని ఆశతోనే నేనిక్కడికి వచ్చాను! అంతేకాదు. చేసిన తప్పు మన్నించమనికూడా కోరుకుంటున్నాను.'

'సరే, మన్నించానులే! మరి నా ఎదట నిలబడక పో!'

అంతలోనే వారి సంభాషణ విన్న మిన్నెహాహా అక్కడికి వచ్చింది. ఆమెవైపు చూడగానే హాయవాతా ముఖం వికసించింది!

'ఇంకొక్క కోరికకూడా కోరుకుంటున్నాను. దయఉంచి దీనికి కూడా మీరంగీకరించాలి. మిన్నెహాహాని నా రాజ్యాని కంతటికి రాణిని చెయ్యాలని నా కోరిక'

ఆ ప్రార్థన వినగానే మకారిమో తోకతొక్కిన తాచులా కస్సుమన్నాడు:

'గొప్ప వీరాధివీరుడికే మిన్నెహాహానిచ్చి వివాహం చెయ్యాలని నా అభిలాష! నీ వంటి మాయల మారి కటువంటి అర్హత లేదు! మారుమాటాడక తిన్నగా వచ్చిన దారినే వెళ్ళిపో!'

అయినా హాయవాతా అధైర్య పడలేదు:

'నేను శత్రు రాజ్యాలన్ని అవలీలగా జయించాను! అయినా మీరు వీరాధివీరుడనని అంగీకరించడం లేదు. ఇది న్యాయ్యమేదా?'

'నా బాణాల రహస్యాలతోనే వాళ్ళనందరిని జయించావు! ఇందులో నీ గొప్పతనం ఏమి ఉంది? శౌర్యం ఏమి ఉంది?'

హాయవాతా దాని కేవిధంగాను సమాధానం చెప్ప లేక రవంత సేపాలోచించి అన్నాడు:

'అయితే నా శౌర్యం, నేర్పు మీ రేవిధంగా పరీక్షించినా నేను సిద్ధమే!'

'పరీక్షలో నెగ్గకపోతే మరి మిన్నేహాహామాట తలపెట్టక, తల వంచుకొని ఓడిపోయానని అంగీకరించి, తిన్నగా వెనక్కి వెళ్ళిపోతావా?'

'అలాగే'

ఆపైన మకారియో కొంచెంసేపాలోచించి హాయవాతాని హెచ్చరించాడు:

'అదిగో ఆ కొండశిఖరంమీద మామిడిచెట్టు చిటారుకొమ్మలో ఒక మామిడిపండు వేళ్లాడుతూంది. చూశావా! మనమిద్దరం ఒకేక్షణంలో దానికోసం పరుగుపందెం ప్రారంభిద్దాము. నువ్వే కనక మున్ముందుగా ఆ మామిడిపండు కోసి మిన్నేహాహా కివ్వగలిగితే, ఆమెను వివాహం చేసుకోవచ్చును. లేకపోతే తలవంచుకుని గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోవలసిందే! ఇదే నా పరీక్ష! దీని కంగీకరిస్తావా?'

మకారియో ఏదో మెలికపెట్టి మాట్లాడుతున్నాడని హాయవాతా గ్రహించుకున్నాడు. కాని మరి గత్యంతరం లేకపోయింది. మారు మాటాడక అలాగే అని అంగీకరించాడు. పాపం మిన్నేహాహా వారి సంభాషణ విని ఉసూరుమని నిట్టూర్చి నేలమీద కూలబడింది. అయినా హాయవాతా అధైర్యపడలేదు. ఒకటి, రెండు, మూడు అని మకారియో పరుగుపందెం ప్రారంభించాడు. హాయవాతా పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ మున్ముందుగా తానే ఆ చెట్టుమొదటికి వెళ్ళిపోయాడు. కాని చెట్టుమీది కెక్కడంలో మకారియోదే పైచెయ్యి అయింది! హాయవాతా ఎంతగా గిజగిజలాడినా ఆ పండు అందుకోలేకపోయాడు! మకారియో అది పుటుక్కున కోసి తన అంగీజేబులో పెట్టుకున్నాడు. హాయవాతా ఇంకా చెట్టుమీది కెగబాకుతూనే ఉన్నాడు. కాని మకారియో మున్ముందుగా మామిడిపండు కోసినసంగతి కనిపెట్టి ఎంతో ఖిన్నుడై తలవంచుకొన్నాడు.

ఇద్దరు తిరిగి చెట్టుమీదనించి కిందికి దిగివస్తున్న సమయంలో

పెళ్లి అయిన కొత్తలో అతడూ ఆమె కాశ్మీర్ వెళ్ళి ఒక హోటలులో బసచేశారు. పక్కగదిలో ఇద్దరు యువకులు ఉంటున్నారు.

"ఓహ్! నువ్వు నిజంగా అప్సరస ఉన్నావంటే నమ్ము. ఢిల్లీ వెళ్లాక శిల్పిని పిలిపించి నీ విగ్రహం చేయిస్తా" ఆ రాత్రి భర్త ఆమెను ఉబ్బేశాడు.

రెండు నిముషాలయ్యాక ఎవరో తలుపుతడితే అతడు వెళ్ళి తలుపు తీశాడు.

"ఎవరు మీరు?"

"మరండీ... మేమిద్దరం ఢిల్లీ నుంచి వచ్చిన శిల్పులం" వాళ్లు నీళ్లు నమిలారు.

శకుంతులాదేవి (తెనాలి)

మకారియో హాయవాతాని ఎందుకు పనికిరానివాడికింద జమకట్టి నేళాకోళం చేసి వెక్కిరించాడు. పాపం హాయవాతా ఆ అవహేళన భరించలేక మరింతగా తలవంచుకొన్నాడు. క్రమక్రమంగా వాళ్ళిద్దరు ఉద్యానవనం సింహద్వారం సమీపించారు.

మిన్నేహాహా హాయవాతా ధోరణి కనిపెట్టి చిత్తుగా ఓడిపోయాడని నిశ్చయించి చెక్కిళ్ళమీద ప్రవహిస్తున్న వేడివేడి కన్నీటితో వెక్కి వెక్కి ఏడుస్తూంది. మరుక్షణంలోనే హాయవాతా ఒక్కపరుగులో ఆ మామిడిపండు తీసుకువెళ్లి మిన్నేహాహా చేతిలో పెట్టి గట్టిగా మూశాడు.

మకారియో తన కళ్లే నమ్మలేక జేబు తడుముకున్నాడు. దానిలో మామిడిపండు లేదు!

'మీరు పరధ్యాన్నంగా నడక సాగిస్తున్నారు. అంతలోనే ఆ మామిడిపండు మీ అంగీజేబులోనించి తీసి మిన్నేహాహా చేతిలో పెట్టాను! మున్ముందుగా మీరే ఆపండు కోసినా మొట్టమొదట మిన్నేహాహా చేతిలో ఉంచినవాణ్ణి నేనే! కనక నియమంప్రకారం నేనే నెగ్గాను!' అన్నాడు హాయవాతా. 'అమ్మ! మాయలమారీ! ఎంతపనిచేశావు? గుండెలు తీసిన బంటువు నువ్వే! ఏది ఏమయితేనేం చిట్టచివరికి నెగ్గినవాడవు నీవే!' అన్నాడు మకారియో!

ఆ సంభాషణ వినగానే మిన్నేహాహాముఖం మళ్ళీ తామరపువ్వులా వికసించింది. మరికొన్నాళ్లు గడిచిన తరవాత మిన్నేహాహా హాయవాతాలకిద్దరికీ ఎంతో వైభవంగా వివాహం జరిగింది. ఇంకాకొంత కాలం గడచినతరవాత పడమటిగాలి బాగా పెద్దవాడయినాడు. ఆపైన అతని రాజ్యం కూడ హాయవాతాకి సంక్రమించింది. అతనివైభవం చూచి ఆ రాజ్య ప్రజలందరు హాయవాతా 'ఎంతటిఅద్భుతవ్యక్తి!' అనుకుని మనస్సులో అతని కనేక నమస్కారాలర్పించారు.

అయిపోయింది

"నేనంకాదులెండి—ఎన్. టి. రామారావు ఆపాత్ర ధరించినది. సి. పుల్లయ్య దర్శకత్వంలో."

ఇంతలోనే వాళ్ళొచ్చారు. సలహాదారు సిగరెట్టు పీలుస్తూ—మెడ బెణికినవాడల్లే—దాన్ని ఎటూ తిప్పకుండా, నిటారుగా పెట్టి—సిగరెట్టు పీలుస్తూ—స్లో మోషన్‌లో వచ్చాడు.

"రా, రా—ఈళ్లే. మావోడు గుమ్మంలోనే ఎదురైనాడు. ఈనే దర్శకుడు—ఈనే మావోడు. ఈడు సిన్నోడు. మనోడేలే." అన్నాడు నిర్మాత.

సలహాదారు నాకేసి, కొత్తగా సినిమాల్లోకి చేరబోతోన్నవాడివేపు దర్శకుడు చూసినట్టు చూశాడు—"యూ ఆర్ మహాశయ్ .... " అని తల తాటించాడు—ఫలానావేపు చూస్తూ.

"హి ఈజ్ దీ సార్" అన్నాడు ఫలానా, నావేపు చూపిస్తూ.

"యస్" అన్నాను నేను.

'ఐసీ" అన్నాడు సలహాదారు.

"ఏందయ్యోవ్—తెలుగు సినేమాయ్యా మనం తీసేది—ఇంగ్లీషు అవండి .... ఏందయ్యా, కత కట్టినారా ?" అన్నాడు నిర్మాత చుట్ట వెలిగిస్తూ.

"నాలుగు కతలు కట్టాంగాని గురువుగారూ—నచ్చక విప్పి పారేశాం" అన్నాడు ఫలానా.

"పారేయటం ఎందుకురా—ఉంచుకుంటే ఎట్టాగోట్టా పనికిరాకపోద్దా ?"

చిత్రభేదము

15-వ పేజీ తరువాయి

"వాట్ వాజ్ యువర్ ప్రీవియస్ పిక్చర్ ?" అన్నాడు, రోగిని రోగంగురించి ప్రశ్నించిన డాక్టరులా మొహం పెడూనూ, ఆ సలహాదారు. చెప్పాను.

"అట్టర్ ఫ్లాప్ ఐ సపోజ్"

"అఫ్ కోర్స్."

"సలహా ! ఇంకాపి, తెలుగులో కానిండయ్యా—ఆ కతేటో నాకూ అరదమవుద్ది."

"ఇంకా కథలోకి రాలేదులెండి—ఉపోద్ఘాతంలో ఉన్నాం. సరే— నాకో ఫ్రెండున్నాడు. తెరమీద రచయితగా ఇంతవరకూ పేరుపడలేదుగాని—జీనియస్. చాలామంది పెద్ద రచయితలకి దోస్తుగా ఉండేవాడు. అతనికి కబురు చేస్తాను" అని, సలహా, టేబిలుమీద ఉన్న నిర్మాతగారి టార్చిబ్యాటరీ లైటు ఎత్తాడు—ఫోను ఎత్తినట్టు.

"నన్నెల్లమంటావా ?" అని లేచాడు నిర్మాత.

"నో, నో, ఐ మస్టు గో—పైగా, ఇప్పు డతను మనకు దొరకడు. ఏ రచయితనో 'దయ్యం' లా పట్టుకొని ఉండిఉంటాడు.—డబ్బుకోసం ! రేపు పొద్దున్నే తీసుకొస్తాను." అని లేచాడు సలహా.

"కాఫీ తీసుకొని పోతావేటి సలహా" అన్నాడు నిర్మాత.

"ఎందుకులెండి, బయట ఎక్కడన్నా .... సరే ! తెప్పించండి " అని కూర్చున్నాడు. నిర్మాత కాఫీ తెప్పించాడు. నలుగురం తాగాము.

ఆ మర్నాడు ఉదయం కలిశాం. రాత్రి నేను నిర్మాత రూములోనే తిని, అక్కడే నిద్రపోయాను. పాపం, ఫలానా పదకొండింటిదాకా ఉండి, వాడి రూముకు పోయాడు. తొమ్మిది గంటలకల్లా సలహాదారు, రచయితను తీసుకొచ్చాడు. అతను యువకుడు—ఐతే, కాస్త వయసుమీరినవాడల్లే కనిపించాడు—దిగుళ్లవల్ల.

"ఊఁ— కతగానీ" అన్నాడు నిర్మాత, చుట్ట ముట్టించి—తిరిగ్గా మంచంమీద వాలి.

"కథ అంటే ఏం కథ కావాలి ? సాంఘికమా, జానపదమా, పురాణమా, చరిత్రాత్మకమా, బెంగాలీవా ?" అని అడిగాడు రచయిత.

"బెంగాలీ" అన్నాడు ఫలానా చటుక్కున.

"అదయితే ఢోకా ఉండదు. ఢంకా బజా యించవచ్చు" అన్నాడు సలహా.

"ఓ యస్—ష్యూర్" అన్నాను నేను.

ఇంతలో నిర్మాత లేచాడు—"ఏందయ్యా, తెలుగు కాదటయ్యా మనం తీసేది ?" అన్నాడు, ఆశ్చర్యంగా





చిత్రభేదము

"తెలుగే. కథమాత్రం బెంగాలీనుంచి తీసుకుంటాం. మాటలూ, పాటలూ అన్నీ తెలుగులోనే ఉంటాయి" అన్నాను నేను.

"అట్ట చెప్పు" అని మళ్లీ వాలిపోయాడు నిర్మాత.

రచయిత పెద్ద కాయితాల బొత్తి విప్పుతూ ఉండగా నేను అడిగాను—

"మీకు బెంగాలీ వచ్చునా ఏమిటండీ ?"

"నో. రాదు. నాకు ఓ మిత్రుడు—తెలుగు అతనే కలకత్తాలో ఉన్నాడు. అతనికి బెంగాలీ బాగా వచ్చును. అతను అక్కడ ప్రతి బెంగాలీ చిత్రమూ చూసి, ఎప్పటికప్పుడు 'కథ' అంతా నాకు రాసి పంపేస్తూ ఉంటాడు. అందులో నాకు నచ్చినవాటిని, వేరేగా ఉంచుతూ ఉంటాను. మిగతావికూడా ఉంటాయి.— ఇది చాలా పెద్ద రహస్యం సుమండీ—ఇంకెక్కడా అనకండి. అన్నారంటే బెంగాలీవాళ్లకూ మనకూ చిత్ర భేదాభిప్రాయాలు వచ్చేస్తాయి. అఫ్‌కోర్స్—వాళ్ల చిత్రాన్ని మనం తీసుకున్నా—దానికీ, మన చిత్రానికీ కావలసినంత చిత్రభేదం ఉంటుం దనుకోండి. ఐతే, ఈ కథల్లో మీ కే కథ నచ్చినా సరే—మనం డైరెక్టుగా వాళ్లకు రాసి, రైట్స్ కొనుక్కోవటం ముఖ్యం" అన్నాడు రచయిత.

"అద్దీ" అన్నాడు సలహా.

"ఐతే ఎందుకులేవయ్యా—నీదగ్గర్లేవా నువ్వు కట్టిన కథలు—"

"నేను కట్టిన కథలూ ఉన్నాయి—'నా కట్టు కథలు' అనే అముద్రితగ్రంథంలో. ఐతే అవి మీకు నచ్చవు. సత్యజిత్‌రాయ్ కోసం అట్టే పెట్టిన సబ్జెక్టులు."

"ఏందయ్యా సలహా—ఇలాంటోడిని లాక్కొచ్చివావూ ?" అన్నాడు నిర్మాత చిరాగ్గా.

"చిరాకులూ, పరాకులూ చిత్రసీమయందు పనికిరావు. బెంగాలీకథ అంటే దానికున్న వాల్యూ వేరు—తెలుగుకథ ఎప్పుడైనా తెలుక్కదే !" అన్నాడు సలహా.

"మనది బెంగాలీ కథకు అనుసరణ అనో, మక్కీ అనో పబ్లిసిటీ చేయించా మనుకోండి—దాని మజా మా మజాగా ఉంటుందిలెండి—గురూగారూ" అన్నాడు ఫలానా.

నిర్మాత కాస్సేపు ఆలోచించి—"అయితే, ఓటి సేద్దాం. మన కతనే మనం తీసుకుందాం. తెలుగు కతే ననుకోండి. ఐతే, బెంగాలీ అని ఏయించి పారేదాం" అన్నాడు.

"వ్హాట్ బ్రిలియంట్ ఐడియా ! ఇండస్ట్రీలో ఉండవలసినవారు" అని మెచ్చుకున్నాడు సలహా.

"జూసినా—సలహాలోడికే సలహాలిచ్చేపాటివాడినైనాను" అని తనను మెచ్చుకున్నాడు నిర్మాత.

"పోనీ జానపదం ఐతే ?" అన్నాను నేను.

"అదొద్దులేవయ్యా—మనం ఎక్కడ ఏస్తాం— మేడలూ, మిద్దెలూనూ. సాంగికమే చూడండి సులువులో పోతాది. కాదూ లేదూ అంటే, పల్లెటూరు పెట్టినారా—మా ఊల్లో కొట్టిపారేద్దాం'

"పౌరాణికం ?" అన్నాడు ఫలానా.

"పౌరాణికం పర్వాలేదుగాని—పల్లకీటాలూ తేవాద్దా ?"

"అవి అద్దెకు తెచ్చుకుందాం."

"అద్దెమాత్రం ఇయ్యొద్దా అని."

"సరేగానిండి — మహాభారతం తీసుకోవచ్చునండీ—యూనివర్సల్ సబ్జక్టు—సేఫ్‌టీనూ" అన్నాను నేను.

"ఏ టీ, కాఫీ ఎవడి గ్గావాలయ్యా—ఇదిగో సూడూ—డబ్బులు రాలేది ఆటికే. అయితే, ఆళ్లకా యిగ్గులూ, చెవికీ కోట్లూ తేపోతే—నాసామిరంగా ఒక్కడు సూడ్డు. ఐనా సవకల్సిన ఏరపాటు సెయ్యండి—సూదాం."

"ఐతే భారతం తీసుకుందాం" అన్నాను నేను.

"నోనో—మనవాళ్ళు ట్రాజడీలు లైక్ చెయ్యరు మహాభారటా ఈజ్ ట్రాజడీ" అన్నాడు సలహా.

"దెన్ ?" అన్నాడు ఫలానా.

"అవునయ్యా—ఇంతంత గొప్పవాళ్లా చివరకు దిక్కుమాలిన చావులు చచ్చారు—యక్కడి దగ్గర. ఇంత కృష్ణుడూ ఎరుకలవాడిచేతిలో చచ్చాడు ! వాటీజ్ ఆల్ దిస్ ? అంత గ్రేటెస్టు వారియర్సూ—వాళ్ల కీగతా—అసలు ఆ భారతంలో ఉన్న లోపమే అది. చూడండి కవిగారు కాస్త దాన్ని ఆవిధంగా కాకుండా, ఎండింగులో అందరూ హాపీగా కలుసుకున్నట్టు చెయ్యగలిగారా—ధన్యులమే !" అన్నాడు సలహా.

చిత్రభేదము

"అదేట్లాగండీ—ఉన్న కథ గదా అది." అన్నాడు రచయిత.

"ఊరుకోండీ—ఉన్నకథను ఎవడండీ ఉన్న దున్నట్టు తీస్తున్నాడూ ? మనం మారుస్తాం... మన యిష్టం!" అన్నాడు సలహా.

ఎవరూ మాట్లాడలేదు. మళ్లీ అతనే అన్నాడు—

"ఈమధ్య ఇట్లాగే—ఒకాయన లైలామజ్నూ తీస్తానన్నాడు. తీస్తే తీశావుగాని—చివరకు వాళ్లి ద్దర్నీ చంపకు—కలిపి పారేయ్. ఎడారీ అదీ ఉంచు—అయితే చివరికొచ్చేసరికి, ఇద్దరూ కలిసి ఒక్కట్టై పోవాలి—అంటే, ఎన్ని గాలివాన లొచ్చినా సరే, నిర్మలప్రేమ జయిస్తుంది అని నీతిగాని—చస్తే ఏముందయ్యా—అని చెప్పాను. ట్రాజిడీలు మనవాళ్లు నచ్చరు—ఇదే నా పాయింటు" అన్నాడు సలహా ఉద్రేకంగా,చేత్తో టేబులుమీద బాదేస్తూ.

"ఐతే సాంఘికం కానిద్దామా ?" అన్నాను నేను.

"అదేం మంసిది లేవయ్యా—ఏదేనా అటూ యిటూ అయినా, సద్దుకుపోద్ది" అన్నాడు నిర్మాత.

"యస్. యూ మే నేరేట్ ది స్టోరీ" అన్నాడు సలహా.

నిర్మాత కేసి చూశాడు.

"ఏంలేదు, కథ మొదలెట్టమంటున్నారు, కవి గారిని" అన్నాను నేను.

"ఆహా—కానీ."

"కానీ అంటే అదే కానీవే మరి. దానికోస మేగా ఈ అవస్థలూ. మరి నాకు ఏమిస్తారో, ఏంచేస్తారో ముందే అనుకోకపోతే ఎట్లా ?" అన్నాడు రచయిత.

"నూదాంలేవయ్యా—అన్నట్టు నీపేరేందయ్యా —తెలీక అడిగాను."

"దైన్య శ్రీ" అన్నాడు రచయిత.

"ఇదేందయ్యా—ఇదీ బెంగాలీయేనా ?" అన్నాడు నిర్మాత.

"కాదండీ, నా కలం పేరు."

"ఇదేందయ్యా—నీ కలం పేరు అదేదీ—పయి లటూ, పారకరూ గాదయ్యా ?" అని నిర్మాత ఆశ్చర్యపోతూ "ఇదేదో కొత్తకంపెనీ పేరులా ఉంది" అన్నాడు.

మేం కొద్దిగా నవ్వాము.

"అది కాదండీ—నా మారు పేరు. రాసే టప్పుడు ఈ పేరుతో రాస్తాను."

"అట్ట జెప్పు" అన్నాడు నిర్మాత.

"మరి నా మాట ...." అన్నాడు కవి.

"అది తర్వాత తేల్చుకుందాంలే—ముందు కథ చెప్పు" అన్నాడు సలహా.

"సారీ—ముఖ్యంగా, అసలు ఎక్కడైనా, అందులో ఈ పరిశ్రమలో ముందుగా డబ్బు మాట్లాడుకునిగాని పనికి ఒప్పుకోరాదు. ఈ విషయమ్మై మీకు ఓ కథ చెబుతా వినండి."

(సశేషం)

జయంతి

13-వ పేజీ తరువాయి

తెలుసుకోవటం నేర్చుకున్నది. బాగా తమిళం నేర్చుకున్నది. 'స్వర్ణమంజరి' తమిళప్రతిలోనూ ఆమె పాత్రను ఆమె ధరిస్తున్నది. ఇందులో నాయకుడు—జెమినీగణేశన్. వార్తాపత్రికలు చూడటం, రాజకీయాలు తెలుసుకోటం కూడా ఆమెకు అలవాటు. దేశాలూ, రాజ్యాలూ, ప్రపంచమూ ఏ ఏ పరిస్థితులలో ఉన్నాయో, ఆమె ఎప్పటికప్పుడు చెప్పగలదు.

జయంతికి చక్కదనమూ, వాచ, భావప్రకటనా ఉన్నాయి. ఏక్షణాన ఆమె పెద్దతారల లిస్టులోకి వెళ్ళిపోయినా, మనం ఆశ్చర్యపడాల్సింది ఏమీలేదు. ఆమెకు దైవభక్తి ఉన్నది.

కత్తిసాముకూడా ఆమెకు బాగా తెలుసును. బాగా ఈత కొడుతుంది. ఈ రెండు విద్యలూ రోజూ ఇంకా సాధిస్తూనే ఉన్నది.


జయంతి చప్పున పైకివచ్చిన తారలలో ఒకతె. దీనికి నిదర్శనాలు అదృష్టంవంటివికూడా, శక్తిసామర్థ్యాలూ, గ్లామరూనూ. ఇట్లా పైకి రావటానికి కలిసివచ్చిన అదృష్టం ఎక్కడంటే—పెద్ద తారలపక్కన వటటం! ఎంత శక్తి, సామర్థ్యలున్నా నటిగా పైకి రావటానికి, పెద్దతారలమధ్య నటించటం, పెద్ద దర్శకులవద్ద నటించడం చాలా ముఖ్యమని ఆమె నమ్మకం!

ఆమె తరచు రేడియో నాటకాలలో పాల్గొంటూ ఉంటుంది. "నేను ఎంత పెద్దతారనైనా తీరుబడి కలగకపోయినాసరే, తీరిక ఎట్లాగయినా చేసుకుని, రేడియోనాటకాల్లో పాల్గొంటాను. చదువుకుంటాను. ఇంకా నేర్చుకుంటాను. పెద్దవారి అడుగుజాడల్లోనే ఎప్పుడూ ఉంటాను" అంటుంది ఆమె.

జయంతి ప్రస్తుతం 'స్వర్ణమంజరి' (తెలుగు, తమిళం) 'మదనకామరాజు' 'విష్ణుమాయ' మొదలైన చిత్రాలలో నటిస్తున్నది. జయంతికి పిల్లలతో ఆడుకోవటం సరదా—వాళ్ళతోనూ, బొమ్మలతోనూ ఆమె వీలైనప్పుడల్లా కాలక్షేపం చేస్తూ ఉంటుంది. తరచు ఆమె ఇంగ్లీషు చిత్రాలు చూస్తుంది. "అందులో నాకు జెర్రీ లూయిస్ చిత్రం అంటే వెర్రి!" అన్నదామె, ముత్యాలు వెదజల్లినట్లు ఫక్కుమని నవ్వి!

★

[సుకుమార్]



శేషశాయి బ్రదర్స్ డైరెక్టర్ శ్రీ హెచ్. కె. రామస్వామిగారి కుమార్తె శ్రీమతి ప్రవిగాల యం.బి.బి.ఎస్. డి. సి. హెచ్. (టి. వి. ఎస్. సంస్థ ఆస్పత్రులలో మెడికల్ ఆఫీసర్)ను శ్రీ జె. ఎస్. సోమయాజులు (రిటైర్డ్ డిప్యూటి చీఫ్ ఇంజనీర్ యం. ఎస్. యం.) గారి కుమారుడైన శ్రీ జె. ఎస్. రామమూర్తి (భిలైలో ఇంజనీరు) కి మద్రాసులో 22-6-62 న వివాహం చేశారు.

లేడీస్ క్లబ్బు

9-వ పేజీ తరువాయి

అని అడిగినప్పుడు మీరు ఆమెకళ్లలో ఏవేవో లోకాలు ఊహించుకుంటూ, మైమరిచి "ఓ! తప్పకుండా!" అనేశారో—కొంప మునిగిందన్నమాటే! ఎందుకంటారా? అయితే ఇది వినండి. ముందే జాగ్రత్తపడండి.

అసలిదంతా ఎలా ప్రారంభమైందంటే, ఒకనాడు మేమిద్దరం సరదాగా ఏవో మాట్లాడుకుంటూ, ప్రమాదవశాత్తూ పుస్తకాల గురించి ఏదో విమర్శ చేసుకున్నాం. కొందరు పుస్తకాలు వెర్రిగా చదువుతారు—పాపం! వాళ్లకు ప్రపంచం సంగతి ఏమీ తెలియదన్నాను. కమలకా మాట నచ్చలేదు. పుస్తకాలు చదవడం చాలా మంచి అలవాటుట! పుస్తకాల్ని మనుషులు ఎలా ద్వేషిస్తారో తెలియదుట తనకి! అని ఇలా పుస్తకాలగురించి మాట్లాడుతూ నేనేం పుస్తకాలు చదివేనో చెప్పమంది. నేను ఏమీ చదవలేదనీ, చిన్నప్పుడెప్పుడో 'గులాబీ ముళ్లు' అన్న కథ చదివాననీ నా ఉద్దేశంలో అది అంత బాగులేదనీ చెప్పాను. దాంతో కమల నా అజ్ఞానానికి విస్తుపోయి, మన తెనుగుసాహిత్యం ఎంత గొప్పదో, అందులో ఏ యే రచయితలు ఏ యే గ్రంథాలు రాశారో చెప్పసాగింది. అన్నట్టు చెప్పడం మరచాను. కమల తెలుగు లిటరేచర్ తో—ఆనర్సు—క్లాసులో పాసయింది. రెండుగంటలు తెలుగు సాహిత్య సింహావలోకనం చేశాక నేను వెంటనే కొన్ని పుస్తకాలు చదవాలని ఆర్డరు వేసింది.

ఆమె వరుసగా కొన్ని పుస్తకాలూ, పత్రికలూ నాకోసం తెచ్చి చదవమంటూండేది. ఆమెను సంతోష పరుద్దామనే ఉద్దేశంతో అవి చదివినట్లు నటిస్తూండేవాడిని. కాని, మనకి పుస్తకాలంటే చిన్నప్పటి నుంచీ ఆముదంతో సమానం. పరీక్షలముందు కళ్లు మూసుకుని ఏదో ఆముదం తాగినట్లు తాగేవాణ్ని. పరీక్షల తరువాత మరి వాటి ప్రసక్తి తెచ్చేవాణ్ణేకాదు. అలాటి నాకు,కమల వరుసగా పుస్తకాలు తెచ్చివ్వడమేకాక, వాటిమీద నా అభిప్రాయాలు కూడా అడగడం మరీ ఘోరమనిపించేది. అయినా ఏం చేస్తాం.......?

"ఏలాగుందండీ ఆ "రాగమయి" అన్న పుస్తకం" అని, గోముగా, ప్రేమగా అడిగేది. ఆమె అలా అడిగినప్పుడు ఎంతో అందంగా కన్పిస్తుంది.

"చాలా బాగుంది" అని అనేవాణ్ణి. అంతటితో సంభాషణ ఆగిపోతే బాగుణ్ను. అబ్బే! మా కమల సంగతి మీ రెరుగరు.

"ఆ పుస్తకంలో మీకు నచ్చిన విషయమేమిటి?" అని ప్రశ్నార్థకంగా అడిగేది. నిజానికి ఆ పుస్తకం నేను చదవనేలేదు.

"ఆ......ఏముంది. అసలు అలా రాయడం చాలా కష్టం. ఒకవేళ రాసినా, అచ్చొత్తించడం మరీ కష్టం. అచ్చొత్తించినా ఎవరైనా కొనడం చాలా కష్టం. ఒకవేళ కొన్నా....."

"చదవడం మరీ కష్టం! ఏం అంతేనా? అసలు మీరు చదవడం చాలా కష్టం అని ముందే నాకు తెలుసు. మీ కెప్పుడూ క్లబ్బూ, పేకాటా, టెన్నిసూ తప్ప, సాహిత్యం, కళా, కల్చర్ మొదలైన విషయాలు అక్కర్లేదు. పోనీలెండి. ఇవన్నీ చదవమని మీ సమయం వృథా చేస్తున్నాను. ఇంక వాటిగురించి అడగకులెండి" అని కోపంగా, బుంగమూతి పెట్టేది. ఆమె అలా మొహంపెడితే ఇక నా అవస్థ ఎలా ఉంటుందో చూసుకోండి.

"కమలా, ప్లీజ్. నే చెప్పేది విను....." అని ఇంకా ఇంకా అదే ధోరణిలో—(ఆ ధోరణి మీకు తెలిసిందేగా) ప్రతిమాలగా ఆమెకోపం తగ్గేది. కానీ, తప్పకుండా మళ్ళీ చదువుతాననీ, కల్చర్ అభివృద్ధిచేసుకోవాలని నాకు చాలా కుతూహలంగా ఉందనీ, అసలు 'ఆర్టు', నా 'హార్టు'మీద చెరగని ముద్ర వేసిందనీ, ఇలా ఎన్నో మాటలుచెప్పి, ఆమెను నవ్వించి, కవ్వించి, ఆమె కోపాన్ని కరగించేసరికి తాతలు దిగొచ్చేవారు. అంత శ్రమపడ్డాక ఆమె, "మీరు లెక్చర్లివ్వడానికి చాలా బాగా పనికొస్తారు" అని, చిరునవ్వు నవ్వుతూ, కన్నులు తమాషాగా తిప్పుతూ అంటూంటే, నాకు చాలా మధురంగా ఉండేది.

మధురంగా వుంది అనగానే ఎవరో ఒక రచయిత అన్నట్టు 'మధురమైన మనగీతికలన్నీమన విషాదభావాలు గూర్చి చెప్పేవే!' అన్న వాక్యం జ్ఞాపకమొస్తుంది. సరాగంలోంచి విషాదంలోకి ఎందుకు వెళ్ళానంటే— నా పని సరిగ్గా అలాగే జరిగింది!

ఒకనాడు కమల, "నిజంగానే మీరు లెక్చర్లిస్తే చాలా బావుంటుందండీ, ప్రయత్నించకూడదండీ" అంది.

"ప్రయత్నించవచ్చుగానీ, వినడానికి ఎవరూ ఉండరేమోనని నా భయం" అన్నాను.

"ఎందుకుండరూ! మీ పర్సనాలిటీ, మీ వాగ్ధాటీ, జనాన్ని ఇట్టే ఆకర్షించి నిలబెట్టగలవు" అంది కమల.

"ఆడియన్సు అల్లరిచేసి, చప్పట్లు కొట్టచ్చు. పాత చెప్పుల షాపొకటి పెట్టుకోమని కొన్నిటిని సప్లై చెయ్యొచ్చు. ఇంకా......"

"ఏమీ చెయ్యరు. మీ రొక్కసారి లెక్చరిచ్చి చూడండి. మీ కాస్మోపాలిటన్ క్లబ్బులో అనేక మీటింగులు జరుగుతాయికదా, వాటిలో మీరు మాట్లాడకూడదూ?"

"అబ్బే! క్రిందటిసారి వార్షికోత్సవం జరిగినప్పుడు టెన్నిస్‌లో ప్రైజు తీసుకుందామని స్టేజి ఎక్కేసరికి, ఆ జనాన్నంతా చూసేసరికి కాళ్ళు వణికాయి. లెక్చర్లివ్వడం సామాన్యవిషయం కాదు."

"ఫరవాలేదండీ. ఒక్కసారి ప్రయత్నించండి. మా లేడీస్ క్లబ్బు వార్షికోత్సవానికి అధ్యక్షులుగా ఎవర్ని పిలవాలా అని ఆలోచిస్తున్నాం. సెక్రటరీ సరళాదేవితో చెప్పి, మిమ్మల్ని పిలిపిస్తాను. ముందుగా తగిన జాగ్రత్తలన్నీ తీసుకున్నారంటే బ్రహ్మాండమైన లెక్చరివ్వచ్చు. అప్పుడు మీరు స్టేజిమీద లెక్చరిస్తూంటే ఆడియన్సులో కూచోని, మిమ్మల్ని

చూస్తూంటే నాకు చాలా సరదాగా ఉంటుంది."

"ఆ! ఆడవాళ్ల క్లబ్బులోనా......" అని నా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చగానే, ఆమె తన సలహా చాలా గొప్పదనే అభిప్రాయంతో "అవునండీ. అంతా పెద్దమనుష్యుల భార్యలూ, చదువూ, సంస్కారమూ కలిగిన స్త్రీ లవడంచేత మీ కేలాంటి ఇబ్బందీ ఉండదు. పైగా మీ భావాలన్నీ వాళ్ళు ఎంతో మెచ్చుకుంటారు. నిజంగా చాలా బాగుంటుంది. తప్పకుండా ఇస్తారుకదూ" అని నా గడ్డం పట్టుకుని ఆమె అడుగుతూంటే నాకు వచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టయింది.

"అసలు నాకు తీరికేదీ" అని అనబోతూంటే ఆమె "తక్కిన విషయాలన్నీ నేను చూసుకుంటానుగా. మీరు ఆవాళ సాయంకాలం ఒకగంటసేపు మాకోసం వ్యయపర్చాలి. ఒప్పుకుంటారుకదూ—ఊఁ కదూ" అని ఆమె నా కళ్లల్లోకి ఆశగా చూస్తూ, ఆత్రంగా అడుగుతూంటే ఎలా కాదనడం?

భార్యల కోరికలు తీర్చడంకోసం ఘనమైన కార్యాలు చేసిన మహావీరులంతా జ్ఞాపకానికి వచ్చారు. కృష్ణుడు కాబోలు అదేదో పువ్వు ఎక్కడినుంచో తెచ్చాడు. అలాగే మరోపువ్వు మరోచోటనుంచి భీముడు తీసుకొచ్చి ఇచ్చాడు. కానీ వాళ్లెవ్వరైనా "లేడీస్ క్లబ్బు"లో ఉపన్యాసమివ్వమంటే ఏమనేవారో?—అది వేరే విషయం అనుకోండి. అసలు మా కమల ఏదైనా పువ్వు తీసుకురమ్మనిఉంటే, మూడు నిముషాల్లో తెచ్చివుండేవాణ్ణి. కానీ—ఈ అత్యంత క్లిష్టకార్యం సాధించడ మెలా?—అయినా తప్పదు! ఎందుకంటే కమల కళ్లల్లో ఆత్రుత, 'క్రిటికల్ పాయింటు' అందుకుంది. ఇప్పుడు కాదన్నానో!......ఎందుకులెండి!

"అలాగే!" అన్నా. వెంటనే ఆమె మొహంలో ఒక మాత్ర కాంతి ఉదయించింది. తరువాత, సాంఘిక సినిమాలో ప్రేమికులమధ్య నడిచే కొన్ని ఘట్టాలు మామధ్య నడిచాయి.

ఆవాళ సాయంకాలం క్లబ్బునుంచి వస్తూంటే, పరిస్థితి నే నూహించినంత అధ్వాన్నంగా లేదేమో ననిపించింది. ఎందుకంటే, 'తక్కిన విషయాలన్నీ' తనే చూసుకుంటానని కమల హామీ ఇచ్చింది. నే చేయవలసిన పనల్లా, ఆవాళ సాయంకాలం లెక్చరివ్వటమేనూ. కొంత చికాకుగావున్నా ఫరవాలేదనిపించింది.

ఇంటికి రాగానే, "అంతా సిద్ధమైపోయింది. సరళాదేవి చాలా సంతోషించింది. మా క్లబ్బులో మెంబర్లంతా మీ ఉపన్యాసంకోసం ఎదురు చూస్తున్నారు. మీ ఉపన్యాసం అద్భుతంగా ఉంటుందనుకొంటున్నారు. ఇక మీరు వెంటనే "ప్రిపరేషన్" ప్రారంభించండి" అని కమల ఉత్సాహంతో చెప్పేసింది.

"ఆ! 'ప్రిపరేషన్' కేముందీ. నాలుగు పాయింట్లు చెప్పావంటే చాలు. ఎలాగో ఒక ఉపన్యాసం దంచేస్తా" అన్నా, అసలు ఉపన్యాసాలివ్వటం ఉగ్గుపాలతో అబ్బినట్లు.

"అసలు ఈ ఉపన్యాసం విజయవంతంగా జరగడానికి కావలసిన జాగ్రత్తలన్నీ నేను తీసుకుంటాను.

ప్రతివారం ఆంధ్ర దేశమంతటా లక్షలమంది ఆంధ్ర సచిత్ర వారపత్రికను చదివి ఆనందిస్తూ ఉంటారు. మీ స్థానిక ఏజెంటు ద్వారా చందాదారులయితే మీ కాపీ మీకు వారం వారం నిశ్చయంగా చేరగలదు.

లేడీస్ క్లబ్బు

మీరు నే చెప్పినదల్లా శ్రద్ధగా పాటిస్తే చాలు. వచ్చే ఆదివారమే మా వార్షికోత్సవం. ఆట్టే టైము లేదు. వెంటనే శ్రద్ధవహించాలి."

నేను చిన్న చిరునవ్వు నవ్వాను. అందులో చాలా అర్థం ఉంది. 'ఓసి అమాయకురాలా! ఎందు కనవసరంగా కంగారు పడతావ్! అన్నిటికీ నేనున్నాను!' అని చెప్పేనంత అర్థంఉన్నా, ఆ చిరునవ్వు కమలమీద పనిచెయ్యలేదు. ఆమె నన్ను భోజనానికి లెమ్మని చెప్పి, తనగదిలోకి వెళ్ళిపోయింది.

తీరా భోజనందగ్గర కూర్చున్నాక, కమల తీసుకొంటున్న జాగ్రత్తలన్నీ తెలిసొచ్చాయి. 'ఇదేమిటి? మంచినీళ్లు వేడిగా ఉన్నాయి?"

"ఇవాళనుంచి మీరు వేడి మంచినీళ్లు త్రాగాలి. చన్నీళ్లు త్రాగితే శైత్యంచేసి, గొంతుక మూసుకుపోతుంది" అంది కమల. నాకు కొంచెం కష్టంగా వున్నా, ఆమె చెప్పినదీ నిజమేననిపించింది.

"ఆవకాయ వెయ్యలేదేం?"

"ఆవకాయ వేడి చేస్తుంది. గొప్ప గొప్ప సంగీత విద్వాంసులు ఆవకాయ తినరు. అసలు వేడిచేసే పదార్థా లేవీ తినరు "

"నేను సంగీత విద్వాంసుణ్ణి కాదు!"

"అయితేనేం. మీరొక గొప్ప ఉపన్యాసకులు కాబోతున్నారు."

నాకు వళ్లు మండింది. కాని కమలతో వాదించి లాభంలేదు. వేడి మంచినీళ్లు తాగాల్సిందే, ఆవకాయ మానాల్సిందే. రెండు అతి దుర్గమ కార్యాలు ప్రేయసికోసం చెయ్యాల్సిందే. పాపం! వా డెవడో సప్తసముద్రాలూ దాటి, రాక్షసులని చంపి, ఏవేవో తంటాలు పడ్డాడు. వాడికన్నా నా పరిస్థితి నయమే ననిపించింది.

"మీరు రాత్రిళ్లు ఎక్కువసేపు మేలుకోకూడదు. అలా మేలుకుంటే మీ ఆరోగ్యం చెడిపోతుంది. మీ ఆరోగ్యంలో ఏమాత్రం తేడా వచ్చినా ఆదివారం ప్రోగ్రాం తలక్రిందయిపోతుంది. అన్నట్టు మరచాను, రాత్రిళ్లు మీరు ఓవల్టిన్ బదులు మిరియాల పొడి వేసిన వేడి పాలు త్రాగాలి. మిరియాలు గొంతుకకు మంచివి."

మై గాడ్! ఇది మూడో త్యాగం! నిముష నిముషానికీ నే చెయ్యవలసిన త్యాగాల 'లిస్టు' పెరిగిపోతోంది.

"చూడు కమలా! అసలు ఇన్ని జాగ్రత్తలు అవసరమంటావా?"

ఈసారి కమల చిరునవ్వు నవ్వింది. "తప్పకుండా! మా క్లబ్బు మహిళలంతా మీ ఉపన్యాసంకోసం ఎంత ఆతృతతో ఎదురు చూస్తున్నారో మీకు తెలియదు!" ఆమె గంభీరంగా మొహంపెట్టి చెప్తూంటే ఆమెకు నిరాశ కల్గించేశక్తి నాకు లేదని తెలిసింది.

మర్నాడు ప్రొద్దున్న ఫలహారంచేస్తూ, ఎదురుగా కమల తలలో పెట్టుకున్న గులాబీరేకుల్లో ఎర్రదనం పరిశీలిస్తున్నాను. ప్రకృతి గులాబీరేకుల్లో కొంతవరకే అందం, మృదుత్వం పెట్టగలిగిందిగాని, కమల చెక్కిళ్లలో మిగిలిన సౌకుమార్యం అంతా పొందుపరచగలిగిందికదా అనుకున్నాను.

"మరొక ముఖ్యవిషయంలో మీ సహకారం

గావాలి" అంది కమల, ఆమె కళ్ళలో ఒక అభ్యర్థన కనపరుస్తూ.

"ఏమిటది?" అన్నాను, ప్రకృతి కమలయందు చూపిన మరొక ప్రత్యేకతను ఆలోచిస్తూ. గులాబీకి ముళ్ళున్నాయి. కాని కమల అందంలో......

"మీ రీ నాలుగురోజులూ టెన్నిస్ మానెయ్యాలి. కారు డ్రైవింగ్ చెయ్యొద్దు. రెండూ ప్రమాదకరమైన పనులే. వాటిల్లో ఎద్దైనా దెబ్బ తగిలితే మీ ఉపన్యాసం నిల్చిపోవచ్చు...."

"అరె! మరి క్లబ్బుకు వెళ్తే టెన్నిస్ ఆడకుండా ఉండడం ఎలా? నా ఫ్రెండ్సంతా నవ్వరూ?"

"అందుకు ఒక అద్భుతమైన ఉపాయం ఆలోచించాను. మీ రీ నాలుగు రోజులూ క్లబ్బుకే వెళ్లద్దు!"

ఇంతకన్నా విపరీత మేమైనా ఉంటుందా? ఈ ఉపన్యాసంకోసం నేను క్లబ్బు మానెయ్యాలట! ఒక్కసారి గట్టిగా అరుద్దామనిపించింది. హిందీ సినిమాల్లో హీరోలా గంతులేద్దామనిపించింది. ('అయ్యయ్యో!—సూక్కూ! సూక్కూ!) అనాలనిపించింది. అయినా కమలకళ్ళవైపు చూడగానే ఆమెకోరికను కాదనడం అంత మంచిపని అనిపించలేదు. 'నాకోసం సప్తసముద్రాలూ దాటలేవూ?' అని అడిగిన రాజకుమార్తెకు, రాజకుమారుడు 'అబ్బే! సముద్రం కాదుకదా, పైడుకాలువ కూడా దాటలేను' అని చెప్తే ఏం బావుంటుంది? రాజకుమార్తె సంగతెలావున్నా, ముందర 'ఆడియన్సు' వాడిని పట్టిస్తారు.

మర్నాటినుంచీ నాకొకటే ధ్యాస! ఈ మహిళా సమాజం హఠాత్తుగా కూలిపోకూడదూ! ఒక్క పిడుగు చాలు! భూకంపమైనా సరే! ఊహూ! ఏమీ జరగలేదు! వేణ్ణీళ్ళూ, చప్పటి మెతుకులూ, ఇంట్లో జైలు జీవితం, కమల రాసిచ్చిన ఉపన్యాసంతో కుస్తీ పట్టడంతో, నాల్రోజులూ గడిచిపోయాయి. ఒక్కసారిగా నాకు నెపోలియన్‌మీద జాలివుట్టింది. అదేదో ద్వీపంలో వాడెంత బాధపడ్డాడో! క్లబ్బు మానేసి, టెన్నిస్‌మానేసి, అంత బాధా నేనూ పడవలసి వచ్చిందికదా! నాబాధ ఎవరి కర్థం అవుతుంది? అద్దంలో నారూపం, రెండుగా చీలిపోయి (సినిమాలోలాగ) ఒకటి "నువ్వు నిన్ను వంచించుకుంటున్నావు. ఎందుకొచ్చిన బాధ ఇది? ఆ కాగితాలు చింపి పారెయ్. వీధ్దున్న మొయిలెక్కేసి మద్రాసు వెళ్ళిపో. అర్జంటు పని ఉందని బుకాయించు' అని చెప్తుంటే మరొక రూపం 'నిన్ను నమ్మిన అనాయకురాలు, కమల్ని నువ్వు వంచిస్తావా? నీమీద ఎన్ని ఆశలు పెట్టుకుంది! ఎంత బాధపడుతోంది! హిందూధర్మం ప్రకారం నువ్వు ఎంత త్యాగంచేస్తే తప్పేముంది?' అని చెప్తున్న ట్లనిపించేది. చివరికి హిందూధర్మమే జయించేది. త్యాగం ఫలించేది.

ఆదివారం సాయంకాలం నీటుగా సూటేసుకొని నేనూ, గులాబీరంగు పట్టుచీరతో ముస్తాబై కమలా కారులో మహిళాసమాజానికి బయల్దేరాం.

"లేడీస్‌క్లబ్బు" చాలా అందంగా అలంకరించారు రంగుకాగితాల తోరణాలతో. మేము కారు దిగగానే సెక్రటరీ సరళాదేవివచ్చి మమ్మల్ని ఆహ్వానించి మీటింగుకు కొద్దిగా వ్యవధి ఉందని, ఒక గదిలోకి తీసుకువెళ్ళి, కూచోబెట్టింది. అంతమంది ఆడవాళ్లమధ్య వొంటరిడం నా చికాకనిపించిందిగాని,లా నా కష్టమంతా కొద్ది సేపట్లో తీరిపోతుందికదా అన్న ధైర్యంతో ఓపికపట్టాను. కమల తను ఒక స్నేహితురాల్ని కలుసుకోవాలని చెప్పి వెళ్లింది. నేను ఒక్కణ్ణే కూచొని ఏవో మేగజైన్లు తిరగేస్తున్నాను.

"హల్లో భూషణ్!" అంటూ ఒక పొలికేళ్ళ యువతి గదిలోకి ప్రవేశించింది. బాగా లావెక్కినా, ఆ గుండ్రటి మొహం, ఆ పెద్దకళ్ళూ నాకు పరిచయమైనవే. అవి ఎవరో కాదు. "ప్రేమ్" నా కాలేజీ రోజుల్లో మిక్సెడ్ డబుల్సు పార్ట్నర్. పూర్తి పేరు ప్రమీల. ఆమెవెనకాల నలుగురు యువతీమణులు ప్రవేశించారు.

"హల్లో ప్రేమ్, ఎన్నాళ్లయింది నువ్వు ఫారిన్ నుంచి వచ్చి?"

"రెండేళ్లయింది. ఈ ఊళ్ళోనే ఉమెన్సు కాలేజీలో ప్రిన్సిపాలుగా ఉన్నాను. వీరంతా నా లెక్చరర్సు" అని తక్కిన యువతీమణుల్ని పరిచయం చేసింది. కొద్ది నిముషాలపాటు వెనకటిరోజులు గుర్తుకు తెచ్చుకున్నాం. ఇంతలో కమల వచ్చింది. నేను కమలను 'ప్రేమ్'కు పరిచయంచేశాను. "కమలా! 'ప్రేమ్' ఎంత పెంకెదనుకున్నావు! నాతోతప్ప మరెవరితోనూ పార్ట్నర్‌గా ఉండడాని కిష్టపడేదికాదు. ఒకసారి ఏమయిందంటే 'డ్రా' లో నాకు లక్ష్మీ పార్ట్నర్‌గానూ, ప్రేమ్‌కు ప్రసాద్ పార్ట్నరుగానూ పడ్డారు. ఇహ చూసుకో! ప్రేమ్ ఇంక తను ఆడనని కూచుంది. ఎంతమంది బ్రతిమాలినా ఒప్పుకోలేదు. చివరికి ప్రిన్సిపాలుగారు 'డ్రా'మార్పించి ప్రేమ్‌ను నా పార్ట్నర్‌గా వేశాక ఆడింది" అన్నాను. అందరూ నవ్వారు. కమల, ప్రేమ్‌వంకా నావంకా పరీక్షగా చూస్తోంది. ప్రేమ్ కళ్లన్నీ నామీదేఉన్నాయి.

"అంతలాగ కలిసి మెలిసి తిరిగినా, నేను కాలేజీ నుంచి బయటికి రాగానే నన్ను మర్చిపోయావుగా?" అంది ప్రేమ్ నవ్వుతూ.


"నేనేం మర్చిపోలేదు. ఇంగ్లండు వెళ్ళిపోయి, నువ్వే మమ్మల్నందర్నీ మర్చిపోయావు" అన్నాను. మళ్లీ అంతా నవ్వారు. కమల నవ్వటంలేదు సరికదా, మొహం అదోకలా పెట్టింది.

"నేను లండన్‌లోఉండగా రెండుత్తరాలు నీపేర వ్రాశాను. వాటికి నువ్వు జవాబియ్యకపోయేసరికి, నీ అడ్రసు మారిపోయుంటుందనుకుని మరి రాయలేదు" అంది ప్రమీల. నేను జవాబిద్దామనుకుంటూండగా సరళాదేవివచ్చి మీటింగు ప్రారంభమౌతోందని మమ్మల్ని తీసికెళ్లింది.

ప్రార్థనా, సెక్రటరీ రిపోర్టూ, వగైరాలు జరిగాక, నా ఉపన్యాసం ప్రారంభించాను. నన్ను గురించి నేను పొగుడుకోకూడదుగాని—నా ఉపన్యాసం అద్భుతంగా ఉంది! చప్పట్లకు లెక్కేలేదు! మీటింగు ముగియగానే 'ప్రేమ్'తో సహా అరడజనుమంది ఆడవాళ్లు నన్ను చుట్టుముట్టేసి, పొగడ్తలతో ఆకాశానికెత్తేశారు. 'ప్రేమ్' తమ కాలేజీ వార్షికోత్సవానికి నేనే అధ్యక్షత వహించాలని మరీ మరీ చెప్పింది.

కారులో ఇంటికి తిరిగివస్తూ, నా ప్రక్కన మౌనంగా కూర్చున్న కమలను "ఏం కమలా? ఎలా వుంది నా వాగ్ధోరణి?" అని అడిగాను.

"మీకు మాటలు చెప్పడం పుట్టుకతో అబ్బిన కళ!" అంది.




లాభదాయకమైన లఘుపరిశ్రమ ప్రారంభించండి

"అధునాతన కుటీర పరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమలలో వున్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమను గూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడి పదార్థాలు లభించే చోట్లు, ముడి పదార్థాల కొనుగోలుకు, కావలసిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం – యిందులో వున్నాయి. లఘు పరిశ్రమలు ప్రారంభించ దలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగిన పరిష్కార మార్గాలు యిందులో వున్నాయి. పుటలు 878, సుమారు 800 బొమ్మలు, ధర రూ. 13/- తపాలరుసుము రూ. 1-61. Phone: 229835.

COTTAGE INDUSTRY, (WN-34),
P.B. 1262, Jamuna Road, Delhi - 6.

రక్తవిరోచనములకు



చిట్కా-(హోమియో)
మూడుపూటలలో మూడు మోతాదులకే నయమగును. ఇంజక్షన్లు అనవసరం. తొమ్మిదిమోతాదులతోపూర్తి నిర్మూలం. 9 మోతాదులు రు1-50వి.పి.ఛార్జి ప్రత్యేకం

Professor RAM, M.I.B-M (U.S.A)
Mesmerist& Spiritualist,
Eluru (Andhra)

నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడ నవసరంలేదు. ఈ వ్యాధి నిర్మూలనకు గాను 30 సం॥ల పరిశోధనా ఫలితముగా లభ్య పరచుకొనబడి, పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదౌషధం. ఎంత ముండి వ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ॥ రు. 3-75. పోస్టేజి ప్రత్యేకం.

ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

ఉచితమైన



మీరు కొను ప్రతి ఓకే తయారీ వస్తువుతోగల బహుమాన కూపనులను చేర్చిపెట్ట ప్రారంభించి, వానికి మారుగా ఇవ్వబడు ఆత్యాకర్షకమైన స్టెయిన్‌లెస్‌స్టీల్ పాత్రలను – మీకు ఇష్టమైన పరిమాణ ప్రమాణాలలో – మీకు అతి సమీపమునగల ఓకే వ్యాపారివద్దనుండి పొందండి.



తయారుచేసినవారు: ది ఈస్ట్ ఏష్యాటిక్ కం. (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్.,
మదరాసు-1

EP-EAC-3 TEL



సర్వ గర్భాశయ వ్యాధులను పోగొట్టి, ఆరోగ్యమును సంతానమును కలుగజేయును. అన్నిచోట్ల దొరకును. సీసా 2-8-0

కృష్ణాలేబరేటరీ బెజవాడ

లేడీస్ క్లబ్బు

"ఏమిటనుకున్నావు మరి! నిజంగా మీ ఆడియున్ను చూస్తుంటే ముచ్చట వేస్తుంది. అసలు వాళ్ల ప్రోత్సాహంతో మరింత బాగా మాట్లాడేశాను అనుకోకుండా! ఇంత మంచి ఆడియున్సును ఎక్కడా చూడలేదు. వాళ్ల కల్చరూ, వాళ్ల టేస్టూ"

"వాళ్ల బ్యూటీ, వాళ్ల ఎట్రాక్షనూ'—అందులో కొందరిలో మరీ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది!"

కమల వ్యంగ్యంగా మాట్లాడుతోం దనిపించింది. అంతేకాకుండా ఆమెలో నిముషనిముషానికీ ఆవేశం హెచ్చుతూన్నట్లు కనిపించింది. నేను, ఇల్లు చేరే వరకూ మౌనం వహించాను.

ఇంట్లో ప్రవేశించగానే, కమల విసురుగా వెళ్ళిపోబోతూంటే, నేనే ఆపి "కమలా! నా ఉపన్యాసం అంతా బాగుందని మెచ్చుకున్నారు. నీ అభిప్రాయమేమిటో చెప్పావుకాదు" అన్నాను.

"నే చెప్పడమెందుకూ? ప్రమీల చెప్పిందిగా!" అని, విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

అప్పుడు నా కర్థమైంది. ప్రమీల మాటల్ని వివర్నైనా అపార్థంచేసుకుంటారని అంతవరకూ నాకు తోచలేదు. మూడేళ్ల దాంపత్యజీవితంలో ఇటువంటి సంఘటన నెదుర్కొనడం ఇదే మొదటిసారి. కమల చాలా తెలివైనదనుకున్నాను. కాని, ఆమెలో ఇంత అసూయ ఉందని నాకు తెలియదు. నిజమే! బహుశా అదంతా నామీద ప్రేమ కావచ్చు! కాని ఎలాగబ్బా, ఇలా అడుగడుక్కీ అనుమానించే వ్యక్తితో కాపురం చెయ్యడం? తనకోసం నేను ఇన్ని తిప్పలుపడి ఈ ఉపన్యాసమిస్తే, తను నా కిచ్చే ప్రతిఫలం ఇదీ! సరే! నాకూ ఆత్మగౌరవం ఉంది, నేనూ నిర్లక్ష్యంగా ఉండగలను. అయినా తప్పు నామీద ఉంచుకోదల్చుకోలేదు.

వెంటనే పెట్టె అడుగునవున్న ప్రేమ్ నాకు ఇచ్చిన ఫోటో బయటకు తీశాను. అది తీసుకొని, కమల గదిలోకి వెళ్లాను. టేబిలుమీద మొహం పెట్టుకొని కమల దుఃఖిస్తోంది. నేను మాట్లాడకుండా ఫోటో వెనక వైపున ప్రేమ్ రాసిన "నాకు ఈ ప్రపంచంలో అందరివద్దకన్నా ఎక్కువగా సోదర ఆత్మీయతే లభించిన భూషణ్ కు" అన్న వాక్యాలు కన్పించేట్లు, ఆమె తలప్రక్కన టేబిలుమీద ఫోటో పెట్టేసి బయటకు వచ్చేశాను.

వరండాలో నుల్చొని ఆకాశంవైపు చూశాను. చంద్రుడు వంటరిగా ఉన్నాడు. ప్రకృతి ప్రశాంతంగా ఉంది. నాకు ఏదో దిగులనిపించింది. కమలను ఎలా ఓదార్చాలా ? అని ఆలోచించాను. అసలు నేను అంత ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవటం పొరబాటనిపించింది. ఎందుకంటే ఆమె దిగులుగా వుంటే నేను బ్రతకలేననిపిస్తుంది. కాని ఆమె నెప్పుడూ దిగులులేకుండా ఎలా ఉంచడం?

నా భుజంమీద చల్లని మృదుహస్తస్పర్శతో వెనక్కి తిరిగాను. నా కమల! అప్పుడనిపించింది, కమల్ని పెళ్ళి చేసుకోవడం పొరబాటే—కాని, అందుకు చింతించ నవసరంలేదని. ★

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street Madras-1. Chief Editor : S. Sambhu Prasad


అంద
చందమునకు
రెమి
స్నో & పౌడర్
Remy
Remy
Aykan